తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 20.05.2025 | సంపుటి :11 సంచిక : 301 | పేజీలు :12 వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# సాగుకు సౌరవిద్యుత్

## నల్లమలను అభివృద్ధి చేసిన ఆదర్శంగా నిలుపుతాం: సీఎం రేవంత్



- నల్లమల డిక్లరేషన్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు
- రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు
- ప్రధాని అంటే ఇందిరలా ఉండాలనే చర్చ వచ్చింది..
- ఇందిర సౌర గిరిజల వికాసం' పథకం ప్రారంభించిన సీఎం

అమ్రాబాద్,మే19(జనంసాక్షి)

నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నామని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరిజల వికాసం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'నల్లమల డిక్లరేషన్'ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరి జనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు చేపడతామని తెలిపారు. అనంతరం నల్లమల ప్రాంతం గురించి సీఎం ప్రసంగించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారని నాటి రోజులను సీఎం గుర్తు చేశారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే తన గుండె ఉప్పొంగిపోతోందన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తామని శుభవార్త చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుసామని అన్నారు. దిగ్గజ కంపెనీలతో పోటీపడేలా శిల్పారామం దగ్గర మహిళలకు స్టాళ్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి భోజనం చేసి వచ్చానని గుర్తు చేశారు. నేడు ప్రతి పేదవాడి ఇంటికీ సన్న బియ్యం అందుతోందని తెలిపారు. ఇప్పటి వరకు రైతుల కోసం రూ.60వేల కోట్లు- ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు.

మిగతా 2లో..

### నల్లమల డిక్లరేషన్ చారిత్రాత్మకం

- గిరిజనుల జీవితల్లో వెలుగులు నింపేది
- రూ.వెయ్యికోట్లతో రాజీవ్ యువవికాస్
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క

వార్త 2లో



## ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు నిధులు విడుదల

### ఇప్పటి వరకు 5,364 ఇందిరమ్మ ఇళ్లకు రూ.53.64 కోట్ల చెల్లింపులు:మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ఇప్పటి వరకు 5,364 ఇందిరమ్మ ఇళ్లకు రూ.53.64 కోట్లు చెల్లించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 21,104 ఇళ్ల గ్రౌండింగ్ జరిగిందన్నారు. ప్రతి సోమవారం

మిగతా 2లో..

## తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు మునీర్‌కు మేమున్నాం

- ఆయన ఆరోగ్య స్థితిపై ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ ఆరా
- కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్
- 'జనంసాక్షి' విజ్ఞప్తికి అపూర్వ స్పందన
- మునీర్ కోలుకోవాలని కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు

హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమకారుడు, సింగరేణి సకల జనుల సమ్మె కన్వీనర్, సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆయన త్వరగా కోలుకోవాలని సర్వత్రా ఆకాంక్ష వ్యక్తమవుతోంది. ఎంతోమందిని జర్నలిస్టులుగా తీర్చిదిద్ది, కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో తనదైన ముద్రవేసిన మునీర్ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయనకు అండగా సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించాలని 'జనంసాక్షి' సోషల్ మీడియాలో విజ్ఞప్తి చేసింది. ఇది రాష్ట్రవ్యాప్తంగా వైరల్ కావడంతో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం స్పందించారు. గచ్చిబౌలిలోని ఓమెగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మునీర్‌కు మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి వైద్యులకు, యాజమాన్యానికి సూచించారు. ప్రభుత్వం తరపున అన్నివిధాలా అండగా ఉంటామని, కుటుంబ సభ్యులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సహాయం అందించాలని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు.

స్పందించిన కేటీఆర్ జర్నలిస్ట్ మునీర్ ఆరోగ్య పరిస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సైతం తాజాగా

మిగతా 2లో..



## పరిహారం సరే.. ప్రమాదాలు జరగకుండా చూడాలి

### అందాల పోటీల మీదే కాదు.. అగ్ని ప్రమాదాలపైనా దృష్టిపెట్టాలి:కేటీఆర్




హైదరాబాద్ (జనంసాక్షి): అందాల పోటీల మీదే కాదు.. అగ్ని ప్రమాదాల మీద కూడా దృష్టి పెట్టాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అగ్ని ప్రమాదాల్లో మరో ప్రాణం పోకుండా ప్రభుత్వం చూడాలన్నారు. చార్మినార్ పరిధి గుల్జార్‌హౌజ్ సమీపంలో అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని ఆయన పరిశీలించారు. తాను రాజకీయంగా మాట్లాడటానికి

మిగతా 2లో..

## అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్‌కు క్యాన్సర్

### విషయం తెలిసి చాలా బాధపడ్డాం: ట్రంప్

వార్త 9లో

## నీ క్షమాపణలు క్షమార్హం కాదు

### కల్నల్ ఖురేషిపై మంత్రి కున్వర్ విజయ్ షా వ్యాఖలు శిక్షార్హం

- మొసలి కన్నీరు కారిస్తే సరిపోదు
- సిట్ విచారణకు ఆదేశించిన సుప్రీం

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆర్మీ అధికారిణి కర్నల్ సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షాపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ విషయంలో ఆయన క్షమాపణలను అంగీకరించలేమన్న అత్యున్నత న్యాయస్థానం.. మంత్రి వ్యాఖ్యలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరపాలని ఆదేశించింది. అయితే, ప్రస్తుతానికి ఆయన అరెస్టుపై స్టే విధించింది.' 'క్షమాపణలు ఎక్కడ చెప్పారు? ఎలా చెప్పారు? సారీ చెబుతున్నప్పుడు అందులో కొంత అర్థం ఉండాలి. కొన్నిసార్లు న్యాయ విచారణను తప్పించుకునేందుకు కొందరు మర్యాదపూర్వకంగా మాట్లాడినట్లు నటిస్తారు. మరికొన్నిసార్లు మొసలి కన్నీరు కారుస్తారు. ఇందులో మీ క్షమాపణ

మిగతా 2లో..



### భారత్ ధర్మసత్రం కాదు

శరణార్థులకు ఆశ్రయం ఇవ్వలేం సుప్రీంకోర్టు సంచలన తీర్పు

2లో

### హైకోర్టు న్యాయమూర్తులందరికీ సమాన పెన్షన్ ఇవ్వాలి

కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

## పహల్గాందాడికై ఉగ్రవాదులకు సమాచారమిచ్చిన జ్యోతి మల్హోత్రా

### విచారణలో తీగలాగితే కదులుతున్న డొంక

- ఘటనకు కొద్దిరోజుల ముందే పహల్గాంను సందర్శించిన యూట్యూబర్
- అక్కడ ఫోటోలు, వీడియోలు చిత్రీకరణ
- వాటిని పాక్‌కు పంపినట్లు నిర్ధారణ
- బయటపడుతున్న విస్తుపోయే నిజాలు
- నిఘా ఏజెంట్లతోనూ సంబంధాలు
- పాక్ హైకమిషన్ వ్యక్తితో కలసి ఉన్న ఫోటోలు గుర్తింపు
- హైదరాబాద్‌లోనూ పలుసార్లు పర్యటన

న్యూఢిల్లీ(జనంసాక్షి):పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పహల్గాంలో ఉగ్రదాడి జరగడానికి కొన్ని

మిగతా 2లో..



### పాకిస్థాన్ కోసం గూఢచర్యం

2లో

- పెరుగుతున్న దేశ ద్రోహుల జాబితా
- తాజాగా హర్యానా నుహ్‌లో మరొకరి అరెస్ట్
- అరెస్టైన వారంతా ఐఎస్ఐకు సహకరిస్తున్న వారే

## చురుగ్గా నైరుతి రుతుపవనాలు

రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు

## సైనిక చర్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారా?

రైల్వే టికెట్లపై ఆపరేషన్ సిందూర్ ప్రచారంపై కాంగ్రెస్ విమర్శలు

## జన్ సురాజ్ పార్టీ తొలి జాతీయ అధ్యక్షుడిగా ఉదయ్ సింగ్

ప్రశాంత్ కిశోర్ ప్రకటన

## భారత్‌తో వాణిజ్య సమస్యలు పరిష్కరించుకుంటాం

బంగ్లాదేశ్ తాత్కాలిక అధ్యక్షుడు మహమ్మద్ యూనస్

పై వార్తల వివరాలు 2లో

## గాజాను హస్తగతం చేసుకుంటాం

- నెతన్యాహు సంచలన ప్రకటన
- దౌత్య కారణాలకు లోబడి గాజాలో క్షామాన్ని నివారించాల్సిన అవసరాన్ని గుర్తించామని వెల్లడి



గాజాస్ట్రిప్(జనంసాక్షి):గాజా మొత్తాన్ని తమ అధీనంలోకి తీసుకుంటామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వెల్లడించారు. ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య ఉద్రిక్తతల వేళ గాజాలో మరోసారి దాడుల తీవ్రతను పెంచిన నేపథ్యంలో ప్రధాని నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.దౌత్య కారణాలకు లోబడి గాజాలో క్షామాన్ని నివారించాల్సి అవసరాన్ని తాము గుర్తించామని చెప్పారు. "మా పోరాటం తీవ్రస్థాయిలో ఉంది. మేం పురోగతి సాధిస్తున్నాం. ఆ ప్రాంతం మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకుంటాం. ఇందులో వెనక్కి తగ్గేదేలేదు. విజయం సాధించాలంటే.. మనల్ని అడ్డుకోలేరనే విధంగా వ్యవహరించాలి" అని టెలిగ్రామ్ వేదికగా నెతన్యాహు ఒక వీడియోను పోస్టు చేశారు. మరోసారి ఇజ్రాయెల్ గాజాపై దాడుల తీవ్రతను పెంచింది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరిపింది. ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26మంది.. మొత్తంగా 103 మంది మరణించారని స్థానిక ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్

మిగతా 2లో..

## కొనసాగుతున్న హైడ్రా కూల్చివేతలు


### కూకట్‌పల్లిలో అక్రమకట్టడాలు నేలమట్టం

ప్లాట్ల యజమానుల హర్షం

హైదరాబాద్(జనంసాక్షి):అల్విన్ కాలనీ: కూకట్‌పల్లి పరిధి హైదర్‌నగర్‌లోని డైమండ్ ఎస్టేట్ లేఅవుట్‌ను ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఇక్కడ ప్లాట్లను కొనుగోలు చేసిన 79 మంది బాధితులకు న్యాయం చేసింది. గత సంవత్సరం సెప్టెంబర్‌లో 79 మంది బాధితులకు ఈ స్థలం చెందుతుందని హైకోర్టు తీర్పునిచ్చింది. అయినా కబ్జాదారులు స్థలాన్ని ఖాళీ చేయకపోవడంతో బాధితులంతా హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్ డివిజన్‌లోని సర్వే నెంబర్ 145లో 9 ఎకరాల 27 గుంటల స్థలంలో డైమండ్ ఎస్టేట్స్ లేఅవుట్ విస్తరించింది. ఇందులో మధ్యతరగతి ప్రజలు 79 మంది

మిగతా 2లో..





## 'కాళేశ్వరం'కమిషన్ గడువు పొడిగింపు

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది.మరో రెండు నెలలపాటు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జులై నెలాఖరు వరకు గడువు పెంచుతున్నట్లు పేర్కొంది. ఇటీవల ఈ కమిషన్ విచారణను పూర్తి చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదికను

మిగతా 2లో..

## పాక్ మిస్సైల్స్‌ను ఎక్కడికక్కడ కూల్చేశాం

### వీడియో పోస్టు చేసిన ఇండియన్ ఆర్మీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ మెరుపు దాడుల్లో 100 మందికిపైగా ఉగ్రవాదులు చనిపోయారు. దీంతో రగిలిపోయిన పాక్.. వెంటనే భారత ఆర్మీ సదుపాయాలు, జనావాసాలే లక్ష్యంగా దాడులకు దిగింది. వందలాదిగా పాక్ డ్రోన్స్, మిస్సెల్స్‌ను భారత్‌పై ప్రయోగించింది. దీంతో ఎస్ 400, ఆకాశ్ తదితర మన గగనతల రక్షణ వ్యవస్థలు అద్భుత రీతిలో వాటిని నేలమట్టం చేశాయి. వాటిని ఎక్కడికక్కడ కూల్చేశాయి. దీంతో పాక్ డ్రోన్లు, మిస్సైళ్ల శకలాలు చెల్లాచెదురుగా పడ్డ వీడియోలు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. మన డిఫెన్స్ వ్యవస్థలు గోడలా వాటిని అడ్డుకున్నాయి.

మిగతా 2లో..



## తెలంగాణ ఉద్యమ జర్నలిస్టు
# మునీర్‌కు మేమున్నాం



మునీర్ కోలుకోవాలని కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు ఎక్స్ వేదికగా స్పందించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. మునీర్‌కు అన్నివిధాలుగా సాయం చేయాలని తన ఆఫీసు బృందానికి ఆదేశాలు జారీచేశారు. ఆయన కుటుంబ సభ్యులతోనూ ఫోన్‌లో మాట్లాడి భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని, ఎల్లవేళలా మీకు అండగా ఉంటామని హామీనిచ్చారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సహా పలువురు ప్రజాప్రతినిధులు కూడా మునీర్‌కు తోడుంటామని, కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని స్పందించారు. అదేవిధంగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా సహా పెద్దపల్లి పరిధిలో గల కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోని జర్నలిస్టులు మునీర్ కోలుకోవాలని పూజలు, ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. తమను జర్నలిస్టులుగా ప్రోత్సహించడంలో ఆయన కృషిని మరువలేమని గుర్తుచేసుకుంటున్నారు.

## నీ క్షమాపణలు క్షమార్హం కాదు..

ఎలాంటిది. ఏదో న్యాయస్థానం అడిగింది కాబట్టి చెబుతున్నా అన్నట్లుగా ఉంది మీ వ్యవహారం. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి మీకున్న అభ్యంతరం ఏంటీ?" అని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు."మీరో ప్రజాప్రతినిధిగా ఉన్నారు. అలాంటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రతీ పదాన్ని ఆచితూచి మాట్లాడాలి. మీ వీడియోను మేం చూశాం. చాలా అభ్యంతరకరంగా మాట్లాడారు. మీ వ్యాఖ్యల పట్ల యావత్ దేశం సిగ్గుపడుతోంది" అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం మంత్రి వ్యాఖ్యలపై విచారణ కోసం మంగళవారం ఉదయం 10 గంటల్లోపు సిట్‌ను ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. రాష్ట్రానికి చెందని ముగ్గురు ఐపీఎస్‌లు అందులో ఉండాలని, వారిలో ఒకరు ఎస్పీ ర్యాంక్ కలిగిన మహిళా అధికారి ఉండాలని సూచించింది. అయితే, ప్రస్తుతానికి అరెస్టు నుంచి మినహాయింపు కల్పించిన కోర్టు.. విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది.

పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆమెను విజయ్ షా 'ఉగ్రవాదుల సోదరి'గా పేర్కొనడంపై దుమారం రేగింది. దీంతో ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు.. ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆ మంత్రి సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఆయన క్షమాపణలు చెప్పాలని గత విచారణలో న్యాయస్థానం ఆదేశించింది.

## భారత్ ధర్మసత్రం కాదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):శరణార్థులకు భారత్‌లో ఆశ్రయం ఇవ్వలేమంటూ సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది.. భారత్ ధర్మశాల కాదు.. వివిధ దేశాల శరణార్థులకు భారత్ ఆశ్రయం ఇవ్వలేదు..తక్షణం శరణార్థులు దేశాన్ని వీడాలి అంటూ.. సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.. ఈ మేరకు శ్రీలంక శరణార్థులు వేసిన పిటిషన్ ను సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టివేసింది.. భారతదేశం ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు ఆతిథ్యం ఇవ్వగల ధర్మశాల కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.. శ్రీలంక తమిళ జాతీయుడి నిర్బంధంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది."భారతదేశం ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు ఆతిథ్యం ఇవ్వాలా? మనం 140 కోట్ల మందితో ఇబ్బంది పడుతున్నాము. ఇది మనం అన్ని ప్రాంతాల నుండి వచ్చే విదేశీయులకు వినోదం అందించగల ధర్మశాల కాదు" అని ధర్మాసనం అధ్యక్షత వహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు.యుఎపిఎ కేసులో విధించిన 7 సంవత్సరాల జైలు శిక్ష ముగిసిన వెంటనే పిటిషనర్ వెంటనే భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశించిన మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ కె వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారిస్తోంది. పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం ముందు మాట్లాడుతూ.. అతను శ్రీలంక తమిళుడని, వీసాపై ఇక్కడికి వచ్చాడని, తన స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని అన్నారు. పిటిషనర్ దాదాపు మూడు సంవత్సరాలుగా ఎటువంటి బహిష్కరణ ప్రక్రియ లేకుండా నిర్బంధంలో ఉన్నారని ఆయన తెలిపారు."ఇక్కడ స్థిరపడటానికి మీకు ఏ హక్కు ఉంది?" అని జస్టిస్ దత్తా ప్రశ్నించారు. పిటిషనర్ ఒక శరణార్థి అని, అతని భార్య, పిల్లలు భారతదేశంలో స్థిరపడ్డారని న్యాయవాది పునరుద్ఘాటించారు. చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన విధానం ప్రకారం పిటిషనర్ స్వేచ్ఛను హరించడం జరిగిందని, ఆర్టికల్ 21 ఉల్లంఘన జరగలేదని జస్టిస్ దత్తా అన్నారు. ఆర్టికల్ 19 ప్రకారం భారతదేశంలో స్థిరపడే ప్రాథమిక హక్కు పౌరులకు మాత్రమే అందుబాటులో ఉందని జస్టిస్ దత్తా తెలిపారు. పిటిషనర్ తన దేశంలో ప్రాణాలకు ముప్పు ఎదుర్కొంటున్నాడని న్యాయవాది చెప్పినప్పుడు, జస్టిస్ దత్తా స్పందిస్తూ "వేరే దేశానికి వెళ్లిపో" అని అన్నారు. ఇటీవల, రోహింగ్యా శరణార్థుల బహిష్కరణలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. 2015లో, పిటిషనర్‌ను, మరో ఇద్దరితో పాటు, %ఎజు% కార్యకర్త అనే అనుమానంతో %ఉ% బ్రాంచ్ అరెస్టు చేసింది. 2018లో, సెక్షన్ 10 కింద నేరానికి ట్రయల్ కోర్టు పిటిషనర్‌ను దోషిగా నిర్ధారించి 10 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. 2022లో, మద్రాస్ హైకోర్టు అతని శిక్షను 7 సంవత్సరాలకు తగ్గించింది.. కానీ అతను తన శిక్ష తర్వాత వెంటనే భారతదేశం విడిచి వెళ్లాలని.. అతను భారతదేశం విడిచి వెళ్లే వరకు శరణార్థి శిబిరంలోనే ఉండాలని ఆదేశించింది.2009లో శ్రీలంక యుద్ధంలో ఎల్‌టిటిఇ మాజీ సభ్యుడిగా పోరాడినందున, తనను శ్రీలంకలో బ్లాక్ గెజిటెడ్‌గా ఉంచారని పిటిషనర్ అన్నారు. అందువల్ల, తనను అక్కడికి తిరిగి పంపితే, అరెస్టు చేసి హింసిస్తారని అన్నారు. తన భార్య అనేక వ్యాధులతో బాధపడుతోందని, తన కుమారుడు పుట్టుకతో వచ్చిన గుండె జబ్బుతో బాధపడుతున్నాడని కూడా ఆయన అన్నారు. పిటిషనర్ తరఫున న్యాయవాదులు ఆర్.సుధాకరన్, ఎస్.ప్రభు రామసుబ్రమణియన్, ఏఎస్ఏఓఆర్ వైరవన్ వాదించారు.

## హైకోర్టు న్యాయమూర్తులందరికీ
# సమాన పెన్షన్ ఇవ్వాలి

– కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):కొంతమంది హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు తక్కువ పెన్షన్ ఇస్తుండడంపై తాజాగా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఇందులోభాగంగా.. హైకోర్టు మాజీ న్యాయమూర్తులందరికీ పూర్తిస్థాయిలో సమాన పెన్షన్ అందజేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగంలో చేరిన తేదీ, ఇతర విషయాలతో సంబంధం లేకుండా మాజీ న్యాయమూర్తులకు పెన్షన్ ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ న్యాయమూర్తులకు, అన్ని జిల్లాల న్యాయమూర్తులకు పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు సమానంగా ఉండాలని స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థకు ఉన్న స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి, గౌరవాన్ని నిలబెట్టడానికి న్యాయమూర్తుల జీతాల మాదిరిగానే, పదవీ విరమణ తర్వాత ప్రయోజనాలు కూడా ఒకేరకంగా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి అభిప్రాయం వ్యక్తంచేశారు. శాశ్వత, అదనపు న్యాయమూర్తుల మధ్య ఎటువంటి తేడాను చూపకూడదని పేర్కొన్నారు. వితంతువులు, ఇతర ఆధారపడిన వారికి గ్రాట్యూటీ, కుటుంబ పెన్షన్ వంటి ప్రయోజనాలు కూడా అందరు న్యాయమూర్తులకు ఒకేరకంగా అందించాలన్నారు.

# సాగుకు సౌరవిద్యుత్



గతంలో వరి వేస్తే ఉరే అని ఆనాడు అన్నారు.. ఆ దొర మాత్రం వందల ఎకరాల్లో వరి వేసుకున్నారు.. మీరు వరి పండిస్తే బోనస్ ఇస్తామని మేము చెప్తున్నాం.. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం.. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే ఎవరూ తినేవారు కాదు.. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకున్నాం. నిత్యావసరాల ధరలు తగ్గించడంలో మనమే నంబర్ వన్ అని కేంద్రం చెప్పింది.. శాంతి భద్రతల్లో కూడా మనమే నంబర్ వన్‌లోనే ఉన్నాం.. రాష్ట్ర ఆదాయంలో కూడా తెలంగాణ నంబర్ వన్ అని కేంద్రమే చెప్పింది.. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం రూ.60 వేల కోట్లు– ఖర్చు చేశాం అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగిపోతోంది. పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటున్నా. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు వాసులను పిలిచేవారు. ఇక్కడి ప్రజలు కట్టిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయి. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తాం. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తాం. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తాం అన్నారు. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ వచ్చింది. ఆమె గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేశారు. 50 ఏళ్ల తర్వాత ఇందిరాగాంధీ పేరు చెప్పుకొంటున్నాం. దేశానికి స్వేచ్ఛనిచ్చిందే కాంగ్రెస్. అందరికీ భూములు ఇచ్చి ఆత్మగౌరవం నింపాలన్నది మా పార్టీ నినాదం. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ ఉంటుందని రేవంత్ అన్నారు. అనంతరం సతీమణితో సహా సీఎం రేవంత్‌రెడ్డి కొండారెడ్డిపల్లె శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ సీఎం దంపతులు, మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభాపతి గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

### నల్లమల డిక్లరేషన్ చారిత్రాత్మకం

**గిరిజనుల జీవితల్లో వెలుగులు నింపేది**

**రూ.వెయ్యికోట్లతో రాజీవ్ యువవికాస్ ప్రారంభం**

**డిప్యూటి సింఎం మల్లు భట్టి విక్రమార్క**

అమ్రాబాద్,మే19(జనంసాక్షి):భూమి కోసం ఈ గడ్డపై పోరాటాలు జరిగాయని తెలంగాణ ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ రోజు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది అని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ప్రారంభ బహిరంగ సభలో డిప్యూటీ– సీఎం ప్రసంగించారు. నల్లమల డిక్లరేషన్ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..సంక్షేమం కోసం తెచ్చిన గొప్ప కార్యక్రమం ఇదని, అటవీ సంపద ఫలాలు పూర్తిగా గిరిజనులకే దక్కాలని చెప్పారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజన కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, భూములే కాదు వాటిని చదును చేసేందుకు నిధులు ఇస్తున్నామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రతి పైసా ప్రజలకే ఖర్చు చేస్తోందని, నిత్యం ప్రజల కోసం ఈ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో బతకాలనే ఈ కార్యక్రమం తెచ్చామని, తమపై చేసే అనవసర విమర్శలను కుట్రలగానే చూస్తామని అన్నారు. సంపద సృష్టిస్తాం.. సృష్టించిన సంపద పేదలకు పంచుతాం..ఇదే తమ నినాదమని భట్టి చెప్పారు. రూ.వెయ్యి కోట్లతో రాజీవ్ యువ వికాసం ప్రారంభి స్తున్నామని, జూన్ 2 న రాజీవ్ యువ వికాసం పత్రాలు కూడా ఇస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న దున్నేవాడిదే భూమి నినాదాన్ని ఇందిరా సౌర గిరి జిల్లా వికాసం వంటి పథకాల ద్వారా చట్టాలుగా అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క మల్లు అన్నారు.తెలంగాణ గడ్డపై ఉన్న నినాదాలు చట్టాలుగా మారాలంటే మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నారు. నల్లమల డిక్లరేషన్‌ను తూచా తప్పక పాటించి నాలుగు సంవత్సరాల్లో ఈ రాష్ట్ర గిరిజనులకు ఫలితాలు అందిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం ప్రారంభం భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజు.. దేశంలోనే గర్వించదగిన గొప్ప కార్యక్రమమని కొనియాడారు. గత ప్రభుత్వంలో గిరిజనులు పంట పండించు కోవడానికి వెళితే మహిళలని చూడకుండా చెట్టు–కు కట్టేసి కొట్టారని.. పురుషులపై పోలీసు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి చెంద వద్దని, ఫలితాలు ప్రజలకు అందవద్దని నిత్యం ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంపై ఒక మాట అన్న, కుట్ర చేసిన అది రాష్ట్ర ప్రజలపై కుట్రగానే భావిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. జూన్ 2న గిరిజన యువతకు రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకం ద్వారా 1000 కోట్లు మంజూరు చేయబోతున్నామని తీపి కబురు చెప్పారు.

## కొనసాగుతున్న హైడ్రా కూల్చివేతలు

2000 సంవత్సరంలో ప్లాట్లు కొనుగోలు చేశారు. అనంతరం ఆ స్థలం తనదని శివ దుర్గాప్రసాద్ అనే వ్యక్తి మరి కొంతమందితో కలిసి ఆక్రమణకు పాల్పడ్డాడు. అనంతరం ప్లాట్ల యజమానులను స్థలంలోకి రాకుండా హైకోర్టు నుంచి స్టే తీసుకువచ్చారు.దీంతో బాధితులందరూ కోర్టుకు వెళ్లి 2024 సెప్టెంబర్‌లో స్థలాలను దక్కించుకున్నారు. న్యాయస్థానం ప్లాట్ల యజమానులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా కబ్జాదారులు స్థలాన్ని ఖాళీ చేయలేదు. బాధితులను లేఅవుట్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. దీంతో వారంతా హైడ్రాకు ప్రజావాణిలో గోడును వెలిబుచ్చారు. ఈక్రమంలో హైడ్రా సోమవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాల తొలగింపు చేపట్టింది. దీంతో ప్లాట్ల యజమానులు హర్షం వ్యక్తం చేస్తూ హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

### 'కాళేశ్వరం' కమిషన్ గడువు పొడిగింపు

అందిం చనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై గతేడాది నుంచి విచారణ జరిపింది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై విచారించింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను ప్రశ్నించింది. వారి నుంచి అఫిడవిట్లు తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

## జన్ సురాజ్ పార్టీ తొలి జాతీయ అధ్యక్షుడిగా ఉదయ్ సింగ్

**పట్నా(జనంసాక్షి):**ఎన్నికల ప్రచార వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక ప్రకటన చేశారు. తాను స్థాపించిన రాజకీయ పార్టీకి తొలి జాతీయ అధ్యక్షుడిగా మాజీ ఎంపీ ఉదయ్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. పట్నాలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇకపై తాను ప్రజలకు చేరువయ్యే అంశంపై దృష్టిసారించనున్నట్లు తెలిపారు. పార్టీని నడిపించే బాధ్యతను ఉదయ్‌సింగ్, ఆర్‌సీపీ సింగ్...తదితర నేతలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. గతంలో నిలిచిపోయిన తన పాదయాత్రను మంగళవారం నుంచే పునఃప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. గతేడాది అక్టోబర్ 2న ప్రశాంత్ కిశోర్ జన్ సురాజ్ పార్టీని ప్రారంభించారు. అప్పటి నుంచి ఆ పార్టీ పూర్తిస్థాయి అధ్యక్షుడు లేకుండానే పనిచేస్తోంది.

## పాక్ మిస్సైల్స్‌ను ఎక్కడికక్కడ కూల్చేశాం

ఇప్పటికే పాక్‌పై జరిపిన పలు దాడుల వీడియోలను భారత సైన్యం విడుదల చేసింది. తాజాగా పాక్ మిస్సైల్స్‌ను ఎలా కూల్చారో తెలిసేలా వెస్ట్రన్ కమాండ్ ఎక్స్‌లో పోస్టు చేసింది. అగ్ని గోడలా భారత ఆర్మీ శత్రుదేశపు మిస్సైళ్లను కూల్చింది అని పేర్కొంది. తాజాగా ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన ఏడీ గన్‌పై రూపొందించిన మరో ప్రత్యేక వీడియోను వెస్ట్రన్ కమాండ్ అధికారులు సోషల్ మీడియాలో పంచుకున్నారు.'నేను ఏడీ(ఎయిర్ డిఫెన్స్) గన్.. శత్రువు కనిపిస్తే లేపేస్తా' అంటూ అది అత్యంత కచ్చితత్వంతో వైమానిక దాడుల దృశ్యాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి.

## గాజాను హస్తగతం చేసుకుంటాం

అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు ఇటీవల నెతన్యాహు వెల్లడించిన సంగతి తెలిసిందే.తాజాగా గాజాలోని రెండో అతి పెద్ద నగరమైన ఖాన్ యూనిస్, సమీప ప్రాంతాలను ఖాళీ చేయాలని స్థానిక ప్రజలకు ఇజ్రాయెల్ మిలిటరీ తాజాగా ఆదేశాలు ఇచ్చింది. వాటిని ప్రమాదకరమైన పోరాట ప్రాంతాలుగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు దోహాలో జరుగుతున్న చర్చల్లో హమాస్ బహిష్కరణ అంశాన్ని ఇజ్రాయెల్ తెరపైకి తీసుకొచ్చిందని తెలుస్తోంది. యుద్ధం శాశ్వతంగా ఆగాలంటే గాజా పాలన నుంచి హమాస్ వైదొలగాలని, ఆయుధాలు అప్పగించాలని, ఆ సంస్థ ఉగ్రవాదులంతా ఇతర దేశాలకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ డిమాండ్ చేస్తోంది. అయితే గాజా నుంచి వెళ్లడానికి, ఆయుధాల అప్పగింతకు తాము సిద్ధంగా లేమని హమాస్ చెప్పినట్లు తెలుస్తోంది.ఇటీవల పశ్చిమాసియా పర్యటనకు వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గాజా గురించి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. గాజాలోని పాలస్తీనియన్లు ఖాళీ చేయాలని గతంలో ప్రతిపాదించిన ట్రంప్.. దానిని అమెరికా నియంత్రణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "గాజా ఫొటోలను చూశాను. అక్కడ ఒక్క భవనమూ లేదు. అన్నీ కుప్పకూలాయి. ఆ శిథిలాల కిందే ప్రజలు ఉంటున్నారు. ఇది అంగీకారయోగ్యం కాదు. గాజాను అమెరికా తీసుకోవాలని అనుకుంటు న్నాను. స్వేచ్ఛా మండలంగా దాన్ని

## ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు నిధులు విడుదల

ఇందిరమ్మ ఇళ్లకు నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు. బేస్‌మెంట్ పూర్తయిన 1,383 .. గోడలు కట్టిన 224 ఇళ్లకు రూ. 16.07 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

## పరిహారం సరే.. ప్రమాదాలు జరుగకుండా చూడాలి

ఇక్కడికి రాలేదని చెప్పారు. ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు."రూ.5 లక్షల పరిహారం ఇవ్వడం కాదు.. ప్రాణాలపై దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబసభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ముఖ్యమంత్రే హోంమంత్రి కాబట్టి ఘటనా స్థలానికి వస్తే అధికారులు ఇంకా బాగా పనిచేస్తారు. వేసవి కాలం వచ్చే ముందు అగ్నిమాపక సిబ్బందితో ప్రభుత్వం సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. అగ్నిమాపక యంత్రాలు వచ్చాయి.. కానీ నీళ్లు లేవు. సిబ్బందికి సరైన మాస్కులు లేవని తెలిసింది. అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ లేకపోవడం దురదృష్టకరం. హైదరాబాద్‌లో ఇదే అత్యంత భారీ అగ్ని ప్రమాదం. నిన్నటిరోజు దుర్భరమైన రోజు.. బాధితులు, మృతుల కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణనాతీతం" అని కేటీఆర్ తెలిపారు.

### చురుగ్గా నైరుతి రుతుపవనాలు

**హైదరాబాద్(జనంసాక్షి):** బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది.బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమోరిన్ సహా బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.మరోవైపు అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి.

## పహల్గాందాడికి ఉగ్రవాదులకు సమాచారమిచ్చిన జ్యోతి మల్హోత్రా

నెలల ముందు ఆమె ఆ ప్రాంతానికి వెళ్లినట్లు దర్యాప్తులో వెల్ల డైంది. ఇక, పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధా లున్న ఆ దేశ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతికి సన్నిహిత సంబంధాలున్నట్లు తెలిసింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై భీకర ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు మూడు నెలల ముందు జ్యోతి పహల్గాం వెళ్లి అక్కడ వీడియోలు తీసినట్లు సమాచారం. ఆ సమాచారాన్ని పాక్ ఏజెంట్లకు చేరవేసి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గూఢచర్యం ఆరోపణల కింద గతవారం జ్యోతిని హరియాణా పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఆమె గురించి అనేక విషయాలు బయటికొచ్చాయి. పహల్గాం దాడికి ముందు ఆమె పలుమార్లు పాకిస్థాన్‌లో పర్యటించిందని, ఒకసారి చైనాకూ వెళ్లొచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో ఆమె ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలోని అధికారి డానిష్‌తో టచ్‌లో ఉన్నట్లు నిర్ధరించారు. జ్యోతిని అతడు ట్రాప్ చేసినట్లు గుర్తించారు. ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్ జో పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తోంది. 2023లో పాక్‌కు వెళ్లిన సమయంలో డానిష్ ఆమెకు పరిచయమయ్యాడు. భారత్‌కు వచ్చిన తర్వాత కూడా అతడితో సంప్రదింపులు కొనసాగించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అతడి సూచన మేరకు.. అలీ అహ్సాన్ అనే వ్యక్తిని ఆమె కలిసింది. అతడు పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను జ్యోతికి పరిచయం చేసినట్లు సమాచారం. దేశ రక్షణకు చెందిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని ఆమె పాక్ వ్యక్తులకు చేరవేసినట్లు అధికారులు ఆరోపించారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను కూడా భారత్‌లో నిలిపివేశారు.పాకిస్తాన్ కు కీలకమైన భారత ఆర్మీ సమాచారాన్ని చేరవేస్తున్నట్లు– గుర్తించి అరెస్ట్ చేసిన హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా గూఢచర్యం కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాకిస్తాన్ నిఘా ఏజెంట్లతో ఆమె సన్నిహితంగా ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 26 మంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడి జరిగిన రెండు రోజుల తర్వాత న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌కు కేక్ తీసుకువస్తున్న వ్యక్తితో మల్హోత్రా కలిసి ఉన్న ఓ ఫోటో బయటకొచ్చింది. పాకిస్తాన్ పర్యటన సందర్భంగా.. జ్యోతి తాను హాజరైన పార్టీలో కేక్ తెచ్చిన వ్యక్తిని కలిసినట్లు– ఉన్న ఫోటో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. దీంతో జ్యోతిపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న ఆ దేశ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతికి సన్నిహిత సంబంధా లున్నట్లు– ఇప్పటికే అధికారులు గుర్తించారు. భారత్– పాకిస్తాన్ మధ్య వివాదం తరువాత, పోలీసులు, వివిధ నిఘా సంస్థలు దేశవ్యాప్తంగా సామాజిక వ్యతిరేక శక్తులపై చర్యలను ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో పాకిస్తాన్ సహకారంతో గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై జ్యోతి మల్హోత్రాతోపాటు– ఇప్పటిరకు 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

## పాకిస్థాన్ కోసం గూఢచర్యం

న్యూఢిల్లీ,(జనంసాక్షి):పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్న పలువురు భారతీయుల్ని అధికారులు గుర్తించి ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తున్నారు. ఇప్పటికే హర్యానా, పంజాబ్, యూపీలో దాదాపు ఎనిమిది మంది గుఢచారులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అరెస్టయిన వారిలో విద్యార్థి, యూట్యూబర్, వ్యాపారవేత్త, గార్డ్ తదితరులు ఉన్నారు. తాజాగా మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. హర్యానా లోని నుహ్‌లో ఓ అనుమానితుడిని అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడు మేవాట్ జిల్లా టౌరు తహసీల్‌లోని కంగర్కా గ్రామానికి చెందిన మహ్మద్ తారీఫ్‌గా గుర్తించారు. అతడు పాక్ ఏజెంట్లకు భారత సమాచారాన్ని చేరవేస్తున్నట్లు గుర్తించారు. కాగా, నుహ్‌లో ఇప్పటికే ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రజక గ్రామానికి చెందని అర్మాన్‌ను గూఢచర్యం ఆరోపణలపై రెండు రోజుల క్రితం అరెస్ట్ చేశారు. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నారన్న ఆరోపణలపై ఇప్పటికే దేశవ్యాప్తంగా మొత్తం ఎనిమిది మంది అనుమానితుల్ని అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారిలో గజాలా (పంజాబ్), యాసీన్ మొహమ్మద్, నోమాన్ ఇలాహి (యుపీ), 26 ఏళ్ల అర్మాన్ (నుహ్), 25 ఏళ్ల దేవేంద్ర సింగ్ ధిల్లాన్ (కైతాల్), మహమ్మద్ ముర్తజా అలీ (జలంధర్), జ్యోతి మల్హోత్రా (హర్యానా యూట్యూబర్), షహజాద్ (యుపీ మొరాదాబాద్) ఉన్నారు. తాజా అరెస్ట్‌తో తొమ్మిది మంది గూఢచారులను అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు అయ్యింది. వీరంతా పాక్ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ కోసం పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు.తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లు–..తమ స్వార్థం కోసం తల్లిలాంటి దేశానికి ద్రోహం చేస్తున్న వాళ్లు వీరంతా అని చెప్పుకోవాలి. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో మొదలుపెడితే.. ఇప్పటి వరకు పాక్ కోసం పని చేస్తున్నట్లు– భావిస్తున్న 11 మంది గూఢాచారులు బయటపడ్డారు. భారత్, పాక్ యుద్ధం తర్వాత పోలీసులు, నిఘా వర్గాలు, ఇతర అధికారుల చేతికి వీరు చిక్కారు. వీరంతా హర్యానా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు కావటం గమనార్హం. ఆ 11 మంది గురించిన వివరాల్లోకి వెళితే.. జ్యోతి మల్హోత్రాది హర్యానాలోని హిసర్. 33 ఏళ్ళ జ్యోతికి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ట్రావెలింగ్ వీడియోలు చేస్తూ ఉంటుంది.

## భారత్‌తో వాణిజ్య సమస్యలు
# పరిష్కరించుకుంటాం

**ఢాకా(జనంసాక్షి):**భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే సరకులపై బంగ్లాదేశ్ విధించిన ఆంక్షలకు ప్రతిగా.. ఇండియా ఆ దేశ దిగుమతులపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌తో నెలకొన్న వాణిజ్య సమస్యలను పరిష్కరించుకుంటామని మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు బంగ్లా వాణిజ్య సలహాదారు షేక్ బషీరుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. 'భారత్ తీసుకున్న చర్యలకు సంబంధించి మాకు ఇంకా అధికారిక సమాచారం రాలేదు. వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటాం. ఏమైనా సమస్యలు ఉంటే చర్చలతో వాటిని పరిష్కరించుకొంటాం. అఖౌరా, డాకి పోర్టులతో పాటు కొన్ని సరిహద్దు ప్రాంతాలకు సంబంధించి పలు నిర్ణయాలను భారత్ తీసుకున్నట్లు వార్తల ద్వారా తెలిసింది. ఇది రెండు దేశాలకు మంచి విషయం. వస్త్ర పరిశ్రమలో భారత్ అగ్రస్థానంలో ఉందని మేము భావిస్తున్నాం. అయినప్పటికీ.. ఆయా ఉత్పత్తులు మా దేశం నుంచి ఎగుమతి అవుతున్నాయి. ఇది మా సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. భారత్– బంగ్లాలు పొరుగుదేశాలు. సహజంగానే వాణిజ్యం, రవాణా వంటి వాటిల్లో పోటీ ఉంటుంది. ఈ క్రమంలోనే కొన్ని సార్లు మేము పరిమితులు విధిస్తాం. భారత్ కూడా అలాగే చేస్తోంది. వాణిజ్య ప్రక్రియలో ఇది భాగం మాత్రమే. ఇందులో ఏమైనా సమస్యలు ఉంటే ఇరుదేశాలు చర్చలతో పరిష్కరించుకుంటాయి' అని పేర్కొన్నారు.

## సైనిక చర్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారా?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా రైల్వే ఈ–టికెట్లపై ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ప్రకటనలు రావడంపై కాంగ్రెస్ మండిపడుతోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాజపా సైనిక చర్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తుందని ఆరోపించింది.కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కమల్ నాథ్ మీడియా అడ్వైజర్ పీయూష్ బాబెల్ ఎక్స్ వేదికగా ఒక ఫొటోను పంచుకున్నారు. భారతీయ రైల్వేకి సంబంధించిన ఈ–టికెట్ అది. అందులో ప్రధాని నరేంద్ర మోదీ (%ూవీ వీశీుఱ%) ఫొటోతో ఆపరేషన్ సిందూర్‌కి సంబంధించిన ప్రకటన ఉంది. 'మోదీ ప్రభుత్వానికి ప్రకటనలపై ఎంత ఆసక్తి ఉందో చెప్పడానికి ఇదో ఉదాహరణ. ఆపరేషన్ సిందూర్‌ను రైల్వే టికెట్లపై ప్రకటనగా వేశారు. మన సైన్యం పరాక్రమాన్ని ఓ ఉత్పత్తిలా మార్చేశారు. ఇది దేశభక్తి కాదు.. బేరసారమే. రాబోయే బిహార్ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం సైన్యాన్ని ఉపయోగించుకోవడమే. ఇలాంటి పద్ధతులను వెంటనే ఆపేయాలి' అని బాబెల్ పోస్టుకి రాసుకొచ్చారు. ఇక, ఇదే విషయంపై బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ కున్వర్ డానిష్ అలీ సైతం స్పందించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను అవకాశంగా మార్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ చేస్తున్న విమర్శలపై రైల్వే బోర్డు అధికారి దిలీప్ కుమార్ స్పందించారు.




## నకిరేకల్‌లో చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్టు

**నకిరేకల్, మే 19 (జనంసాక్షి) :** ఈ నెల 17న నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని వీటి కాలనీలో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిపై దాడి చేసి చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి మూడు తులాల బంగారు చైన్, నాలుగు రోల్డ్ గాజులు, మూడు సెల్‌ఫోన్లు, హోండా యాక్టీవాను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నకిరేకల్ పట్టణంలోని వీటీ కాలనీలో ఒంటిరిగా ఉంటున్న నాగులంచ లక్ష్మమ్మ ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇళ్లు అద్దెకు రావాలని అడిగారు. గదులు లేవని చెప్పడంతో మంచినీరు కావాలని అడిగారు. వృద్ధురాలు ఇంట్లోకి వెళ్లగా ఆమె వెంట లోపలికి చొరబడి గదిలోని దుప్పటిని చింపి దానితో ఆమె నోరు, కాళ్లు, చేతులు కట్టేసి పిడిగుద్దులు గుద్దారు. ఆమె ఒంటిపైన ఉన్న మూడు తులాల బంగారు గొలుసు, నాలుగు రోల్డ్ గాజులు తీసుకుని పరారయ్యారు.

## డిగ్రీ పరీక్షలో ముగ్గురు విద్యార్థుల డీబార్

**నల్లగొండ, మే 19 (జనంసాక్షి) :** మహాత్మాగాంధీ యూనివర్సిటీ నల్లగొండ ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థులను అధికారులు డీబార్ చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,461 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,132 మంది హాజరయ్యారు. 236 మంది గైరాజరయ్యారు. ఈ పరీక్షలో సూర్యాపేటలోని ఆర్కే ఎల్కే డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డీబార్ అయినట్లు ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 990 మంది హాజరు కావాల్సి ఉండగా 91 మంది హాజరయ్యారు. 89 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను పట్టిష్టంగా నిర్వహించాలని ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్స్‌కు సూచించారు. ఎక్కడైనా తప్పు జరిగితే ఆ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బాధ్యులవుతారని తెలిపారు.

## భూక్యా జాన్సన్ నాయక్‌పై అక్రమంగా కేసు నమోదు

ఉట్నూర్ : బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌పై ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో అకారణంగా కేసు నమోదు అయింది. అధికార పార్టీ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడం దారుణమని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 2023 నవంబర్ లో ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వస్తున్న జాన్సన్ నాయక్‌ను ఉట్నూర్ మండలం కొత్తగూడ చెక్ పోస్ట్ వద్ద కాంగ్రెస్ నాయకులు అడ్డగించి హంగామా సృష్టించి కేసు పెట్టారని ఆరోపించారు. 19 నెలల తరువాత ఉట్నూర్ పోలీసులు జాన్సన్ నాయక్‌కు నోటీసులు అంద జేయడం కక్షసాధింపు చర్య అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ స్పందిస్తూ అధికార పార్టీకి చెందిన నాయకులు తనపై కేసులు ఎన్ని పెట్టినా భయపడేది లేదని, రెట్టింపు ఉత్సా హంతో ప్రజల్లో ఉంటానని స్పష్టం చేశారు. పోలీసు లను అడ్డం పెట్టుకొని కేసులు నమోదు చేస్తూ పాల్ప డుతున్న వారిని ఎవ్వరిని వదలబోమని హెచ్చరించారు.

## నల్లగొండ డీఈఓపై చర్యలు తీసుకోవాలని
## కలెక్టరేట్ వద్ద ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం ధర్నా

**నల్గొండ, మే 19 (జనంసాక్షి) :** అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న నల్లగొండ డీఈఓను విధుల నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రముఖ డీఈఓ అవినీతి బాగోతం నడిపిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన 10వ తరగతి మూల్యాంకనలో డబ్బులు వసూలు చేసి వేరే జిల్లాలకు చెందిన విద్యార్థులకు మార్కులు ఎక్కువ వేయించినట్లు తెలిపారు. గత నాలుగైదు సంవత్సరాల నుండి ఈ తంతు జరుగుతున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రముఖ టీచర్స్ యూనియన్ సంఘం నేత ఫిర్యాదు ఇచ్చినా ఎటువంటి చర్య తీసుకోలేదన్నారు. ఉపాధ్యాయ సంఘ నేత ఒకరు ఐదారేండ్ల నుండి బడికి వెళ్లకుండా దొంగ సంతకాలు పెట్టుకుంటూ డీఈఓతో అంటకాగుతూ ఆఫీసులో ఏ పనైనా తన ద్వారానే అవుతుదని ప్రచారం చేసుకుంటూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నట్లు తెలిపారు. గుండ్రంపల్లి ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డికి తన స్పోజ్ ఈ జిల్లాలలో లేకున్నా హౌస్ పాయింట్స్ ఇప్పించి బదిలీలో గుద్రంపల్లికి ఇప్పించారు. ఎంపీపీ ఎస్ కటోరిగూడెం పాఠశాలలో 30 మంది విద్యార్థులు కూడా లేరు అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు మరో ఉపాధ్యాయుడు డిప్యూటేషన్ లో ఉన్నారు. అంటే ఒకరి బదులు మరొకరు అక్కడ విధులు నిర్వహిస్తున్నారు. అతడు మాత్రం డీఈఓ ఆఫీస్ లో




పైరవీలు చేసుకుంటూ డబ్బులు దండుకుంటున్నట్లు వెల్లడించారు. సదురు ఉపాధ్యాయుడిపై పత్రికల్లో వచ్చినా కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే చందంపేట మండలం పోలేపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో మహిళ ఎస్జీటీ టీచర్ కోరుకొండ పాఠశాలలో పనిచేసేది. ప్రస్తుతం ఆ స్కూల్‌ను విద్యార్థులు రాక మూసేశారు. సదర్ టీచర్‌ను డిప్యూటేషన్ వేయకుండా గతేడాది నుంచి జీతం ఇవ్వడం జరిగిందన్నారు. ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో కూడా లక్షల రూపాయలు వసూలు చేస్తే ఫెయిల్ అయిన అభ్యర్థులను పాస్ చేయించడం జరిగిందన్నారు. కావున వెంటనే విచారణ చేసి డీఈఓను, సదురు ఉపాధ్యాయ సంఘం నేతని సస్పెండ్ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం లక్ష్మీనారాయణ, ఎల్ హెచ్ పి ఎస్ అధ్యక్షుడు సైదా నాయక్, మిర్యాలగూడ జిల్లా కన్వీనర్ అల్లంపెల్లి కొండన్న, జిల్లా కో కన్వీనర్ వినోద్ చారి, జిల్లా ఉపాధ్యక్షులు కాసర్ల లింగస్వామి, సూర్య, నవీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నందిగం సురేశ్‌కు జూన్ 2వరకు రిమాండ్

- గుంటూరు జైలుకు తరలించిన పోలీసులు

**గుంటూరు, మే19 (జనంసాక్షి) :** వైకాపా నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు మంగళగిరి కోర్టు జూన్ 2 వరకు రిమాండ్ విధించింది. ఆయన్ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో తెదేపా కార్యకర్త రాజుపై దాడి చేసిన కేసులో ఆదివారం ఆయన్ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టులో హాజరుపరచడానికి ముందు మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో నందిగం సురేశ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, మధుమేహం స్థాయిలను పరీక్షించారు. సురేశ్‌ను కోర్టులో ప్రవేశపెట్టే సమయంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు- చేశారు. కోర్టు ప్రాంగణంలో ఇతరులను ఖాళీ చేయించారు. ఆయన అనుచరులు భారీగా చేరుకోవడంతో వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. 14 రోజుల పాటు రిమాండ్ విధించింది న్యాయస్థానం. దీంతో నందిగం సురేష్‌ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఇప్పటికే పలు కేసులలో వైసీపీ మాజీ ఎంపీ బెయిల్‌పై ఉన్నారు. సోమవారం ఉదయం వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం మంగళగిరి కోర్టులో మాజీ ఎంపీని పోలీసులు హాజరుపర్చగా.. కోర్టు రిమాండ్ విధించింది. గత శనివారం రాత్రి మాజీ ఎంపీ స్వగ్రామం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో టీడీపీ కార్యకర్త రాజు అనే వ్యక్తిపై నందిగం సురేష్, అతడి సోదరుడు, అనుచరుడు మూకుమ్మడి దాడి చేశారు. తన భర్తపై హత్యప్రయత్నం చేశారంటూ రాజు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ఎంపీపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. రాజును కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు- నిర్ధారించి నందిగం సురేష్‌తో పాటు- మరి కొంతమందిపై కేసు నమోదు చేశారు. నిన్న (ఆదివారం) సురేష్‌ను తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఈరోజు (సోమవారం) మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. సురేష్‌కు కోర్టు 14 రోజుల పాటు- రిమాండ్ విధించగా.. వెంటనే అతడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. నెలల తరబడి నందిగం సురేష్ గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవించి వచ్చిన విషయం తెలిసిందే. గతంలో మరియమ్మ అనే మహిళ హత్య కేసు, తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో కూడా అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చారు. ఇప్పటి వరకు మాజీ ఎంపీపై 12 కేసులు ఉండగా.. ఇప్పుడు 13వ కేసు నమోదు అయినట్లు- తుళ్లూరు డీఎస్పీ తెలిపారు. మరో రెండు కేసులు నమోదు అయితే నందిగం సురేష్‌పై పీడీ యాక్ట్ పెట్టేందుకు సిఫారసు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సేంద్రీయ ఎరువులతోనే లాభం

- వర్మీ కంపోస్టుకు ప్రాధాన్యం ఇవ్వాలి

**నిజామాబాద్, మే19 (జనంసాక్షి) :** రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మట్టిలో పోషకాలను పెంచేందుకు కృషిచేయాలని జిల్లా వ్యవసాయా అధికారులు రైతులకు సూచించారు.. రసాయన ఎరువుల వినియోగం పెరిగి భూమికి తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. అన్నదాతలు ఈ విషయాన్ని గుర్తించి రసాయన ఎరువులకు బదులు సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలన్నారు. రైతన్నలు మట్టిని కాపాడితే సమాజాన్ని కాపాడినవారు అవుతారన్నారు. అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులు వాడకం వల్ల భూసారం కోల్పోయి పంట నాణ్యత హీనంగా వస్తుందన్నారు. తద్వారా ఆ పంటను స్వీకరించిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు,. వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు చేయించుకుని రైతులు తమ పోలాల్లో ఏ పోషకాలు లోపించాయో తెలుసుకోవచ్చన్నారు. అవసరమైనంత మేరకు నత్రజని పోటాష్‌లు, వినియోగించాలన్నారు అంతేకాకుండా భూమి యొక్క బౌతిక రసాయన స్థితిని బట్టి ఆభూమిలో ఏయే పంటలు పండుతాయి అనే విషయాన్ని కూడా తెలుసుకునే వీలుకలుగుతుందన్నారు. అధిక మొత్తంలో రసాయనాలు వాడి భూమిలోని పోషకాలు తగ్గించకుండా భూమిని జాగ్రత్తగా కాపాడు కోవాల్సిన అవసరం రైతులపై ఉందన్నారు. భూసారం తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముందుగానే తెలుసుకుని వాటిని అవలంబించాలన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటేనే నాణ్యమైన పంటు పండే అవకాశం ఉందన్నారు. పంటకు కావాల్సిన పోషకాలను భూమి ఇస్తుందని భూమిని ఆరోగ్యంగా ఉంచేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్మికంపోస్ట్ సబ్సిడీని వినియోగించుకోవాలన్నారు. ఇదిలావుంటే మండల



స్థాయిలో, గ్రామీణ స్థాయిలో కూడా ప్రైవేట్ వ్యక్తులు మట్టి తవ్వేందుకు ప్రయత్నాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలను అధికారులను పాటించాలన్నారు. వర్మికంపోస్టు యూనిట్లు కావల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఉద్యాన పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడేందుకు ప్రభుత్వం రాయితీపై వర్మీకంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తోంది. ప్రధానంగా ఆకుకూరలు, పండ్లు, కూరగాయల పంటలలో రసాయనాల వాడకం తగ్గించడం ద్వారా ప్రజలకు మేలైన కూరగాయలు అందేలా చేయాలని చూస్తున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగులో కంపోస్టు ఎరువుల వాడకాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ముందుగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన రైతులకు రాయితీపై వర్మికంపోస్టు యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల ఉద్యానశాఖ అధికారి తెలిపారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పుణ్యస్నానాల కోసం తరలి వస్తున్న భక్తులు

**కాళేశ్వరం, మే19 (జనంసాక్షి) :** కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కరాలు కొనసాగుతున్నాయి. ఐదోరోజు సోమవారం కూడా భక్తులు పుణ్యస్నానాలకు తరలి వచ్చారు. సోమవారం కావడంతో కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో రోజైన ఆదివారం సెలవు కావడంతో భారీగా భక్తులు తరలివచ్చారు. త్రివేణి సంగమ పుష్కరిణి ఐదురోజులుగా జనంతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు పరవశించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మహిళలు సరస్వతి తీరం వెంట సైకత లింగాలు ఏర్పాటు చేసి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. చీర, సారె సమర్పించి నదిలో దీపాలు వదిలారు. ముత్తయిదువులకు వాయినాలిచ్చి ఆశీర్వచనాలు పొందారు. సాయంత్రం సమయంలో నదీతీరాన సరస్వతి విగ్రహం ముందు నిర్వహించిన మహాహారతి క్రతువును చూసి భక్తులు పరవశించిపోయారు. ఆదివారం పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతి మహాస్వామి పుష్కరస్నానం చేసి ఆలయ దర్శనం చేసుకున్నారు. పుష్కర స్నానాలు చేసిన భక్తులు శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామి సన్నిధానానికి చేరుకున్నారు.

## అభివృద్ధి దిశగా తెలంగాణ పథకాలు

**కరీంనగర్, మే19 (జనంసాక్షి) :** దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో బృహత్తరమైన పథకాలు ప్రవేశపెట్టి ఏ ప్రభుత్వమూ ఎన్నడూ చేయని అభివృద్ధిని సిఎం రేవంత్ రెడ్డి చేసి చూపుతున్నారని ఎమ్మెల్యే, చీఫ్ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు. రైతులకు రుణమాఫీ వంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. ఇది చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులను ఆర్థికంగా అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనేక సంక్షేమకార్యక్రమాల్లో దళితులకు పెద్దపీట వేస్తూ వారికి సహకారం అందిస్తున్నామని అన్నారు. నిరుద్యోగులైన యువతీ యువకులకు ఉపాధి అందించాలనే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం అమలు చేయబోతున్నారని గుర్తుచేశారు. ఇకపోతే ధాన్యం కొనుగోళ్లకు విస్తృతంగా ఏర్పాట్లు చేశామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని వెల్లడించారు. మార్కెట్ యార్డులో కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మేరకు కొనుగోలు చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## పల్లె ప్రగతికి బిఆర్ఎస్ ప్రత్యేక కృషి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి వెల్లడి

**జనగామ, మే19 (జనంసాక్షి) :** పల్లె పట్టణ ప్రగతి కార్యాక్రమాలను ఉమ్మడి వరంగల్ జిల్లాలో పటిష్టంగా నిర్వహించామని, ఇప్పుడు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక కార్యక్రమాలు విజయం సాధించాయి. గ్రామాలను పచ్చగా,పరిశుభ్రంగా నిలిపేందుకు అధికారులు కృషి చేసారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ఆశయానికి అడుగులు పడ్డాయి. సమీక్షలు, సమావేశాలు నిర్వహించి సర్పంచ్‌లను పురమాయించడంతో గ్రామాల అభివృద్ధిపై ప్రజలు దృష్టి సారించారు. గ్రామంలో గ్రామ పారిశుద్ధ్య కమిటీని ఏర్పాటు చేశాం. అందులో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఎన్నికల హామీలో లేని అనేక సంక్షేమ పథకాలు, అందించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎర్రబెల్లి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం విస్మరించిందని, 24గంటల ఉచిత విద్యుత్ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఎర్రబెల్లి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు రైతాంగానికి 24గంటల ఉచిత కరంటు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. సమైక్య రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగానికి 24గంటల ఉచిత కరంటు అందించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రైతుల కళ్లలో వెలుగులు చూడాలన్న లక్ష్యంతో కేసీఆర్ నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పడితే కరంటు కష్టాలు ఏర్పడుతాయన్న ఆంధ్ర పాలకుల విమర్శలకు దీటుగా 24గంటల ఉచిత కరంటు ఇచ్చి చూపారని అన్నారు. రైతాంగానికి కరంటు సమస్య తలెత్తకుండా ఎక్కడికక్కడ సబ్‌స్టేషన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

## ఈదురుగాలులకు తెగిపడ్డ హైటెన్షన్ వైరు

- వైరు తగలడంతో టూవీలర్ సహా కాలి బూడిదైన రైతు

**ఖమ్మం, మే19 (జనంసాక్షి) :** 33/11 కెవి హైటెన్షన్ విద్యుత్ లైన్ తీగ తెగిపడిన విషయాన్ని గమనించక పోవడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న రైతు అది తాకడంతో విద్యుత్ షాక్ తగిలి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మండలం, కొత్తూరులో సోమవారం చోటుచేసుకుంది. గ్రామంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీగా ఈదురుగాలతోపాటు- భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో విద్యుత్ లైన్ తీగ ఒకటి తెగి కింద పడింది. గ్రామానికి చెందిన పైడిమర్ల పెద్ద మురళీ రెడ్డి (59) అనే రైతు సోమవారం ఉదయం ఎప్పటిలాగే ద్విచక్ర వాహనంపై పొలం పనులకు వెళ్లాడు. అయితే, తెగిపడిన విద్యుత్ లైన్‌ను అతను గమనించలేదు. ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు వైరు దాటగా వాహనంతో సహా గుర్తుపట్టని రీతిలో కాలి బూడియ్యాడు. ఈ విషయాన్ని గమనించిన కొందరు రైతులు విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేయగా సరఫరా నిలిపివేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ఏఐవైఎఫ్ జాతీయ జాతీయ కార్యదర్శిగా డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** అఖిల భారత యువజన సమైక్య జాతీయ మహాసభలు ఆంధ్రప్రదేశ్ లోని చారిత్రక తిరుపతి నగరంలో రాజేందర్ భవన్ లో నాలుగు రోజుల పాటు నిర్వహించారు. ఈ సభలో జాతీయ నూతన కమిటీని ఎన్నుకోగా.. తెలంగాణ వరంగల్ ప్రాంతానికి చెందిన డాక్టర్ .వల్లి ఉల్లాఖాద్రి గారిని జాతీయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.. వల్లి ఉల్లాఖాద్రి తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి కాకతీయ విశ్వవిద్యాలయ వేదికగా అనేక ఉద్యమాలు నడిపించి 150 పైన పోలీసు కేసులు, జైలు జీవితాలను సైతం ఎదుర్కొని విద్యార్థి జేఏసీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించాడు. అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షునిగా ఆ తరువాత ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా పని చేశారు. దేశ వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను ఉధృతలూగించారు. ఢిల్లీ జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో సంగం విజయానికి ప్రధాన భూమిక పోషించాడు. దేశ వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలలో కీలక పాత్ర అదే కాకుండా తెలంగాణ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలపై కెసిఆర్ పాలన కూడా అనేక పోరాటాలు నిర్వహించారు కెసిఆర్ తవ్వుతారాచక పాలనకు వ్యతిరేకంగా ఆయన మీద పోరాటాలు చేసి ఆయన గద్దె దించారు . వల్లి ఉల్లాఖాద్రి గారు నేడు ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల పలువురు విద్యార్థులు, యువకులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## మైసూర్‌లోని చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఉప్పల కుటుంబ సభ్యులు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కర్ణాటక రాష్ట్రం మైసూర్ లోని చాముండేశ్వరి దేవాలయాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరే షన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు కుటుంబ సభ్యులతో సంద ర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆ చాముండేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో రాణించాలని ఆయన సూచించారు. సకలం లో వర్షాలు పడి రాబోయే రోజుల్లో రైతులు అందరూ పాడి పంటలతో ఆనందం గా ఉండా లని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ఆయన సతీమణి, ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, కుమారుడు సాయి కిరణ్, కోడలు శర్వరీ, చిన్న కుమారుడు సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.



## బోల్ గార్డ్-3 రకాన్ని ఉపయోగించడం చట్ట రీత్యా నేరం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి మే 19 (జనంసాక్షి) :** జిల్లాలో నకిలీ, నిషేధిత విత్తనాల రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన లతో కలిసి మండల తహశిల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, పోలీసు శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో బి.టి. పత్తి విత్తనాలతో పాటు బోల్ గార్డ్-1, 2 రకాలను చట్టబద్ధంగా ఉపయోగించడం జరుగుతుందని, బోల్ గార్డ్-3 రకాన్ని నిషేధించడం జరిగిందని, వీటిని ఉపయోగించడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. ఈ విత్తనంలో మానవులకు ఆరోగ్య సమస్యలు (క్యాన్సర్) ఉత్పన్నం కావడంతే కాకుండా ప్రకృతి కాలుష్యం జరుగుతుందని, వృక్షజాలంపై ప్రభావం పడి భూసారం క్షీణించి దుష్ప్రభావాలు కలుగుతాయని తెలిపారు. విత్తన చట్టం / పర్యావరణ చట్టం 1955 సెక్షన్ 3 ప్రకారం ఈ రకమైన విత్తనాలను నిషేధించడం జరిగిందని, రైతులు నకిలీ, పర్యావరణానికి, మానవాళికి హాని కలిగించే విత్తనాలు, ఎరువులను వినియోగించకుండా మండల స్థాయి వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో సాగుకు అవసరమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి షాపులో స్టాక్ నిల్వలు, ధరలతో కూడిన పట్టిక ప్రదర్శించాలని తెలిపారు. అదే విధంగా నకిలీ విత్తనాల విక్రయాలు నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విక్రయదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు షాపులకు సరఫరా చేసే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.



# సాహితీవేత్తల కర్తవ్యాలు

## రైటర్ ఆన్ డిమాండ్ రచయితలు



రచయితలు రకరకాలు. కొందరు తమకు తోచినపుడు రాస్తారు. కొందరు తమకు బాధ కోపం సంతోషం ద్వేషం ప్రేమ ఆత్మీయత, స్పందన ఎక్కువైనపుడు రాస్తారు. కొందరు సామాజిక బాధ్యతగా రాస్తారు.

సాహితీవేత్తలకు కొన్ని సామాజిక బాధ్యతలుంటాయి. ప్రజల సాహిత్య సాంస్కృతిక అవసరాలు తీర్చడం, ఉదాత్త సహృదయ మానవులుగా తీర్చిదిద్దడం, చైతన్యం పెంచడం, మూఢవిశ్వాసాల నుండి శాస్త్రీయ హేతువాద అవగాహన పెంచడం, ప్రేమ స్నేహం కుటుంబ సంబంధాలు సెంటిమెంట్లు ఆత్మీయతలు ఆదర్శవంతం గా మలచడం సాహిత్య కర్తవ్యాల్లో, సాహిత్య ప్రయోజనంలో ప్రధానాంశాలు.

కొందరు రైటర్సు ఆన్ డిమాండ్ రచయితలుంటారు . ప్రింట్ ఆన్ డిమాండ్ అనే పద్ధతి వచ్చింది. రచయితకైనా , పాఠకులకైనా ఒక కాపీ ప్రింటు చేసి ఇమ్మన్నా అలా ప్రింటు చేసి ఇచ్చే పద్ధతి వచ్చింది. అట్లా రైటర్స్ ఆన్ డిమాండ్ రచయితలు అనేక విధాలుగా ఎదుగుతున్నారు. సమాజ శ్రేయస్సు కోసం రాయడం నా కర్తవ్యం అని పూర్తికాలపు రచయితలుగా రాస్తున్న వారు తక్కువ. ఫలితంగా సాహిత్య రంగంలో మహా రచయితలుఎదగడం నిలదొక్కుకోవడం కష్టంగా మారింది.

కొందరు పండుగల సందర్భంగా రాస్తుంటారు. సంక్రాంతి, 26 వ జనవరి, ఉగాది, 15 ఆగస్టు, రాఖీ, దసరా, దీపావళి, క్రిస్మస్, ఆంగ్ల సంవత్సరాది వంటి పండుగలకు, మహా సభలు, కవి సమ్మేళనాలకు రాస్తుంటారు. కొందరు కథలు, కవితలు, నవలలు, నాటికల పోటీలు బహుమతుల కోసం రాస్తుంటారు. వీరు రైటర్స్ ఆన్ డిమాండ్ రచయితలన్నమాట! వెనకట వెదురు కంక బద్ద తడుకలు, చేనేత చీరలు దోవతులు, మంచాలు బల్లలు ఆర్డర్, అడ్వాన్సు ఇచ్చిన తరువాతే తయారు చేసే వారు. వీరు ఆ కోవలోకి వచ్చే సాహితీవేత్తలు. వీరికి రచన పూర్తికాలపు వృత్తి కాదు.

కొందరు కొన్ని భావజాలాలకు పరిమితమై రాస్తారు. ఏదో ఒక భావజాల ఉద్యమానికి, సంస్థ కు కట్టుబడి, కమిట్ మెంట్ తో రాయడం మంచిదే. అయితే ఆ భావ జాలం, ఆ ఉద్యమం, ఆ కమిట్ మెంట్, వస్తు స్వీకారంలో శైలిలో, ప్రెజెంటేషన్ లో, ముగింపులో, పరిష్కారం లో అనేక పరిమితులు విధిస్తుంది. ఆ పరిమితులు నుండి బయట పడాలి. తమకు తెలియకుండానే దీని మీద రాయాలి. దీని మీద రాయనవసరం లేదు అని అనుకుంటారు. అలా అది మనకెందుకు అనే థాట్ పోలీసింగ్ కు ఆ కమిట్ మెంట్ గురి చేస్తుంది. పీడిత వర్గ కార్మిక వర్గవాదం కావచ్చు. పీడిత పక్షపాతం కావచ్చు. ఫెమినిజం కావచ్చు. హిందూ జాతీయ వాదం కావచ్చు, విప్లవ వాదం కావచ్చు , ప్రాంతీయ వాదం కావచ్చు, రాజకీయాలు కావచ్చు. దళిత బహుజన వాదం కావచ్చు. ఆయా పరిమితులను గుర్తించి వాటినుంచి బయట పడ్డ వారికి విశాల ప్రపంచం రాయాల్సిన వస్తువులుగా ఎదురవుతాయి. రచయితల వస్తు విస్తృతి పెరుగుతుంది

దాసరి నారాయణ రావు ఎన్నో రకాల సినిమాలు తీసారు. ఎందరినో సినిమాల్లో సుప్రసిద్ధులను చేసాక ఎన్టీ ఆర్, ఏ ఎన్నార్ తమ తో సిన్మా తీయాలని అడిగితే వారికి నప్పే పాత్రలు సంఘటనలు కథతో సినిమాలు తీసివబౌరా! అనిపించుకున్నారు. యద్దనపూడి, యండమూరి పత్రికల సంపాదకుల / పాఠకుల డిమాండ్ ననుసరించి రాసారు. సీరియల్సును పెంచారు. కార్ కి దీపం సీరియల్ అయిపోయాకా మళ్లీ అలాంటి పాత్రలతో అదే టైటిల్ తో సీరియల్ వస్తున్నది. ఇలాంటివి పాఠకుల / ప్రేక్షకుల డిమాండ్ ననుసరించి రాయబడుతుంటాయి.

**రచయిత తనకు తాను ఎదగాలి**

రచయితలు మార్గదర్శులుగా తనను తాను ఎదిగించుకోవాలి. క్రాంత దర్శి కావాలి. మానవ సంబంధాల్లోని కోణాలు, సెంటిమెం ట్లు, పరిణామాలు, రాజకీయ ప్రభుత్వ నిర్ణయాలు ఆధునిక సైన్సు, టెక్నాలజీ అనివార్యంగా తెస్తున్న మార్పుల పట్ల రచయితలు ఎరుక కలిగి. వుండాలి. ఆ ఎరుకను పాఠకులకు ప్రేక్షకులకు తమ రచనలతో అందించాలి. ప్రజలను మేల్కొలిపి సమాయత్తం చేయాలి. దీన్నే భావ జాల సాంస్కృతిక విప్లవం అంటారు. సాంస్కృతిక వికాసం అంటారు. ఆ రచనలను సంఘ సంస్కరణ అభిలాష రచనలు అంటారు. ఎలెక్స హేలీ ఏడుతరాలు/ రూట్సు నవల అమెరికా సమాజాన్ని కుదిపేసింది . శరత్ బాబు రచనలు కోట్లాది మందిని మలిచాయి. ప్రేంచంద్, చెఖోవ్, టాల్ స్టాయ్ గోర్కీ, జాషువా, శ్రీశ్రీ, గద్దర్ , వంగపండు , గూడ అంజయ్య రచనలు సమాజాన్ని కుదిపేశాయి.

**రైటర్ ఆన్ డిమాండ్ రచనలు తక్షణ కర్తవ్యాలను నిర్వహిస్తాయి**

ఒక ఉద్యమానికి ఒక నినాదం కావాలి. ఒక పాట కాలి. ఒక ప్రసంగం కావాలి. ఒక సిద్ధాంత భూమిక కావాలి. ఒక చారిత్రక నేపథ్యం కావాలి. ఒక కథ కావాలి. ఒక నవల కావాలి. ఒక సినిమా కావాలి. ఇవి తక్షణం అందించే వాళ్లే చరిత్ర నిర్మాతలు. ప్జలు ఉద్యమాలు ఇలా డిమాండ్ చేసినపుడు రాయలేని వారు చరిత్రకు వెనకబడిపోతారు. ఆ అవకాశాన్ని అందుకొని వెంట వెంట రాసేవారే ట్రెండ్ స్వెట్టర్స్ చరిత్ర చోదక శక్తులవుతారు.

**సాహిత్యంలో సమాజంలో ట్రెండ్‌కి డిమాండ్స్**

కొన్నిసార్లు ఉద్యమం డిమాండ్ చేస్తుంది. కొన్ని సార్లు ట్రెండ్ డిమాండ్ చేస్తుంది. ఒకప్పుడుడిటెక్టివ్ నవలలు సెక్సు నవలలు ట్రెండ్. తరువాత పత్రికలలో సాంఘిక నవలల ట్రెండ్. సినిమాల్లో పౌరాణికా, జానపదాలు, డిటెక్టివ్‌లు, ముక్కోణ ప్రేమలు, అత్తా కోడళ్లు, ఉమ్మడి కుటుంబాలు, విడిపోవడాలు, సాంఘికాలు, రాజకీయాలు, పోలీసులు, క్రైమ్, నక్సలైట్లు, తాగుబోతులు, స్మగ్లర్లు, దొంగలు, ప్రేమలు, కట్నాలు, డ్యాన్సులు, రేప్‌లు, హింస ట్సరెంట్స్‌గా జానర్‌గా కొనసాగాయి. ఇపుడు సాఫ్టువేర్, అమెరికా ప్రేమలు ట్రెండ్సుగా కొనసాగుతున్నాయి.

కొన్ని పత్రికలు ప్రచురణ సంస్థలు బ్రాండ్ నేమ్ వచ్చాక రచయితలను తమకు సీరియల్లు రాయాయాలని అడ్వాన్సు ఇచ్చి రాయించుకుంటారు. వీరు కూడా రైటర్లు ఆన్ డిమాండ్ రచయితలే. ఇలా రచయితలు, దర్శకులు, పత్రికా సంపాదకులు, సాహిత్య సంస్థలు, పబ్లిషర్లు, పాఠకులు ప్రేక్షకులు, రైట్ ఆన్ డిమాండ్ పద్ధతిలో నూతన సాహిత్యం రావడానికి సమాజ అవసరాలు తీర్చడానికి తోడ్పడుతుంటాయి. అలా వందలాది రచయితలు వేలాది రచనలు వెలువడ్డాయి. అమెరికాలోని తెలుగువారు పెట్టిన పోటీలతో ఎన్నో నవలలు రాసారు. బహుమతి రాని నవలలు కూడా ఎక్కడో ఏదో రూపంలో ప్రచురింపబడుతూనే వుంటాయి. ఇలా బహుమతుల పోటీల వల్ల బహుమతి పొందిన వారికన్నా ఎన్నో రెట్లు రచయితల రచనలు పుట్టుకు వస్తాయి. ఇదే ఎన్నో రెట్ల సాహిత్య సేవ. యువ రచయితలు రైటర్స్ ఆన్ డిమాండ్ రచయితలుగా మిగిలి పోకూడదు. ఉద్యమాలకు, పండుగలకు పబ్బాలకు, పోటీలకు రాసే వారుగా మిగిలిపోకూడదు. అలా చేస్తే రాశి పెరగదు. వాసి పెరగదు. కొన్ని రచయితల సంఘాల వారు కొన్ని సంఘటనలకే స్పందిస్తారు. రచయితలు ఇలా గిరిగీసుకుంటే సమాజానికి అందించాల్సిన సాహిత్యం , సాహిత్య కర్తవ్యాలు ఆగిపోతాయి. తన గుర్తింపుకు పరిమితమైన రచయితగా మిగిలిపోతారు . సాహిత్యంతో సామాజిక చైతన్యం , సామాజిక. న్యాయం, సామాజిక మార్పు కు కృషి చేసే సాహిత్య కారులు గా గాని సంఘ సంస్కర్తలు గా గాని ఎదగలేరు. వారు పోటీలకు రాసే కెరీరిస్టు రచయితలుగా ముద్ర పడిపోతారు. అది వారు సృష్టించిన సాహిత్యం పట్ల కూడా చిన్న చూపు కలిగిస్తుంది. వారు విజనరీగా ట్రెండ్ సెట్టర్ గా ఎదగ లేరు.

**ట్రెండ్స్ మార్చాలి. చారిత్రక పాత్ర నిర్వహించాలి**

ఒక పాట, ఒక నినాదం, ఒక ప్రసంగం, ఒక కథ ఒక నవల, ఒక సిన్మా, ఒక టీవీ. సీరియల్ సమాజాన్ని మార్చుతుంది మలుపు తిప్పుతుంది. ప్రజల ఉద్యమాల తక్షణ అవసరాలకు రాయలేని రచయితలు సమకాలీన రచయితలేనా అనే సందేహం కలుగుతుంది. అందరికి గురించి రాసినపుడే అందరు అందరు చదువుతారు. కొన్నిటి గురించి రాసే వారిని ఎప్పుడూ ఇవే గదా రాసేది అని చదవడం మానేస్తారు. అలా తెలిసిన పాఠకులు కూడా చదవడం తగ్గి పోతుంది. అందువల్ల వస్తు వైవిధ్యం, శిల్ప వైవిధ్యం నిరంతర వస్తు విస్తృతి అవసరం. అపుడే ఇంగ్లీషు ద్వారా భారతీయ భాషల్లో కి , ఇతర దేశాల్లో కి పోతుంది. విశ్వ జనీన సాహిత్యం లో చేరుతుంది. వేల ఏళ్ల నాడు రాసిన గాథాసప్తశతి, కథాసరిత్సాగరం, పంచ తంత్రం కథలు ప్రపంచ భాషల్లోకి అనువాద మయ్యాయి. ప్రాచీన కథా సాహిత్యం అయిదు క్లాసిక్ లలో మూడు భారత దేశానివే. ఇప్పుడెందుకు ఆ స్థాయికి ఎదగకూడదు? బాహుబలి ప్రపంచాన్ని జయించింది. హారీ పోస్టర్ ప్రపంచాన్ని జయించింది. అమ్మ నవల, ఏడు తరాలు నవల, దేవదాసు నవల ప్రపంచాన్ని జయించాయి. కొవ్వలి రాసిన జగజ్జాన, విషకన్య సీరియల్ నవలలు పాఠకుల హృదయాలను జయించాయి. ఒక్క బుకర్ ప్రైజ్‌తో అరుంధతీరాయ్ విశ్వ రచయిత్రిగా ఉద్యమ వినుతి కెక్కారు. యువ రచయితలు సమాజాన్ని, తమకన్నా ముందు రాసిన రచయితల్ని అధ్యయనం చేస్తే వారు కూడా ఎదుగుతారు.



**బి.ఎస్ రాములు**
సామాజిక తత్వవేత్త,
తెలంగాణ తొలి బీసీ కమిషన్ చైర్మన్
8331966987


---

## ప్రా' కృతి

కలనీవే కలతనీవే
కారుణ్యజలధినీవే కాఠిన్యఉదధినీవే
శోభమయగీత శోకమయచెరిపివేతనీవే
మహోజ్జ్వలనేత మహాప్రళయకోతనీవే
ఊపిరులూదే ఈశ్వరినీవే
ఉసురులుతీసే తలారినీవే
ఆనంద ఆకాశంలోకి ఎగరేసిన ఘనతనీదే
పాశవిక పాతాళంలోకి విసిరేసిన చరితనీదే
ఆశనీవే నిరాశనీవే
అండపిండ బ్రహ్మాండంనీవే
ఆరని అలారని అగ్నిగుండంనీవే
వెలలేని వేనవేలవెలుగూ
అంతర్లీన వాయులీన నిశీధిమూలుగూనీవే
సృష్టినీవే
సర్వకళల సర్వశాస్త్రాల సృష్టినీవే
అవిభాజ్య అసంపూజ్య అసంతృప్త పరితుష్టినీవే
నవజీవవభిక్షనీవే నవ్యజీవనరక్షనీవే
ప్రాణహిత పరిరక్షనీవే అనివారణ మరణశిక్షనీవే
ఆదిఅంతంనీవే
గెలుపూ ఓటమీనీవే
పన్నీటిఒడినీవే కన్నీటిజడినివే
శిలనీవే శిల్పంనివే శిథిల అలలతల్పంనీవే

**కోటం చంద్రశేఖర్**
9492043348

---



## జ్ఞానమంటే

విశ్వంలోని విషయాలన్ని తెలిస్తే జ్ఞానమా?
ప్రపంచంలోని చిత్రాలన్ని చూస్తే జ్ఞానమా?
జ్ఞానమంటే మనిషిని మనిషి గౌరవించడం
విశ్వసించడం రక్షించడం ప్రేమించడం
దీనికి సత్యం ధర్మం న్యాయం మూలం
శాంతి ప్రేమ కరుణ మార్గం
జ్ఞానం నాలుగు రకాలు
ఒకటి (స్వ)జ్ఞానం
ఆత్మ జ్ఞానం - జన్మతః వస్తుంది
జన్మాంతం నిలుస్తుంది
రెండవది గురు జ్ఞానం
గురుప్రదానం - జన్మతః రాదు
కాని జన్మాంతం నిలుస్తుంది
మూడవది అనుభవ జ్ఞానం
అకస్మాత్తు జ్ఞానం - గురుబోధతో రాదు
కాని జన్మంతా వస్తుంది
నాల్గవది వృద్ధ జ్ఞానం
చివరి జ్ఞానం - అకస్మాత్తుగా రాదు
కాని ఆఖరిగా వస్తుంది

**కోటం శ్రీనాథ్**
8523005678


---

## యుద్ధం

ఒకే అరలోని ఇమిడిని కత్తులు
సామాన్య జనాలపై
వేలాడుతున్న కత్తులు
నాయకులు మాత్రం సురక్షితం
ఆనాడు రాజులు రాజ్యాల కోసం
యుద్ధం రాజులు సమాధి
నేడు సామాన్యులు సమాధి
అశోకుడు కళింగ యుద్ధం
మారెను బౌద్ధం
చివరికి శాంతే మార్గం
సరిహద్దు జనాలకు చెలగాటం
సుదూర ప్రాంతాల కు చర్చలు
వైశాల్యం జనాభా ఒక
భూటకం
అగ్రరాజ్యాల నాటకం
అమెరికా ఆహ్నాన్ని
అణచలేదా క్యూబా
ఉక్రైన్తో రష్యా
ఉరిపెట్టుకోలేదా
యుద్ధాన్ని కోరేవాడు
పట్టాడు తుపాకీ
తుపాకీ పట్టే వాడు
కోరుకొడు యుద్ధం
బతుకు దేరువు కోసం
బార్డర్ లో సిపాయి
యుద్ధ నినాదం బలహీనత
దౌత్యం భలవంతుల లక్ష్యం
రెండు ప్రపంచయుద్ధాలు
మిగిల్చింది ఏమిటీ
మారణహోమం తప్ప
మతం యుద్ధం పాలకపక్ష
ఆయుధాలు
మమకారం, అభివృద్ధి
ప్రగతికి చక్రాలు
మరి నీవు ఎటు వైపు
నిర్ణయం నీదే నిజాయితీ
నీదే నిర్ణయించుకో
యుద్ధం పక్షమా
శాంతి పక్షమా

**ఉమాశేషారావు వైద్య**
రాజనీతి శాస్త్ర ఉపన్యాస కులు
కామారెడ్డి, 9440408080

---





# హైదరాబాద్ అగ్ని విపత్తు

## నగర భద్రత సంస్కరణకు ఒక హెచ్చరిక

హైదరాబాద్లోని ఇటీవలి అగ్ని ప్రమాదం, ప్రాణాలను కబళించి భవనాలను బూడిదగా మార్చిన ఈ దుర్ఘటన, నగర భద్రతా నియమాల్లోని వ్యవస్థాపక వైఫల్యాలను మళ్లీ మనకు గుర్తుచేస్తుంది. ఈ ప్రమాదానికి కారణాలు ప్రస్తుతం విచారణలో ఉన్నప్పటికీ, ఇలాంటి విపత్తులు ఎల్లప్పుడూ ఒకే మాదిరి కథనాన్ని అనుసరిస్తాయి – అజాగ్రత్త, నియంత్రణ ఉదాసీనత, సిద్ధపడకపోవడం. ఇప్పుడు కష్టప్రశ్నలు అడగాల్సిన సమయం వచ్చింది: భారతీయ నగరాలు ఎందుకు అగ్ని ప్రమాదాలకు గురవుతున్నాయి? ఈ నివారించదగ్గ విపత్తుల చక్రాన్ని ఎలా విరమించాలి?

హైదరాబాద్ తాజా ఘటనతో సహా భారతదేశంలోని నగర అగ్ని ప్రమాదాలు, సాధారణంగా అనేక కారణాల మిశ్రమం నుండి పుడతాయి. పాత విద్యుత్ వైర్లు లేదా ఎక్కువ భారం తగిలిన వ్యవస్థల వల్ల విద్యుత్ తెగడాలు ప్రధాన కారణాలు. దట్టమైన జనాభా ఉన్న ప్రాంతాల్లో, అక్రమ నిర్మాణాలు, సులభంగా మండే పదార్థాలతో నిండిన ఇరుకైన వాణిజ్య ప్రదేశాలు "అగ్నికి ఆహుతి అయ్యే స్థలాలుగా" మారుతున్నాయి. పొగ గుర్తించే సాధనాలు ఏర్పాటు చేయడం, తప్పించుకునే మార్గాలను అడ్డంకులు లేకుండా ఉంచడం, సాధనాభ్యాసాలు నిర్వహించడం వంటి భద్రతా నిబంధనలు తరచుగా ఉపేక్షించబడతాయి. నియమాలు ఉన్నా, అమలు బలహీనంగా ఉంటుంది. కట్టడాల కోసం నిర్మాణ సంస్థలు భద్రతను త్యాగం చేస్తారు, అధికారులు విపత్తు వరకు కళ్లు మూసుకుంటారు. పాత ప్రాంతాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక మార్గాల మధ్య ఉన్న హైదరాబాద్ ఈ ద్వంద్వతను ప్రతిబింబిస్తుంది. ప్రాచీన భవనాల్లో ఆధునిక అగ్నిమాపక సదుపాయాలు లేవు, కొత్త ఎత్తైన కట్టడాలు అలంకారం కోసం భద్రతను తగ్గించుకుంటాయి. ఫలితం? అగ్నిమాపక వాహనాలు ఇరుకు వీధుల్లో ప్రయాణించడానికి ఇబ్బంది పడే నగరం, అత్యవసర సందర్భాల్లో నీటి నిల్వలు లేని ఎత్తైన భవనాలు.

**దోషారోపణకు మించిన సంక్షోభం:**

ఈ సమస్య హైదరాబాద్ కంటే విస్తృతమైనది. జాతీయ నేర రికార్డుల సంస్థ ప్రకారం, 2022లో భారతదేశంలో 8,000కి పైగా అగ్ని సంబంధిత మరణాలు నమోదయ్యాయి. ఇవి చాలావరకు నగరాల్లోనే సంభవించాయి. ఈ సంఖ్యలు నగర ప్రణాళిక, విపత్తు నిర్వహణ పట్ల ఉదాసీనతను ప్రతిబింబిస్తాయి. అగ్నిమాపక దళాలు సిబ్బంది, సాధనాల కొరతతో బాధపడుతున్నాయి. తెలంగాణలో ప్రతి 4.5 లక్షల మందికి ఒక అగ్నిమాపక కేంద్రం మాత్రమే ఉంది. సామాజిక అవగాహన చాలా తక్కువ – అగ్నిని ఆర్పే సాధనాన్ని ఎలా ఉపయోగించాలో కూడా ఎంతమందికి తెలుసు?

వాతావరణ మార్పులు ఇంకా సమస్యలను తీవ్రతరం చేస్తున్నాయి. పెరిగే ఉష్ణోగ్రతలు అడవి మంటలు, విద్యుత్ ప్రమాదాల ప్రమాదాన్ని పెంచుతున్నాయి, కానీ విపత్తు నిర్వహణ ప్రణాళికలు ఈ మారుతున్న సవాళ్లను పరిగణనలోకి తీసుకోవు.

**నివారణే ప్రధానం- సంస్కరణ మార్గం:**

భవిష్యత్తు విపత్తులను నివారించడానికి భారతదేశానికి మూడు ముఖ్యమైన చర్యలు అవసరం. అవి

1. భద్రతా నిబంధనల కఠినమైన అమలు: అన్ని నివాస, వాణిజ్య భవనాలకు తప్పనిసరి అగ్ని పరిశీలనలు, నియమాల ఉల్లంఘనకు భారీ దండాలు. రాష్ట్రాలు జాతీయ భవన నియమావళిని పూర్తిగా అనుసరించాలి.
2. ఆధునిక మౌలిక సదుపాయాలు: అగ్నిమాపక దళాలకు ఎత్తైన నిచ్చెనలు, వేడిని గుర్తించే కెమెరాలు వంటి ఆధునిక సాధనాలను అందించడం, అత్యవసర నీటి సరఫరా వ్యవస్థలకు సులభ ప్రాప్యత నిర్ధారించడం. నగర ప్రణాళికలు విశాలమైన రహదారులు, ఖాళీ ప్రదేశాలను ప్రాధాన్యతనివ్వాలి.
3. ప్రజల సాధికారత: అగ్ని భద్రతపై స్థానిక స్థాయిలో జాగృతి ప్రచారాలు నడపడం. పాఠశాలలు, కార్యాలయాలు నిరంతర సాధనాభ్యాసాలు నిర్వహించాలి. భద్రతను "ప్రభుత్వ బాధ్యత" నుండి "సామూహిక బాధ్యత"గా మార్చాలి.

**సామూహిక చర్యకు పిలుపు:**

హైదరాబాద్ అగ్ని ప్రమాదం మన నిర్లక్ష్యానికి అద్దం పట్టిస్తోంది. ప్రభుత్వం సంస్కరణలకు నాయకత్వం వహించాల్సిన అవసరం ఉంది, కానీ పౌరులు కూడా నిర్లక్ష్యంగా ఉండకూడదు. అక్రమ నిర్మాణాలను నివేదించండి, అగ్ని పరిశీలనలను డిమాండ్ చేయండి, భద్రతా సాధనాల్లో పెట్టుబడి పెట్టండి. నగరాలు ఎత్తుగా, విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ, వాటి స్థితిస్థాపకత కూడా అంతే వేగంగా పెరగాలి. ఈ విపత్తు మార్పుకు ఒక సూచనగా మారాలి. అగ్ని భద్రత అధికారులకు ఒక సూచిక గుర్తు కాదు – ఇది మిలియన్ల ప్రజల జీవనరేఖ.



**కింజరాపు అమరావతి**
8247286357

---

# నగరాలను దహిస్తున్న అగ్నిజ్వాలలు

## నిర్లక్ష్యానికి భారీ మూల్యం మారణహోమం



హైదరాబాద్‌లో ఇటీవల సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం, ఎనిమిది మంది చిన్నారులతో సహా పదిహేడు నిండు ప్రాణాలను బలిగొంది. ఇది కేవలం వార్త కాదు, మేల్కొలుపు పిలుపు. భారతదేశం వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలు అగ్ని ప్రమాదాలకు ఎంత నిస్సహాయంగా మారుతున్నాయో ఈ దుర్ఘటన మరో సారి స్పష్టం చేసింది. ఇది కేవలం ఒక విషాద ఘటన మాత్రమే కాదుబీ వ్యవస్థాపక లోపాలు, మౌలిక సదుపాయాల కొరత, సమిష్టి బాధ్యతలో ఉన్న వైఫల్యాల కారణంగా పదే పదే సంభవిస్తున్న దుస్థితికి ఇది నిదర్శనం. ఇలాంటి ప్రమాదాలు యాదృచ్ఛికంగా జరుగుతాయని అనుకుంటే పొరపాటే. తరచుగా ఇవి నిబంధనల ఉల్లంఘనలు, మౌలిక లోపాలు, భద్రత పట్ల నిర్లక్ష్యం వంటి పలు అంశాల కలయిక పర్యవసానమే. ఈ విపత్తుల విష వలయం నుండి బయటపడాలంటే, మన నగరాలు ఎందుకు అగ్నికి ఆహుతవుతున్నాయో సమగ్రంగా విశ్లేషించి, భవనాలను నిర్మించే, నియంత్రించే, నివసించే విధానంలో సమూల మార్పులు తీసుకురావాలి.

నిర్లక్ష్యపు నిప్పు రవ్వలు మంటలు చెలరేగడానికి ముఖ్య కారణాలు చూస్తే, భవనాల్లో ఎక్కువగా దారితీసేవి విద్యుత్ సంబంధిత లోపాలే. నాసిరకం విద్యుత్ వైరింగ్, నిర్వహణ సరిగా లేని పాత వ్యవస్థలు, అధిక లోడు మోస్తున్న సర్క్యూట్లు, అర్హత లేని వ్యక్తులతో చేయించిన తాత్కాలిక మరమ్మతులు – ఇవన్నీ షార్ట్ సర్క్యూట్లు, వైరింగ్ కాలిపోవడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తాయి. ముఖ్యంగా పురాతన భవనాలలో, నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన నిర్మాణాలలో ఈ సమస్య తీవ్రం. ఇది నివాస, వాణిజ్య స్థలాలను క్షణంలో అంటుకునే పదార్థాలుగా మారుస్తుంది. వంట గ్యాస్ సిలిండర్ల లీకేజీలు, లోపభూయిష్టమైన రెగ్యులేటర్లు, గ్యాస్ పైప్‌లైన్లు కూడా ప్రమాదకరమే. సులభంగా మంటలు అంటుకునే వస్తువులైన పెయింట్స్, రసాయనాలు, ప్లాస్టిక్ వంటివి అజాగ్రత్తగా నిల్వ చేయడం, ఇంకా మానవ నిర్లక్ష్యంకూడా ఇటువంటి ప్రమాదాలకు తోడవుతున్నాయి. అజాగ్రత్తగా వదిలేసిన సిగరెట్లు, వంట చేసేటప్పుడు శ్రద్ధ వహించకపోవడం, సరిగా పర్యవేక్షించకుండా హీటింగ్ పరికరాలు వాడటం వంటివి చిన్నగా మొదలై పెద్ద విపత్తులుగా రూపాంతరం చెందుతాయి. కనీస భద్రతా వ్యవస్థలు లేని ప్రదేశాలలో ఈ లోపాలు ప్రాణాంతకంగా మారతాయి. ఈ తక్షణ కారణాలు భారతీయ నగరాల ప్రత్యేకమైన, తరచుగా గందరగోళ పరిస్థితులలో వేళ్ళూనుకుపోతాయి. ప్రణాళికా బద్ధం కాని వేగవంతమైన పట్టణీకరణ అధిక జనసాంద్రతకు దారితీసింది. వాణిజ్య, నివాస స్థలాలు పక్కపక్కనే ఉండటం, ఒకే భవనంలో వివిధ అవసరాలకు వినియోగించడం అగ్ని ప్రమాదాల తీవ్రతను పెంచుతుంది. అనేక నగర చారిత్రక కేంద్రాలు, ఇరుకైన వీధులు, ఒకదానికొకటి ఆనుకుని ఉండే భవనాలతో నిండి ఉంటాయి. ఇవి ఆధునిక అగ్నిమాపక వాహనాలు, రెస్క్యూ పరికరాలు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి, పనిచేయడానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తాయి. చిన్న మంటలు కూడా నియంత్రణకు అందని మహా విషాదాలుగా మారతాయి. అక్రమ నిర్మాణాలతో పాటు ఆక్రమణలు అత్యవసర మార్గాలను మూసివేస్తాయి. ప్రాణాలను కాపాడే అవకాశాలను తగ్గిస్తాయి. సరైన నిష్క్రమణ మార్గాలు లేకపోవడం వల్ల మంటలు చెలరేగినప్పుడు భవనం నుండి బయటపడటం కష్టమవుతుంది.

**నియంత్రణ వైఫల్యం - చట్టాలున్నాయి, అమలు లేదు:**

సమస్యకు మరో కీలక కోణం ఏమిటంటే, మన దేశంలో అగ్ని భద్రతా నియమాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్ర లోపాలున్నాయి. నేషనల్ బిల్డింగ్ కోడ్ , వివిధ రాష్ట్రాల అగ్నిమాపక సేవల చట్టాలు భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలైన ఫైర్-రెసిస్టెంట్ మెటీరియల్స్ వాడకం, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, ఫైర్ డిటెక్షన్, అణచివేత వ్యవస్థలు, తప్పనిసరి ఆడిట్‌లు, నిరభ్యంతర ధృవీకరణ పత్రం తప్పనిసరి చేస్తాయి. అయినప్పటికీ వీటి ఆచరణలో అనేక లోపాలున్నాయి.

తగినంత మంది శిక్షణ పొందిన ఇన్‌స్పెక్టర్లు లేకపోవడం, నియంత్రణ సంస్థలలో వనరుల కొరత, తనిఖీ అనుమతి ప్రక్రియలో జాప్యం అవినీతి, భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం. జరిమానాలు సరిపోవు, బాధ్యులను న్యాయస్థానాలకు అప్పగించే ప్రక్రియ నెమ్మదిగా ఉంటుంది. ఇది నిర్లక్ష్యాన్ని ప్రోత్సహిస్తుంది. అనేక భవనాలు, ముఖ్యంగా పెద్ద నివాస, వాణిజ్య సముదాయాలు కూడా, సరైన అగ్నిమాపక అనుమతులు లేకుండా లేదా కాలం చెల్లిన భద్రతా వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. అంతేకాకుండా, అగ్ని భద్రత పట్ల విస్తృతమైన ప్రజా అవగాహన లేకపోవడం, సౌలభ్యం ఖర్చులకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతి కూడా ఈ సమస్య తీవ్రతరం చేస్తున్నాయి. భవనాలలో నివసించే వారికి, పనిచేసే వారికి ప్రాథమిక అగ్ని భద్రతా పద్ధతులు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఎక్కడ ఉన్నాయో తెలియదు.

అగ్నిమాపక పరికరాలు ఎలా వాడాలో అవగాహన ఉండదు. ప్రైవేట్ భవనాలలో అగ్నిమాపక డ్రిల్స్ నిర్వహించడం చాలా అరుదు. ఓవర్‌లోడ్ అయిన ఎలక్ట్రికల్ సాకెట్లు, అడ్డంగా ఉన్న మెట్ల మార్గాలు వంటి చిన్న చిన్న భద్రతా లోపాలను ఒక పెద్ద ప్రమాదం జరిగే వరకు పట్టించుకోని ధోరణి ఎక్కువగా ఉంటుంది.

**నివారణ చర్యలు: ఎవరు ఏం చేయాలి?**

ఈ బహుముఖ సమస్యను పరిష్కరించడానికి పటిష్టమైన, సమగ్ర వ్యూహం అవసరం. దీనికి ప్రభుత్వ నిబద్ధత, కఠినమైన అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా భాగస్వామ్యం తప్పనిసరి. ముందుగా చట్టాలను కఠినంగా అమలు చేయాలి. కేవలం చట్టాలు ఉండటం కాదు. వాటిని అమలు చేసే యంత్రాంగం బలంగా ఉండాలి. వాణిజ్య, నివాస, పారిశ్రామిక, ప్రభుత్వభవనాలకు తప్పనిసరి, నిర్ణీత కాల వ్యవధిలో అగ్ని భద్రతా ఆడిట్‌లు నిర్వహించాలి. వీటిని స్వతంత్ర, అర్హత కలిగిన థర్డ్ పార్టీల ద్వారా చేయించాలి. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే ప్రాంగణాలను సీల్ చేయాలి. ప్రమాదం జరిగితే క్రిమినల్ బాధ్యత వహించేలా చట్టాలు బలంగా ఉండాలి. అనుమతి ప్రక్రియను పారదర్శకంగా, అవినీతి రహితంగా, సాంకేతిక ఆధారితంగా మార్చాలి. రెండవది, అగ్నిమాపక విభాగాన్ని బలోపేతం చేయడానికి గణనీయమైన పెట్టుబడి పెట్టాలి. పట్టణ సవాళ్లకు అనుగుణంగా ఆధునిక పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది సంఖ్యను పెంచడం, కమ్యూనికేషన్ వ్యవస్థలు మెరుగుపరచడం, నీటి వనరుల లభ్యత (ఫైర్ హైడ్రెంట్లు) వంటివి వారికి తప్పనిసరిగా అందించాలి. పట్టణ ప్రణాళికలోనే అగ్ని భద్రతను ఒక భాగంగా చూడాలి. పాత భవనాలకు ఆధునిక భద్రతా సదుపాయాలను కల్పించడానికి ప్రోత్సాహకాలు ఇచ్చి, క్రమంగా వాటిని తప్పనిసరి చేయాలి. మూడవది, భవనాల యజమానులు, ఆపరేటర్లు, నిర్వాహకులు తమ ప్రాంగణాలలో అగ్ని భద్రతా ప్రమాణాలను పాటించే బాధ్యతను చట్టపరంగా వహించాలి. విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలను క్రమం తప్పకుండా తనిఖీ నిర్వహణ చేయడం విధిగా మారాలి. చివరగా, విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు ప్రాథమిక శిక్షణ ద్వారా పౌరులను అగ్ని భద్రతపై చైతన్యపరచాలి. ప్రమాదకర పరిస్థితులను ఎలా గుర్తించాలి, అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలి, సురక్షితంగా ఎలా బయటపడాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. నిబంధనలు పాటించని వారిపై ఫిర్యాదు చేయడానికి సులభ మార్గాలను అందుబాటులో ఉంచడం కూడా పౌర పర్యవేక్షణను పెంచుతుంది.

**సురక్షిత భవిష్యత్తుకు మనందరి బాధ్యత:**

పట్టణ అగ్ని ప్రమాదాల పరంపర మన దేశానికి ఒక అవమానకరం. ఇది వేగవంతమైన అభివృద్ధి, ఖర్చు తగ్గించుకోవడాన్ని మానవ ప్రాణాల కన్నా ఎక్కువగా విలువ ఇవ్వడం వల్ల సంభవిస్తున్న పర్యవసానం. అగ్ని భద్రతకు సంబంధించిన నియమాలు, నిబంధనలు, నిపుణుల సూచనలు అన్నీ అందుబాటులో ఉన్నాయి. కావలసింది ఏమిటంటే, ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిల నుండి సాధారణ పౌరుల వరకు అందరిలో నిబద్ధత, చట్టాలను పటిష్టంగా అమలు చేసే సంకల్పం, మౌలిక సదుపాయాలలో పెట్టుబడి, భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే సంస్కృతిని పెంపొందించ డం, బాధ్యతాయుతమైన వారిపై చర్యలు తీసుకోవడం. అప్పుడే మనం ఇలాంటి విషాదాలు పునరావృతం కాని సురక్షితమైన నగరాలను నిర్మించగలం. చర్య తీసుకోవాల్సిన సమయం నిన్ననే గడిచిపోయిందిబీ మరో ప్రమాదం జరిగే వరకు మనం వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఇప్పుడు మనం మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైంది.

**జనక మోహన రావు దుంగ**
8247045230

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై సోమవారం సంబంధిత అధికారులతో మినీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమవేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించుటకు కట్టుదిటమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో మే 22 నుంచి మే 29 వరకు ఇంటర్ తియరీ పరీక్షలు,జూన్ 03 నుండి 12 వరకు (ప్రాక్టికల్) ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తామని, దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఉ. 9.00 నుండి మ.12.00 వరకు రెండవ సంవత్సరం మధ్యాహ్నం 2:30 నుండి 5:30 వరకు పరీక్షలు జరుగుతాయని, మొదటి సం.2385 రెండవ సం.1478 మొత్తం 3863 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఇందుకు గాను 13 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ద వహిస్తుందని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పరిక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలని, ప్రతి కేంద్రం వద్ద ఏఎన్ఎం స్థాయిలో వైద్య సిబ్బంది,ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో పరీక్ష ప్రశ్నపత్రాలను నిల్వ జేయుటకు పోలిస్ స్టేషనలో తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రశ్నపత్రాలకు పోలిసు బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించాలని,పరీక్ష కేంద్రాల వద్ద తప్పనిసరిగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, సెంటర్లలో మాస్ కాపీయింగ్ మరియు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలకు విద్యార్థులకు ఒత్తిడి లేకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి ధైర్యం చెప్పాలన్నారు. జిల్లాలో పరీక్షలకు ప్రశ్న పత్రాలను పోలిసు వారి బందోబస్తు వుంచి తీసుకొని వెళ్లాలని, జిల్లాలోని రెవెన్యూ శాఖ నుండి పరీక్షా కేంద్రాలకు ఫ్లైయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేసి పరీక్ష జరుగుతున్న తీరుపై నిఘా వుంచాలని ,144 సెక్షన్ అమలు చేయాలని,పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచి నీరు, ఫ్యాన్లు, లైట్లు సరి అయిన విదంగా వుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, వెలుతురు వుండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష నిర్వహణ అనంతరం సమాధాన పత్రాలను సరిగా సీల్ చేసి పోస్టల్ ద్వారా తరలించే ప్రక్రియ పకడ్బందిగా చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సరైన సమయంలో చేరుకునే విధంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య ,ఆర్డీవోలు రాధాబాయి వెంకటేశ్వరావు, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్ ,విద్యా, వైద్య,ఫైర్, ఆర్టిసి, పోస్టల్ శాఖల అధికారులు పాల్గోన్నారు.

# నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలి

● **జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 19 (జనం సాక్షి) :** నిబంధనల మేరకు అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ 2010 పై వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్, స్కానింగ్, ల్యాబ్ ల ఏర్పాటు కోసం వచ్చిన 21 అనుమతుల దరఖాస్తుల పై జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి వైద్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్, స్టాంపింగ్, ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ , నోటరీ, బిల్డింగ్ కండిషన్ అన్ని సక్రమంగా ఉన్నాయా ? లేదా అని నోడల్ అధికారిని డాక్టర్ శైలజ ను ఆమె అడిగి తెలుసుకున్నారు. శాఖాపరమైన అన్ని నిబంధనలను పాటించి అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మల్లికార్జున్, డీపీవో భిక్షపతి, అశోక్ కుమార్ పాల్గొన్నారు.


# అదనపు కట్నం కోసం భార్యకు వేధింపులు

● **భర్తకు మూడేళ్ల జైలు శిక్ష**

**సత్తుపల్లి, మే 19 (జనంసాక్షి) :** అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధిస్తూ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి గౌరవ వి.శివ రంజని గారు సోమవారం తీర్పు ఇచ్చారని సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగయ్య తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి. ఏన్కూరు మండలం తూతి లింగన్నపేటకు చెందిన నామ నరేష్ (34) అనే నిందుతుడు పెళ్లయిన రెండేళ్ళ నుండి తన భార్య తేజశ్రీ ని అదనపు కట్నం కోసం నిత్యం చేస్తున్న మానసికంగా, శారీరకంగా వేధింపులను తట్టుకోలేక 2019 జూన్ 9 ఆత్మహత్యకు పాల్పడిందని, మృతురాలు తండ్రి ఫిర్యాదుతో స్థానిక ఏన్కూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశామని తెలిపారు. సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పి.స్వప్న, యండీ ఇషాద్ వాదించారు. ప్రాసిక్యూ షన్ కు సహకరించిన ఏసీపీ రఘు, ఏన్కూర్ అప్పటి ఎస్సై పవన్ కుమార్, ప్రస్తుత ఎస్సై ఉఫాతుల్ రఫి, సీడీఓ. డి.భారత్, లైజన్ అధికా రులు కె.శ్రీకాంత్, డి. నాగేశ్వరరావు, హెూంగార్డు శ్రీనివాస్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# చేప మందు పంపిణీకి ఏర్పాట్లు

● **ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్**




**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో ప్రతి సంవత్సరం మృగశిర కార్తె సందర్భంగా బత్తిని కుటుంబం ఎంతో భక్తిశ్రద్ధలతో చేపడుతున్న చేప మందు (చేప ప్రసాదం) పంపిణీ కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించి బత్తిని కుటుంబ సభ్యులు, నిర్వాహకులలో బత్తిని గౌరీ శంకర్ గారు, తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ... బత్తిని కుటుంబం చేపడుతున్న చేప మందు పంపిణీ కార్యక్రమం లక్షలాది ప్రజలకు ఉపయోగపడుతున్న సేవా కార్యక్రమం. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి, విదేశాల నుండి కూడా వచ్చి చేప ప్రసాదాన్ని తీసుకోవడం ఎంతో గర్వంగా ఉంది. ఇది ప్రజారోగ్య ప్రయోజనంతో కూడిన విశిష్టమైన సంప్రదాయం. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయాలు అందజేస్తాము. ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తాము అని తెలిపారు. చేప ప్రసాదం కోసం వచ్చే భక్తులకు తాగునీరు, షెడ్లు, వైద్య సహాయం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో సహకరించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# మే 31న టీజేఎఫ్ రజతోత్సవాలు



**చంపాపేట్, మే 19 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31 న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, ఫోరం అధ్యక్షులు అల్లం నారాయణ చెప్పారు. 2001 మే 31న ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ తెలంగాణ రాష్ట్రం సాధించేంత వరకు, 2014 దాకా ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందని అల్లం నారాయణ తెలిపారు. వివిధ ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించింది అన్నారు. మాక్ అసెంబ్లీ, ఛలో ఢిల్లీ, సాగర హారం, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలను చేసిన ఘనత జర్నలిస్ట్ ఫోరందని అల్లం నారాయణ అన్నారు. ఉద్యమం చల్లబడ్డప్పు అల్లా టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించి ఉద్యమాన్ని ముందుకు నడిపింది అల్లం నారాయణ గుర్తు చేశారు. ఇలాంటి ఎన్నో విషయాలను సమాజానికి మరోసారి తెలియజెప్పడానికి హైదరాబాద్ నెక్ల స్ రోడ్డు లోని జలవిహార్‌లో ఈ నెల 31న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అల్లం నారాయణ తెలిపారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ చేసిన ఉద్యమం మిగతా ఉద్యమాలకు ఒక దిక్సూచి లాంటిదని టీజే ఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్ అన్నారు. మే 31న జలవిహార్‌లో నిర్వహించే టీజే ఎఫ్ రజతోత్సవాల పోస్టర్ ను సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లం నారాయణ, చంటి క్రాంతి కిరణ్, టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, ఎ. రమణ కుమార్, పి.శశికాంత్, ఎం.వి.రమణ, కోశాధికారి పి.యోగానంద్, జాయింట్ సెక్రటరి యార నవీన్ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, టీయూ డబ్ల్యూ జే హైదరాబాద్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు రాకేష్ రెడ్డి, సోమేశ్వర్, కోశాధికారి బాబు రావు, కళ్యాణ్ చక్రవర్తి, చిన్న పత్రికల సంగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఆగస్టీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరస్థుడి అరెస్టు



**ఖమ్మం టౌన్, మే 19 (జనంసాక్షి) :** ఆన్‌లైన్ బెట్టింగ్‌కి అలవాటు పడి, ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వద్ద కేర్ టేకర్ గా ఉద్యోగంలో చేరి, అతనికే తెలియకుండా అతని అకౌంట్ నుండి సుమారు 11.49 లక్షలు బెట్టింగ్ కు పాల్పడిన వ్యక్తిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలిసులు అరెస్టు చేసినట్లు సి.పి. సునీల్ దత్ గారు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని మధిర మండలంలోని, నిదానపురం గ్రామానికి చెందిన 20 సంరాల గుండా వెంకటేశ్వరరెడ్డి అనే యువకుడు ఖమ్మంలోని ఖమ్మం హెూమ్ కేర్ సర్వీస్ లో కేర్ టేకర్గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి గత నాలుగైదు సం. నుండి ఆన్లైన్ బెట్టింగ్ కు పాల్పడేవాడు. ఇందులో భాగంగా గత మార్చిలో ఇతను ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి అయిన గాదె కేశవరావు దగ్గర కేర్ టేకర్గా ఉద్యగంలో చేరాడు. నేరస్థుడు అయిన వెంకటేశ్వర్ రెడ్డి ఆన్ లైన్ బెట్టింగ్‌కు వ్యసనపరుడై అతని యజమాని దగ్గర కేర్ టేకర్గా ఉంటూనే.. అతనికి తెలియకుండా అతని ఫొన్ లోని గూగుల్ ఫే ద్వారా బెట్టింగ్ ఆప్ లలోకి డబ్బులు డిపాజిట్ చేసి, బెట్టింగ్ కు పాల్పడేవాడు. ఈ విధంగా మార్చిలో సుమారు రెండువారాలు వరుసగా సుమారు 11.49 లక్షల డిపాజిట్ చేసి, ఆన్లైన్ బెట్టింగ్ ఆడాడు. ఎవరికి అనుమానం రాకుండా గూగుల్ ఫే హిస్టరిని మరియు జి మేల్ హిస్టరిని డెలిట్ చేశాడు. సదరు యజమాని కేశవరావు గారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా సదరు నేరస్థుడుని గుర్తించి, విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకొన్నాడు. నిందితుడుని ఖమ్మం సైబర్ క్రైం కోర్ట్ లో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఎస్పీ ఫణిందర్ ని, ఎస్సైలు రంజిత్ కుమార్, విజయ్ కుమార్, సైబర్ క్రైమ్ పోలిసు స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సిపి అభినందించారు.

# మే 20న ఎలిగేడులో రెవెన్యూ శాఖ మంత్రి పర్యటన



**పెద్దపల్లి, మే 19 (జనం సాక్షి) :** మే 20 మంగళవారం నాడు ఎలిగేడు మండలంలో రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 12.15 నిమిషాలకు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని హెలిప్యాడ్ వద్దకు రెవెన్యూ శాఖ మంత్రివర్యులు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారని, మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ఎలిగేడు మండలంలోని ముప్పిరి తోట గ్రామానికి రోడ్డు మార్గం ద్వారా మంత్రి చేరుకుంటారని కలెక్టర్ తెలిపారు. మే 20న మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎలిగేడు మండలం ముప్పిరి తోట గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం 2025 రెవెన్యూ సదస్సు అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మంత్రి ఎలిగేడు మండలం శివ పల్లి గ్రామంలోని స్థానిక ఎమ్మెల్యే నివాసంలో భోజనం చేసి మధ్యాహ్నం 3 గంటల 15 నిమిషాలకు పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టర్ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్ ద్వారా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కు బయలు దేరుతారని, మంత్రి పర్యటనకు జిల్లాలో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# హైడ్రా చర్యతో పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ కూల్చివేత



**రాజేంద్రనగర్, మే 19 (జనం సాక్షి) :** హైడ్రా అధికారుల చర్యలతో డాలర్ హిల్స్ పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్‌ను అధికారులు కూల్చివేసి, పార్కు స్థలంగా బండరాయి పై సూచిక ఏర్పాటు చేశారు. గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ డాలర్ హిల్స్ కాలనీలో ని సర్వే నెంబర్ 104/పి.106/113 లలో 13440 గజాల కాలనీ పార్కు రోడ్ల స్థలాన్ని కాపాడాలని గత కొన్ని రోజుల క్రితం స్థానిక కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు తో ఈ నెల 14న హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓ నిర్మాణ సంస్థ యాజమాన్యంతో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్, కబ్జా చేయడం ఏంటని? కోర్టు కేసులో ఉన్న ఈ స్థలంలో చుట్టూ ఫెన్సింగ్ ఎలా వేస్తారని హెచ్చరించారు. వెంటనే హైడ్రా స్పెషల్ టీం తో దీనిపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఆయన కోరారు. తదనంతరం సోమవారం ఉదయం అనుమతులు లేకుండా డాలర్ హిల్స్ పార్కు స్థలం చుట్టూ రేకుల షెడ్డు ఫెన్సింగ్ ని జెసిబి సహాయంతో కూల్చిసి పార్కు స్థలంలో బండరాయి పై పార్కు స్థలంగా సూచిక ఏర్పాటు చేశారు. దీంతో పార్కు స్థలం కబ్జా నుంచి కాపాడిన హైడ్రా కమిషనర్ కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

# ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 12 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు అవగాహన పెంచుకొని, సాగుచేస్తూ మంచి దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం యాడారం గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని రైతులు వరి పంట కు బదులు ఆయిల్ పామ్ సాగుచేసి అధిక దిగుబడి తో పాటు అధిక సొమ్ము సంపాదించవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో లేబర్ ఖర్చు తక్కువని, డ్రిప్ ఇరిగేషన్ తో సాగుచేయవచ్చని, దిగుబడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, హిందూస్తాన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు లేని గ్రామాలుగా మార్చాలి

● **జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 19 (జనం సాక్షి) :** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసిడిఎస్, ఐసిపిఎస్,చైల్డ్ హెల్ప్ లైన్ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాలో బాల్యవివాహాలు లేని గ్రామాలుగా మార్చాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్, (ఇంచార్జ్ డీ డబ్ల్యు ఓ) సంచిత్ గ్యాంగ్వర్ శాఖా పరంగా బాల్య వివాహాల నివారణకు చేపట్టిన చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి సమావేశంలో క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ..గ్రామాలు, మండలాల వారిగా సమావేశాలు నిర్వహింపజేసి బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో బడి బయట బాలికలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి వారి వివరాలతో కూడిన జాబితాను తయారు చేయాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన బాలిక మండలి కమిటీల సమావేశాలను ఎజెండాతో నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో సంబంధిత ఎమ్మార్వోలు, సిడిపిఓలు అలాగే గ్రామస్థాయిలో అంగన్వాడి టీచర్లు, అంగన్వాడి సూపర్వైజర్లు పంచాయతీ కార్యదర్శుల సహకారం తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇకపై జరిగే పెళ్లిలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఆధార్ కేంద్రాలలో వయస్సు పెంచి ఆధార్ కార్డు జారీ చేయకుండా ఆధార్ కేంద్రాల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేస్తామని అన్నారు. బాల్య వివాహాలను ఆపేందుకు వెళ్ళే సమయంలో పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా సమన్వయ కర్త నర్సిములు 2024 లో మొత్తం 36 బాల్య వివాహాలను జరగకుండా నివారించామని,10 బాల్య వివాహాలకు సంబంధించి ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేయించడం జరిగిందని, అలాగే 2025 లో ఇప్పటి వరకు 24 బాల్య వివాహాలను ఆపామని,3 ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేయించడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో డీ ఎస్పీ నల్లపు లింగయ్య, డీఆర్డిఓ మొగులప్ప, డిపిఓ సుధాకర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, సిడబ్ల్యూసీ ఛైర్మెన్ అశోక్ కుమార్, ఇంచార్జ డిసిపిఓ తిరుపతయ్య డీపివో బిక్షపతి, అన్ని మండలాల తహసీల్దార్లు, సీడీపివోలు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార కమిషనర్ పదవులకు బీసీలు అనర్హులా..?

● **ఆరుగురు పదవుల్లో ఒక్కటి బీసీలకు ఇవ్వరా..?**
● **ప్రతి నామినేటెడ్ పోస్టుల్లో 42 శాతం బీసీలకు ఇవ్వాల్సిందే..**
● **బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**



**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) :** ఇటీవల నియమించిన రాష్ట్ర సమాచార కమిషనర్ నియామకాల్లో సామాజిక న్యాయం పూర్తిగా కొరబడిందని, రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా బీసీలకు ఒక్కటి కూడా అవకాశం ఇవ్వకుండా,అగ్రకులాలకే సమాచార కమిషనర్ పదవులు కట్టబెట్టడాన్నీ తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, తెలంగాణలో జరిగిన కులగనన లెక్కల ప్రకారం ప్రతి నామినేటెడ్ పోస్టులో 56% బీసీలకు వాటా కల్పించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ మేధావుల వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ ఏం బాగయ్య, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమలతో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి ఎవరి వాటా వారికి ఇస్తామని ఒకవైపు హామీలు గుప్పిస్తూ%ొ%ఇంకొక వైపు వాటిని అమలు చేయకపోవడం తగదన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ పదవుల భర్తీలో బీసీలను పక్కకు పెట్టడం ఇది రెండు కోట్ల మంది బీసీలను అవమానించడం అవుతుందని ఆయన అన్నారు సమాచార కమిషనర్లు కావలసిన అన్ని అర్హతలు బీసీలకు ఉన్నప్పటికీ నియమకాల్లో మాత్రం బీసీ కులమే అనర్హతగా మారిందా అంటూ ఆయన ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుకుని బీసీలకు ఖాళీగా ఉన్న మిగతా మూడు సమాచార కమిషనర్ పదవులను బీసీలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమాచార కమిషనర్లు నామినేటెడ్ పోస్టులు తదితర అన్నింటిని అగ్రకుల సామాజిక వర్గాలకు కట్టబెట్టడాన్ని బీసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, దీనిని అర్థం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వంపై బీసీలు విశ్వాసం పొందాలంటే జనాభా దామాషా ప్రకారం కానీ, లేదా కనీసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు చేసిన విధంగా 42 శాతం పదవులు ఇవ్వాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్తంగా బీసీలు పెద్దఎత్తున ఉద్యమించక తప్పదని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
20 మే 2025

# ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం గిరిజనులకు వరం

- రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ప్రారంభించడం ఆనందకరం...
- మాచారంలో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి
- ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రిగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం
- మాచారం బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**అచ్చంపేట, మే 19 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఈ విషయంలో మరింత అభివృద్ధి చేసేందుకు మంత్రి వర్గం ఎంతో కృషి చేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహా, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యేలు... నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ ప్రాంతంలో ఉన్న మాచారంలో సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో మాచారంకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులకు కలెక్టర్ బాదావత్ సంతోష్, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు స్థానికంగా ఉన్న సీతరామాంజనేయ స్వామి ఆలయానికి వెళ్ళి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల కోసం రూ.12,600 కోట్లకు సంబంధించిన నల్లమల డిక్లరేషన్ను ఆవిష్కరించారు. అంతకు ముందు ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం పైలాన్ను ప్రారంభించారు. అనంతరం మాచారంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ ... ఒకప్పుడు నల్లమల్ల ప్రాంతం అంటే ఎంతో వెనుకబడిన ప్రాంతమని... ఎవరో నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలనే వారు... కానీ ప్రస్తుతం ప్రజల ఆశీస్సులతో ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రిగా వచ్చి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా మూడు కోట్ల పది లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని...గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే ఆడబిడ్డలు, పొదుపు సంఘాల సభ్యులకు ఆర్టీసీ బస్సులను సైతం ఇచ్చి వాటికి ఆడబిడ్డలను యజమానులను చేసిన ఘనత తమకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఒకప్పుడు సోలార్ అంటే అదాని, అంబానీలకే అనుకునే వారని... ప్రస్తుతం ఆడబిడ్డలకు, గిరిజన పుత్రులకు సైతం అందించడం జరుగుతుందని తెలిపారు. దీంతో పాటు ఆడబిడ్డలకు పెట్రోల్ బంకులు సైతం కేటాయించి వారే స్వయంగా నడిపే విధంగా చేశామన్నారు. ఆడబిడ్డలకు హైదరాబాద్ శిల్పారామం పక్కన స్థలం కేటాయించి వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి అదాని, అంబానీలతో పోటీ పడే విధంగా చేశామన్నారు. అలాగే రాబోయే రోజుల్లో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని.. ఒక ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడి ఎదిగితే ఆ కుటుంబం, ఆ ప్రాంతం ఎదుగుతుందని తెలిపారు. ఈ విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రైతులను, నిరుద్యోగులు, విద్యార్థులను ఆదుకున్న ఘనత తమకే దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాము వచ్చిన మొదటి సంవత్సరంలోనే ప్రభుత్వ ఉద్యోగాలు60 వేలు ఇవ్వగా ప్రైవేట్ ఉద్యోగాల్లో కూడా చోటు కల్పించినట్లు తెలిపారు. అదే విధంగా 12 యూనివర్సిటీల్లో వైస్ఛాన్సలర్లను నియమించినట్లు అప్పుడే సరైన విద్య అందుతుందని అందుకు తార్కాణంగా వారిని నియమించినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేషన్ స్కూళ్ళను కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అచ్చంపేట నియోజకవర్గానికి రూ.119 కోట్లతో స్వయం సహాయక బృందాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందచేశారు. గిరిజనులకు మంచి చేసే తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు జ్ఞాపికలను అందచేశారు.

## ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, మే 19 (జనం సాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య సంబంధిత అధికారులతో కలిసి పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత అందించాలని, పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చి మనకు దరఖాస్తు ఇచ్చిన ప్రతి దరఖాస్తుదారుడికి జవాబుదారితనంతో పని చేయాలని, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని, అధికారులు నాణ్యతతో కూడిన పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. మనకు ప్రజావాణి కార్యక్రమంలో అధికంగా రెవెన్యూ భూ లావాదేవీల సంబంధిత దరఖాస్తులు, పెన్షన్ల మంజూరు దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. మన జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించి ధరణి దరఖాస్తులు,12 ఇందిరమ్మ ఇండ్లు 13, రేషన్ కార్డుకు సంబంధించి-03 ఇతర సమస్యలు -34 మొత్తం 62 ప్రజావాణిద దరఖాస్తులు స్వీకరించినైనదని తెలిపారు వీటిని వీలైనంత త్వరగా పరిష్కారం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 19 (జనం సాక్షి) :** ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల వెంటనే పరిష్కరించాలని అధికారులు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. కలెక్టరేట్లోని ప్రజావాణి సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో జడ్ పి. సి. ఈ. ఓ. ఎం. వి. శైలేష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే జాతీయ సమైక్యత భావన సాధ్యం

- జిల్లా మాజీ మార్కెట్ చైర్మన్ గంగనమోని కిరణ్



**బిజినేపల్లి, మే 19 (జనం సాక్షి) :** క్రీడలతోనే యువతలో జాతీయ సమైక్యత భావన సాధ్యమవుతుందని జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగనమోని కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వారం రోజుల పాటు 40 జట్లతో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల్లో సోమవారం గెలుపొందిన జట్ల క్రీడాకారులకు నగదు, ట్రోఫీలను అందజేసి మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులను యువత నైపుణ్యాభివృద్ధికి, అభ్యున్నతికి కాకుండా చెడుకు ఎక్కువగా వినియోగిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఆండ్రాయిడ్ సెల్ఫోన్ల వాడకం విపరీతం కావడంతో శారీరక, మానసిక శ్రమ లేకపోవడంతో ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక వికాసం కుంటుపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు విధిగా విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక సైర్యం పెంపొందుతాయన్నారు. శత్రు దేశాల నుంచి ఎలాంటి ముంపు ఎదురైనా యువత సిద్ధంగా ఉండాలని కోరారు. క్రీడల్లో గెలుపొందిన జడ్చర్ల జట్లుకు రూ.50 వేల నగదు. ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. అలాగే రన్నర్ జట్లు గుమ్మకొండ టీంకు రూ.25 వేల నగదు, ట్రోఫీ, మెడల్స్, బెస్ట్ బ్యాట్స్మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ద సీరిస్ వంటి ఇతర ప్రోత్సహక బహుమతులను అందజేశారు. వారం రోజుల పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టోర్నమెంటును విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు, నరేందర్ గౌడ్, అజీమ్, ఉర్కొండ రఘుబాబు, అనిల్ గౌడ్, నవీన్, బొడ్డు ఈశ్వర్, శివలను అభినందించారు. బహుమతులు అందజేసిన వారి జిల్లా మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆం జనేయులు, మాజీ సర్పంచ్ ముదావత్ రాము నాయక్, వేముల సత్యం, సత్యశీల సాగర్, పర్వతాలు తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**మెదక్ జిల్లా బ్యూరో, మే 19 (జనం సాక్షి) :** జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులు ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో డీఎఫ్ఓ జోజి ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమ శాఖల వారీగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్దేశించిన లక్ష్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల వారీగా 37 లక్షల మొక్కలు నాటేందుకు ప్రభుత్వ లక్ష్యాలను సూచించడం జరిగిందని పటిష్ట కార్యచరణ తయారు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాలు మొదలైన నాటి నుండే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, అటవీ శాఖ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఏరియాల వారీగా నర్సరీలో మొక్కలు పెంచి నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని సంబంధిత శాఖలకు మొక్కలు అందజేయాలని డిఆర్డిఓ ను ఆదేశించారు. గత సంవత్సరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు చనిపోతే వాటి ప్లేస్లో కొత్త మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు సమన్వయంతో వనమహోత్సవ కార్యక్రమం జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ భుజంగరావు, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య ,ముఖ్య ప్రణాళిక అధికారి సంబంధిత ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎంపీ



**ఝరాసంగం, మే 19 (జనం సాక్షి) :** ఝరాసంగం మండల పరిధిలోని మాచునూర్? గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవనంతో పాటు పరిసరాలను సోమవారం జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, జహీరాబాద్ ఎంపీ సురేష్కుమార్ శెట్కార్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురిలు పరిశీలించారు. ఈ నెల 23 వ తేదీన జహీరాబాద్ ప్రాంతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి వచ్చే అవకాశాలు ఉన్నందున కేంద్రీయ విద్యాలయంతో పాటు నిమ్జ్ ప్రతిపాదిత ప్రాంతానికి వెళ్ళడానికి వేసిన నూతన ఫోర్లైన్ రోడ్డును పరిశీలించారు. సీఎం పర్యటన అధికారికంగా ధృవీకరణ కాలేదు.వారి వెంట ఆర్డీఓ రాంరెడ్డి, డీఎస్పీ రాంమోహన్రెడ్డి, డీపీఓ సాయిబాబ,తహసీల్దార్ తిరుమల రావు,ఎంపీడీఓ సుధాకర్ వివిధ శాఖల అధికాలు ఉన్నారు.

## పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శం

- సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి



**వీపనగండ్ల, మే 20 (జనం సాక్షి) :** సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40 వ వర్ధంతి సభలు వీపనగండ్ల, గోపాల్ దీన్నే గ్రామలలో చిత్రపటానికి పూలమాల వేసి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి. బాల్రెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ పార్లమెంటేరియన్, తన జీవితం ఆదర్శంగా గడిపిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య బాల్యంలోనే అంటరానితనానికి వ్యతిరేకంగా ఇంటినుంటే సామాజిక న్యాయం కోసం అడుగులు వేయడం జరిగింది అని అన్నారు. గాంధీ పిలుపు మేరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. అసమానతలు లేని సమాజం రావాలంటే కమ్యూనిస్టు పార్టీ ఒకటే మార్గమని నమ్మి కమ్యూనిస్టు పార్టీలో చేరి దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం చేసిన వ్యక్తి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. పిల్లలు ఉంటే స్వార్థం వస్తుందని ఉద్దేశంతో పిల్లలు లేకుండా ఆపరేషన్ చేసుకొని తన జీవిత మొత్తం ప్రజా ఉద్యమానికి అంకితం చేసిన మహా నాయకుడు సుందరయ్య అని కొనియాడారు. భూస్వాములు జమీందారులకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుత రైతంగ పోరాటం నడిపిన గొప్ప మహానుభావుడు అని అన్నారు.సిద్ధాంతాన్ని చదువడమే కాదు దాన్ని ఆచరించిన మహా నాయకుడు వారి స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసి, ప్రజా పునాది నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్ వెంకటయ్య, బాలస్వామి, మండల నాయకులు జక్కుల ఆశన్న, నక్క ఈశ్వర్, శేఖర్ రెడ్డి, నాయకులు చంద్రయ్య, వెంకటేశ్వర్ గౌడ్, రాముడు, ఆంజనేయులు, రామన్ గౌడ్, తిరుపతయ్య, రామకృష్ణ ,నవీన్, శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు

- మైనర్ బాలునికి ట్రాక్టర్ ఇచ్చి అతని మృతికి కారణమైన ఓనర్



**నంగునూరు, మే 19 (జనం సాక్షి) :** పాలమాకుల గ్రామానికి చెందిన సంపంగి రాఘవేంద్ర (17) అనే బాలునికి ట్రాక్టర్ ఇచ్చి అతని మృతికి కారణమైన ట్రాక్టర్ యజమాని సుంచు బిక్షపతి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాలపేట ప్రొబేషనరీ ఎస్సై బి.సౌజన్య తెలిపారు. ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో గ్రామానికి చెందిన సంపంగి రాఘవేంద్ర ట్రాక్టర్ నెంబర్ టీఎస్36 టీ ఏ 2276 నెంబర్ ట్రాక్టర్ ను నడుపుతూ పాలమాకుల నుండి హుస్నాబాద్ వైపు వెళుతుండగా పాలమాకుల గ్రామంలోని రంజాన్ చికెన్ సెంటర్ ముందుగా ఎన్హెచ్ 765 డీజీ రహదారిపై డివైడర్ను బలంగా ఢీకొట్టిందన్నారు. ట్రాక్టర్ను నడుపుతున్న డ్రైవర్ సంపంగి రాఘవేంద్ర ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడ్డాడని చెప్పారు. అతనిపై నుండి అదే ట్రాక్టర్ వెళ్ళగా బలమైన రక్త గాయాలు అయ్యాయన్నారు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ పరిశీలించి రాత్రి గం.7.58 ని.లకు మరణించాడని తెలిపారని చెప్పారు. డ్రైవర్ రాఘవేంద్ర మైనర్ అని తెలిసి కూడా ట్రాక్టర్ యజమాని సుంచు బిక్షపతి అతనికి బండి నడపడానికి ఇచ్చాడని డ్రైవర్ రాఘవేంద్ర తండ్రి సంపంగి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ప్రొఫెషనరీ ఎస్సై బి.సౌజన్య వివరించారు.

# ధాన్యం తరలించాలని రైతుల రాస్తారోకో

- అధిక తరుగు తీస్తున్నారని రైతుల ఆవేదన
- సీఈఓను నిలదీసిన రైతులు
- కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని రైతుల డిమాండ్



**శివ్వంపేట, మే 19 (జనంసాక్షి) :** ఆరుగాలాలు కష్టపడి పండించిన ధాన్యాన్ని నెల రోజులు అవుతున్న సొసైటీ నిర్వాహకులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదని అధిక తరుగుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సోమవారం పిఏసీఎస్ సీఈఓ మధు యాదవ్ను రైతులు నిలదీసి, శివ్వంపేట పిఏసిఎస్ బ్యాంకు ముందు ఉన్న నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రోడ్డుపై అరగంట పాటు రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నెలరోజుల నుండి వడ్లను కొనుగోలు చేయకపోవడంతో పాటు అకాల వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తడిసిన ధాన్యం మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర గ్రామాల్లో హమాలీలు క్వింటల్ కు 40 రూపాయలు తీసుకుంటే ఇక్కడ శివ్వంపేటలో 50 రూపాయలు వసూలు చేస్తున్నారని రైతులు వాపోయారు. కొందరు రైతులు ట్రాక్టర్లలో ధాన్యాన్ని రైస్ మిల్ కు తరలిస్తే, తూకం దగ్గర ఆరున్నర కిలోలు అలాగే చెన్నాపూర్ దగ్గర ఉన్న బైలర్ మిల్లు వాళ్ళు క్వింటాల్ కు 3 నుంచి 4 కేజీల చొప్పున తరుగు తీస్తున్నారని, ఇలా మొత్తం తరుగు కుంటాలకు 10 కిలోల చొప్పున నష్టపోతున్నామని రైతులు ఆవేదనతో తెలిపారు. ఈ ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, వడ్లను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అదేవిధంగా దొడ్డు వడ్లను కొనుగోలు చేయడం లేదని రైతులు అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పలిన్లతోపాటు కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నామని రైతులు తెలిపారు. రైతుల రాస్తారోకోతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ విషయం తెలుసుకున్న శివ్వంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులురాస్తారోకోను విరమించారు. ఈ రాస్తారోకోలో రైతులు కుమ్మరి హనుమంతు, బిజిలిపురం కృష్ణ, సుక్క కృష్ణ, సత్యనారాయణ, దేవన బోయిన వెంకటేష్, ఇసుకరి వెంకటేష్, బొట్టు కిషన్, తీగల శ్రీనివాస్, బ్యాగరి రాములు, కావేటి కొమరయ్య, యాసీన్ లతోపాటు మహిళ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖాతాదారులకు న్యాయం చేస్తాం

- ఖాతాదారుల ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన
- జిల్లా తపాలా ఇన్స్పెక్టర్ జుబేర్



**మాగనూర్, మే 19 (జనం సాక్షి) :** మాగనూర్ మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి ఖాతా దారులకు న్యాయం చేస్తామని విచారణ అధికారి జిల్లా తపాలా అధికారి జుబెర్ తెలిపారు.సుకన్య సమృద్ధి యోజన కింద మధ్య తరగతి చెందిన దినసరి కూలీలు వాళ్ల రెక్కల కష్టంతో రూపాయి రూపాయి కూడా పెట్టి నెలకు వెయ్యి రూపాయలు జమ చేస్తే 14 సంవత్సరాల నాటికి తమ కూతురి పెళ్లి ఖర్చులకు లక్షల రూపాయలు ఒకేసారి వస్తాయనే ఉద్దేశంతో జమ చేస్తున్న డబ్బులను మాగనూరు పోస్ట్ ఆఫీస్ లో పనిచేస్తున్న బిపిఎం ధనుంజ య్ చేతివాటం ప్రదర్శించి మూడు సంవత్సరాలు నాలుగు సంవత్సరాలు ఇలా ఒక్కొక్కరి బుక్కులో జమ చేసి మిగతా నాలుగు సంవ త్సరాల డబ్బులు ఖాతాదా రులకు జమ చేయకుండా తమ జేబు నింపుకోవడం జరిగింది. అందులో భాగంగా సోమవారం తపాలా శాఖ నారాయణపేట జిల్లా అధికారి జుబేర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ప్రత్యూష ఉమకాంతులు ఇంటింటా విచారణ చేపట్టారు. ఖాతాదా రుల నుండి రాతపూర్వకంగా రాయించుకున్నారు మీ యొక్క అమౌంటు వడ్డీతో సహా చెల్లిస్తామని ఖాతాదారు లకు హామీ ఇచ్చారు.

# యజ్ఞంలా వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మే 19 (జనంసాక్షి) :** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ ఒక యజ్ఞంలా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా దిగుబడి రావలసి ఉండగా జిల్లాలో ఏర్పాటు చేసిన 345 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరిందని, 36 కొనుగోలు కేంద్రాలు సేకరణ లక్ష్యం పూర్తి చేసి మూసి వేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 7 వేల మంది రైతుల ఖాతాలలో 108 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందని, ధాన్యం సేకరణలో జిల్లాలోని 20 మిల్లులు, కరీంనగర్లోని 64 మిల్లులే కాకుండా పెద్దపల్లి జిల్లాలోని మిల్లులకు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించబడి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 1.5 సెంటీమీటర్ల వర్షం పడిందని, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని తెలిపారు. జిల్లాలోని 345 కొనుగోలు కేంద్రాలలో ఒక కేంద్రానికి 15-20 మంది చొప్పున 5175-6900 మంది హమాలీలు, 1725 మంది సిబ్బంది, 18 మంది తహశిల్దార్లు, 18 మంది మండల ప్రత్యేక అధికారులు, 18 మంది వ్యవసాయ అధికారులు, 85 మంది విస్తరణ అధికారులు, పౌరసరఫరాల అధకారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి, సహకార శాఖల అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్, కలెక్టర్ లతో కలిపి మొత్తం 7 వేల మందికి పైచిలుకు అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను యజ్ఞం లాగా కొనసాగిస్తున్నారని, త్వరలోనే సేకరణ ప్రక్రియ ముగిసే దశలో ఉందని తెలిపారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 6303928683 నంబర్ను అందుబాటులో ఉంచి 24ఐ7 సేవలు అందించడం జరుగుతుందని, గోనె సంచులు 62.50 లక్షలు అవసరం కాగా 52.09 లక్షలు కలిగి ఉండి 45.43 లక్షల సంచులు కొనుగోలు కేంద్రాలకు అందించగా 6.63 లక్షల సంచులు గోదాములో ఉన్నాయని, ప్రతి రోజు 1 లక్షా 50 వేల సంచులు రాష్ట్రం నుండి వస్తున్నాయని తెలిపారు. గతంలో లేని విధంగా 3 సెకార్లను 4 సెక్టార్లుగా పెంచి 400 పైచిలుకు లారీలు అందుబాటులో తీసుకువచ్చామని, జిల్లాలో సింగరేణి సంస్థ ఉండటం వలన లారీల కొరత లేదని, లారీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో 20-30 చొప్పున మొత్తం 2 వేల 677 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, 1 వేయి 797 అదనంగా ఉన్నాయని, 164 ఆటోమేటిక్ ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు ఉన్నాయని తెలిపారు. గతంలో పోల్చితే మరింత మెరుగ్గా, వేగంగా రైతులు సేవలు అందుతున్నాయని, ఎలాంటి సమస్యలు తలెత్తినా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్, జిల్లా అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ అందుబాటులో ఉంటారని, కాల్ సెంటర్లో సంప్రదించవచ్చని, అన్ని వేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు.



## అంతర్గత గ్రూపుపోరు బహిర్గతం

- రాష్ట్ర నాయకుల సాక్షిగా కుమ్ములాట

**చెన్నూర్, మే 19 (జనం సాక్షి) :** పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో కాంగ్రెస్ సంస్థ గత ఎన్నికల సమావేశంలో వర్గ పోరు రాష్ట్ర నాయకులు రాఘవరెడ్డి, రామ్ భూపాల్ సాక్షిగా కుమ్ములాట బహిర్గతం కావడం జరిగింది. చాలా రోజులుగా పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో కొత్త వారు, పాతవారిని వర్గబేధాలతో కొత్తవారికి పదవులు కట్టబెడుతున్నారని ఒకరిపై ఒకరు చేయి చేసుకోవడంతో గొడవ ముదిరే క్రమంలో పోలీసులు జోక్యం చేసుకొని గొడవ సర్దుమనిగేలా శాంతింప చేశారు. అనంతరం ఇరు వర్గాలవారు రాష్ట్ర నాయకులు వారి గోడును అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాల విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మా బైకులు మాకు ఇవ్వాలి

- కాళేశ్వరంలో రెండు కుటుంబాల ధర్నా..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం (జనంసాక్షి):** మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ప్రధాన ఘాటు వద్ద రెండు బైకులపై వెళ్తున్న కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. ప్రధాన ఘాటు నుండి సరస్వతి ఘాటు వరకు రెండు కుటుంబాల సభ్యులు రెండు బైకులపై వెళ్తుండగా ప్రధాన ఘాటు వద్ద అప్పటికే సెక్యూరిటీగా ఉన్న పోలీసులు ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ దృష్ట్యా నిలిపివేస్తున్నారు. ఈ క్రమంలో తమ బైకులు ఆపారని, ఈ ప్రాంతానికి చెందిన తాము సరస్వతి ఘాటు వద్దకు వెళ్లకుండా బైక్ లను స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ ఆ రెండు కుటుంబాల సభ్యులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ పసిపిల్లలతో రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు ఇంతలో ఓ ఎమ్మెల్యే కాన్వాయ్ రావడంతో పోలీసులు శాంతించి ఆ కుటుంబాలకు చెందిన రెండు బైకులు అప్పగించడంతో సమస్య సద్దుమణిగింది..

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారం పై శ్రద్ధ వహించండి

- ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్



**వరంగల్ ఎంజీఎం, మే 19(జనంసాక్షి):** ప్రజా ఫిర్యాదుల పరిష్కారం పై శ్రద్ధ వహించి వెంటనే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అన్నారు.సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తు లను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా..ఇంజనీరింగ్16,హెల్త్, సానిటేషన్ 14, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)7,టౌన్ ప్లానింగ్ 56, మంచినీటి సరఫర 6 మొత్తంగా 99 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ ఓ లు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, ఏం హెచ్ ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, మే 19 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి పాల్గొని ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి, డిఆర్ఓ విజయలక్ష్మి వరంగల్ ,నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి ఉమారాణి లు,డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు.వివిధ సమస్యల పై అర్జీదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి వారి సమస్యల పై దరఖాస్తులు సమర్పించారు.జిల్లా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. పరిష్కరించ లేని దరఖాస్తులను అందుకు కారణాలను దరఖాస్తుదారునికి తెలియ పరచాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారుల సూచించారు. ప్రజావాణి లో వివిధ శాఖల వారీగా 128 దరఖాస్తులు స్వీకరించగా, అందులో రెవెన్యూ సమస్యలపై 54, పిడి హౌసింగ్ మున్సిపాలిటీ-7, దరఖాస్తులు రాగా, మిగతా శాఖలకు ఆసంబంధించిన 46దరకాస్తులు వచ్చాయని, వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, త్రాగునీటి సమస్య తదితర అంశాలపై జిల్లా యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ డి సి ఓ నీరజ డిపిఓ కల్పన వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి

- రైతును రాజును చేయడమే సీఎం ధ్యేయం
- రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి, మే 19 (జనంసాక్షి) :** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతును రాజును చేయాలన్న దృఢ సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న రైతులందరికీ సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో సన్న రకం ధాన్యం సాగు చేసుకునేందుకు రైతులను ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. సన్న రకం ధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాలకు 500 బోనస్ అందించి దేశానికే ఆదర్శంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిలిచిందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రతి గ్రామంలో ఐకెపి, సొసైటీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి కోతలు విధించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. చివరి ధాన్యం గింజ కొనేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని పెంచుకునేందుకు జీలుగ విత్తనాలు దోహదపడతాయని తెలిపారు. రైతులు ఆర్థికంగా నష్టపోకూడదని సదుద్దేశంతో 30 కిలోల జీలుగుగా బస్తాకు 4275 రూపాయలు ఉండగా రాయితీపై ప్రభుత్వం 2137 రూపాయలకు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ పాలకుర్తి సబ్ డివిజన్ ఉపసంచాలకులు అజ్మీర పరశురామ్ నాయక్, మండల వ్యవసాయ అధికారి శరత్ చంద్ర, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, పాలకుర్తి సొసైటీ మాజీ చైర్మన్ వీరమనేని యాకాంతరావు, పాలకుర్తి పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగన్న గౌడ్, నాయకులు పెనుగొండ రమేష్, ఎండి సలీం, గుగులోతు కిషన్, హరీష్, భాస్కర్, రైతులు ఎన్ శ్రీనివాసరావు, చిలువేరు సంపత్, లొంక శ్రీను, మధు తదితరులు పాల్గొన్నారు.

# లాభాల కోసమే జాప్యమా?

- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పశువుల పాలేనా..?
- ప్రైవేటు వ్యక్తులకు అమ్మేందుకు ట్రాక్టర్లతో ధాన్యం తరలింపు



**మల్హర్, మే 19(జనంసాక్షి) :** మండల కేంద్రమైన తాడిచెర్ల లోని ఓసిపి మూల మలుపు వద్ద పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కాంటాలు పెట్టడంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు కావాలనే జాప్యం చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు సోమవారం నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు రాత్రింబవళ్ళు ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్మడానికి అష్ట కష్టాలు పడుతున్నామని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాడానికి నెల రోజులుగా సెంటర్ నిర్వాహకులు కావాలని జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు కారుమబ్బులతో అకాల వర్షాల వల్ల ధాన్యాన్ని కాపాడేందుకే నానా తంటాలు పడుతున్నామని మరోవైపు పండించిన పంటను అమ్మేందుకు కేంద్రాల్లో రాత్రి పగలు పశువులు, పందులకు కాపలగా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల తమ పంట తడిస్తే కొర్రీలతో మరింత ధాన్యం కోత విధించవచ్చుననే సెంటర్ నిర్వాహకులు కావాలని కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కొనుగోళ్లలో ఆలస్యం కావడంతో వర్షాల వల్ల తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాహకులు సకాలంలో తూకం వేయకపోవడంతో తమ పరిస్థితి పంట అమ్మడానికి అగచాట్లు పడుతున్నామని పేర్కొన్నారు. ధాన్యం తూకం వేయడానికి గన్ని సంచులు ఇచ్చి వారం నుంచి రెండు వారాలు గడుస్తున్నా హమాలీలు కాంటాలు పెట్టడం లేదని హమాలీలను అడిగితే సెంటర్ నిర్వాహకులు తమకు పని చెప్పడం లేదంటున్నారని రైతులు తెలిపారు. లారీల కొరత ఉందంటూ నిర్వాహకులు కుంటి సాకులు చెబుతూ దాటవేయడంతో ఇటు కొనుగోలు చేయక, అటు కారు మబ్బులకు భయాందోళనకు గురై కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యాన్ని ప్రయివేటు దళారులకు అమ్మేందుకు ట్రాక్టర్లలో పోసుకొని పోతున్నామని చెబుతున్నారు.ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు మాత్రం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తూ వేగం పెంచాలంటూ నిర్వహకులను అదేశిస్తున్నారు. నిర్వాహకులు మాత్రం ఉన్నతాధికారులు ఆదేశాలు పెడచెవిన పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రైతుల ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రమాదవశాత్తు అరటి తోట దగ్ధం

- రూ.5 లక్షలు నష్టం



**చిట్యాల, మే 19 (జనంసాక్షి) :** ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి అరటి తోట, డ్రిప్పు పైపులు దగ్ధమయ్యాయి. మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన క్యాతం వెంకట్రమణ తనకున్న మూడు ఎకరాల్లో అరటి తోట సాగు చేశారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం పక్క చేను రైతు తన పొలంలో ఉన్న వ్యర్థాలను కాలుస్తుంటే మంటలు వ్యాపించి చేను అంటుకున్నది. గమనించిన చుట్టూ రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరి చల్లార్చారు. దీంతో ఎకరానికి పైగా పంట దగ్ధమైంది. రూ5 లక్షల వరకు నష్టం జరిగిందని బాధిత రైతు వెంకటరమణ తెలిపారు.

## ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట మే 19 (జనం సాక్షి) :** రైతులు నష్ట పోకుండా ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం అన్నారు. ఆయన మాట్లాడుతూ రైతు వేదికలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద తో కలసి అధికారులు, రైస్ మిల్లర్లతో నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షించి సమర్ధ నిర్వహణకు పలు సూచనలు చేశారు. రబి కాలంలో నియోజకవర్గంలోని 6 మండలాల్లో అధిక వరి దిగుబడి వచ్చిందని, ఇప్పటివరకు 40 శాతం ధాన్యం కొనుగోలు చేసారని అన్నారు. క్షేత్ర స్థాయిలో మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి అధికారులు ధాన్యం నిలువ వివరాలు సేకరించి ,దాని ప్రకారం ప్రణాళికాబద్ధంగా లారీలను, హమాలీలను ఏర్పాటు చేసుకొని వేగవంతంగా మిల్లులకు తరలించాలని అన్నారు. రైస్ మిల్లర్లకు సామర్థ్యాన్ని బట్టి వెంటనే కేటాయింపులు చేయాలని అధికారులను ఆదేశించారు. కొంత మంది మిల్లర్లు కావాలని తరుగు పేరుతో రైతులను ఇబ్బం దులు పెడుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ట్రక్ షీట్ ప్రకారమే తీసుకోవాలని కోతలు విధిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో 1.07 మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 31.54 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకూడదని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశిత మిల్లులకు తరలించాలని తెలిపారు.అవసరమగు లారీలు సమకూర్చాలని జిల్లా రవాణా అధికారిను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష లో ఆదనవు కలెక్టర్ సంధ్యా రాణి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, డిఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఆర్డీఓ ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలోనే గ్రామ దేవతలకు గుర్తింపు

- శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాష్
- పెద్దమ్మ తల ఆలయంలో ఎమ్మెల్సీ, మాజీమంత్రి పూజలు



**పాలకుర్తి, మే 19 (జనంసాక్షి) :** తెలంగాణలోని గ్రామదేవతలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ బండ ప్రకాష్ అన్నారు. మండలంలోని వల్మిడిలో ముదిరాజుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తో పాటు మాజీ సైనిక వైద్య అధికారి కల్నల్ మాచర్ల బిక్షపతి ముదిరాజ్ తో కలిసి ఎమ్మెల్సీ బండా ప్రకాష్ పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బండా ప్రకాష్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముదిరాజుల విశ్వాసానికి పెద్దమ్మ తల్లి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. తెలంగాణలో గుళ్ళు, గోపురాలకు ఇచ్చే ప్రాధాన్యతతో పాటు బహుజనులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి బహుజన వర్గాలకు జవాబుదారీగా ఉండాలని మాజీ సైనిక వైద్యాధికారి కల్నల్ మాచర్ల బిక్షపతి ముదిరాజ్ అన్నారు. గుళ్ళు, గోపురాల నిర్మాణాలకు చందాలు అడుగుడుకు స్వస్తి పలికి చందాలు ఇచ్చే స్థాయికి బహుజనులు ఎదిగినప్పుడే బహుజన రాజ్యాధికారానికి సార్ధకత ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ బండ ప్రకాష్ తో పాటు మాజీ మంత్రి దయాకర్ రావు, సైనిక మాజీ వైద్యాధికారి కల్నల్ మాచర్ల బిక్షపతిని ముదిరాజులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ఇన్చార్జి చిక్కుడు రాములు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, మాజీ జెడ్పిటిసి పుస్కూరి శ్రీనివాసరావు, పాలకుర్తి సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి, జిసిసి మాజీ చైర్మన్ ధరావత్ మోహన్ గాంధీ, సొసైటీ వైస్ చైర్మన్ కారుబోతుల వేణు, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, మాజీ సర్పంచ్ సైదులు, ఉప సర్పంచ్ నీరటి సోమయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు పంగ సైదులు తోపాటు నాయకులు నాయకులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో సిరికొండ ప్రశాంత్ పూజలు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయ శంకర్ భూపా లపల్లి జిల్లా మహా దేవపూర్ మండలం కాళే శ్వరంలో సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిరికొండ ప్రశాంత్ ప్రత్యేక పూజలు చేశారు. సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వర గంగానది పుణ్య స్థానాన్ని ఆచరించిన అనంతరం ఆయన ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

# ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడండి

- పరిసర దళిత గృహ యజమానులు ప్రజావాణిలో మొర
- ప్రభుత్వ భూమిని ఆక్రమణలకు గురికాకుండా చర్యలు
- కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి కలెక్టరేట్, మే 19 (జనం సాక్షి) :** ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా ,తగిన చర్యలు చేపడతామని కలెక్టర్ హనుమంతరావు హామీ ఇచ్చారు. సోమవారం ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు పై విధంగా స్పందించారు. పట్టణ పరిధిలో 11వ వార్డులో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలి అని, పరిసర దళిత గృహ యజమానులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. 1971 సంవత్సరంలో భువనగిరి మున్సిపల్ పరిధిలోని 11 వ వార్డులో సర్వే నెంబర్ 85లోని నాలుగు ఎకరాల భూమిని షెడ్యూల్ కులాలకు ఇల్లు నిర్మించుకునేందుకు పంపిణీ చేయడం జరిగింది అని, సుమారు రెండు ఎకరాలలో 33 కుటుంబాలు ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నారు. అందులో రెండు ఎకరాల భూమి మిగిలి ఉండగా, వార్డులోని పరిసరాలలోని ఇతర కులస్తులు స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆ స్థలంలో అర్హులైన వారికి ఇంటి నిర్మాణకు ప్రభుత్వం అధికారికంగా పంపిణీ చేపట్టాలని కోరారు, లేనిపక్షంలో కనీసం భద్రత కల్పించాలని వార్డ్ దళిత గృహ యజమానులు దాసరి స్వామి, రామచంద్రయ్య, కూరం పోశాల్, దాసరి రాములు, జైపాల్, అశోక్, జంగిడి గండయ్య, రావుల అయోధ్య తదితరులు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. అదే వార్డులోని బొమ్మాయిపల్లికి చెందిన సర్వే నెంబర్ 118 లో వెనుకబడిన తరగతుల వారికి 68 ప్లాట్ లు మంజూరు చేశారని, ప్లాట్ లకు లేఅవుట్ చేయించి, హద్దులు గుర్తించి, నెంబర్ లు వేయించి ఇవ్వాలని భవాని, విజయలక్ష్మి, రేణుక, సుశీల, అనిత తదితరులు. కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలోని చౌక ధర దుకాణాల డీలర్‌లు తమ విజ్ఞప్తిని అందజేస్తూ మార్చి మాసం నుంచి ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నందున, సుమారు 350 షాపులలో ఫిబ్రవరి మాసం దొడ్డు బియ్యం పంపిణీ నిలిచిపోయిన స్టాక్ నిల్వ ఉందని, వర్షాకాలంలో బియ్యం తడిసే అవకాశం ఉన్నదని మరో వైపు పురుగులు వచ్చే పరిస్థితి ఉన్నందున ఆ క్రమంలో పురుగులు సన్నబియ్యానికి వచ్చే అవకాశం ఉందని దొడ్డు బియ్యం స్టాకును సాధ్యమైనంత త్వరగా తిరిగి తీసుకోవాలని కోరారు. సన్న బియ్యం తూకం వేసి ఇవ్వాలని , తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా అధ్యక్షులు ఎలగల రాజయ్య తోపాటు 12 మండలాల డీలర్ లు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. బీబీనగర్ మండలం గూడూరు కు చెందిన, గుమ్మడి జగదీష్ తన వయస్సు 65 సంవత్సరాలు దివ్యాంగుడానని, తనకు పెన్షన్ మంజూరు తో పాటు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రతి విజ్ఞాపన ను అధికారులు సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వీరారెడ్డి జెడ్పిసిఈఓ శోభారాణి డిఆర్డిఓ నాగిరెడ్డి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పథకాల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలి

- సంబంధిత శాఖల అధికారులు యంత్రాంగంతో సమీక్ష
- కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి కలెక్టరేట్, మే 19 (జనం సాక్షి) :** ప్రభుత్వ పథకాల దరఖాస్తుదారుల పరిశీలన, వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాములైన రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు, దరఖాస్తుదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని సంబంధిత శాఖల యంత్రాంగంతో సమీక్షించారు. జూన్ రెండవ తేదీన రాజీవ్ యువ వికాస పథకం ,ఇందిరమ్మ ఇండ్లు పథకాలను అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను జారీ చేయవలసి ఉన్నందున స్క్రూటిని ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. బ్యాంకులలో దరఖాస్తులు పెండింగ్ లేకుండా 95 శాతం పూర్తయిందన్నారు. 4314 దరఖాస్తులు మాత్రమే పెండింగ్ లో ఉన్నందున కారణాలను విశ్లేషించి తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించని లబ్ధిదారుల కు నోటీసులు ఇవ్వాలి అని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో భాగంగా 160 ఇండ్లు బేస్మెంట్ లెవల్ పూర్తి చేసు కున్న లబ్ధిదారులకు, లక్ష రూపాయలు వారి ఖాతాలలో వేయడం జరిగిందన్నారు. నేటికీ నిర్మాణపు పనులు మొదలు పెట్టని లబ్ధిదారులను ఎంపీడీవో లు గుర్తించి డి ఆర్ డిఓ ద్వారా చేయూతని ఇప్పించాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పునాది చేపట్టి బేస్మెంట్ ను త్వరితగతిన పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉందని, వర్షాలు పడుతుండగా గోడలు నిర్మించుకోవచ్చు అని క్యూరింగ్ కు అవకాశం ఉంటుందన్నారు. పునాదిలో ఉంటే గుంటలలో నీళ్లు నిలిచి ఇంటి నిర్మాణం చేపట్టలేని పరిస్థితిలు ఉత్పన్నమవుతాయన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం తగదని సత్వరమే పరిష్కరించాలని, ప్రజా పాలనలో సుమారు 30 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యపు రాశులు నిలవ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లారీల కొరత సృష్టిస్తే సదరు కాంట్రాక్టర్ ల ను బ్లాక్ లిస్ట్ లో పెడతామన్నారు. వారం రోజులపాటు అధికారులు ఆలక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి రైతులకు అండగా నిలవాలని తెలిపారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్ పి సిఈఓ శోభారాణి, డిఆర్ డి ఒ నాగిరెడ్డి జిల్లా అధికారులు సంబంధిత శాఖల యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**తిరుమలగిరి (సాగర్), మే 19 (జనంసాక్షి) :** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యుడు కుందూరు జైవీర్ అన్నారు . సోమవారం మండలంలోని చిలకాపురం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమానికి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి హాజరై పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేసి అనంతరం మాట్లాడారు. ప్రతి ఊరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, ప్రతి బీద కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేసి వారి జీవితాలలో వెలుగులు చూస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని వారన్నారు. పేదల అభ్యున్నతికై కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది అని అన్నారు. గత ప్రభుత్వం పేదలకి చేసింది ఏమీ లేదు అని ఎద్దేవా చేశారు. గ్రామంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో మల్లీశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ , మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్ ,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్ రెడ్డి , కృష్ణా నాయక్, వినోద్ రెడ్డి , షాగం రాఘవరెడ్డి ,కట్టెబోయిన అనిల్, వెంకటేశ్వర్లు గౌడ్ , శ్రీను ,ముని నాయక్, లాలు నాయక్ , తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలు వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, మే 19 (జనం సాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి అర్జీలను స్వీకరించారు. కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన ఈ. ప్రతాప్ గ్రామ శివారు సర్వే నెంబర్ 48లో గల 27 గుంటల భూమి మాజీ సర్పంచ్ ఆకుల గట్టయ్య అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, విచారణ చేసి తన భూమి తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డిఓ మంథని కు రాస్తూ సమస్య పరిష్కారానికి విచారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణం బండారి కుంటకు చెందిన ఏ. శ్రీధర్ 34వ వార్డులో ఉన్న తన భూమిని అంజయ్య అనే వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకుని సెట్ బ్యాంక్ లేకుండా నిర్మాణం చేశారని, దీనిపై విచారించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ రద్దుచేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి ఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన కొదురుపాక రైతులు చెరువు కట్ట నుంచి పొలాలకు వెళ్లే రోడ్డుకు బండలు అడ్డు వేసి రాకపోకలు నిలిపి వేస్తున్నారని వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ పరిశీలించే చర్యలు తీసుకోవాలని అన్నారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన షహీదా బేగం తాను ఇద్దరు పిల్లలతో ఒంటరిగా జీవిస్తున్నానని పదవ తరగతి వరకు చదివానని తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ రాష్ట్ర అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సన్నిధిలో పోటెత్తిన భక్తులు

- స్వామివారి దర్శనానికి 5గంటల సమయం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 19 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేసి తడిబట్టలతో కోడెల క్యూ లైన్‌లో భారులు తీరారు.కోడె మొక్కులు చెల్లించుకొని, స్వామివారి దర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలకు సెలవులు ప్రకటించడంతో ప్రతిరోజు రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతుంది. మరోపక్క వచ్చే నెల 15 న రాజన్న ఆలయం మూసివేయబడుతుందని సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో, రాజన్న ఆలయం మూసివేస్తారని ఉద్దేశంతో భక్తుల రద్దీ ప్రతిరోజు కొనసాగుతూనే ఉంది. సోమవారం రోజు సుమారు 80 వేల పైగా భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదింటి కల సకారం



**షాబాద్, మే 19 (జనం సాక్షి) :** ఎన్నో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేదవారి సొంత ఇంటి కల ఇందిరమ్మ ఇళ్లతో నెరవేరుతుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐతాబాద్ లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎండి ఖజామీయా పటేల్ తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలను అందించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి నిరుపేదకు అందుతాయన్నారు. ఎక్కడలేని విధంగా సన్న బియ్యం పంపిణీ మన రాష్ట్రంలో అమలవుతుందన్నారు. ఉచిత బస్సు మహిళలకు ప్రయాణంలో ఎంతో మేలు చేస్తుందన్నారు. ఉచిత కరెంటుతో పేదవారికి ఖర్చు భారం తగ్గిందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా మన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో విజయవంతంగా అమలవుతున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, కర్రోళ్ల యాదమ్మ, టేకుల అండాలు, చర్ల కొమరమ్మ, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కావలి శ్రీరాములు, ఎండి బురాన్, ఆకుల కృష్ణ, చర్ల సత్తయ్య, నరసింహ, శ్రీనివాస్, కృష్ణ, రవి, ప్రవీణ్, రహమత్ ఖాన్, శంకర్, రాము గౌడ్, మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**పెద్దపల్లి/ఎలిగేడు, మే 19 (జనం సాక్షి) :** ఎలిగేడు మండలం ముప్పిరి తోటలో జరుగును మంత్రుల పర్యటన విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు సోమవారం ఎలిగేడు మండలం ముప్పిరి తోట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి పరిశీలించి మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మే 20న మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎలిగేడు మండలం ముప్పిరి తోట గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం 2025 రెవెన్యూ సదస్సు అవగాహన కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డి .శ్రీధర్ బాబు పాల్గొంటారని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ఎలిగేడు తహసిల్దార్ బషీరుద్దిన్, ఎంపిడిఓ భాస్కర్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ వైఖరి విడనాడాలి



**భువనగిరి టౌన్, మే 19 (జనం సాక్షి) :** భువనగిరి పట్టణంలో ని సాధన స్కూలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతీ విషయంలో నియంతృత్వ వైఖరి అవలంబిస్తుందని అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో నిన్న హైదరాబాద్ లో అవగాహన సభ పెట్టారని దానికి కేంద్ర మంత్రి ఆన్లైన్ లో హాజరయ్యారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకే ఎన్నిక విధానం అసాధ్యం అన్నారు.రాజుల పరిపాలన దిశగా బీజేపీ అడుగులేస్తోందని విమర్శించారు.ఒకే దేశం ఒకే ఎన్నిక అంశం పై జరిగే నష్టాన్ని ఆయన వెళ్ళడించారు.పహాల్గం ఉగ్రదాడి విషయం లో బీజేపీ విధానం తానే పాలక వర్గం తానే ప్రతిపక్షంగా వ్యవహారిస్తున్న తీరును ఆయన ఎండగట్టారు. ఉగ్రదాడీ విషయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాల్సిన సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్,తృణమూల్ కాంగ్రెస్ లాంటి పార్టీ ల నుండి హాజరయ్యే ప్రతినిధులను బీజేపీ నిర్ణయిన్చడం ఏంటని వారు ప్రశ్నించారు. బీజేపీ సర్కారు వైఫల్యం కారణంగానే ఉగ్ర దాడి జరిగిందని ఆరోపించారు.ఉమ్మడి రాష్ట్రాల ప్రజల ఆరోగ్య ప్రయోజనాలు కాపాడే ఎయిమ్స్ లో సరైన వసతులు లేవని బీబీనగర్ ఎయిమ్స్ ను ఆయన స్వయానా సందర్శించినట్లు తెలియజేసారు.శానిటేషన్ రోగులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలం అయ్యారని స్థానిక కేంద్ర మంత్రులు ఎయిమ్స్ ను పట్టించుకోపోవడం విచారకరం అన్నారు.ఈ మీడియా సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతారాములు,సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి పాండు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ వి.హన్మంతరావు



**చౌటుప్పల్, మే 19 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.హన్మంతరావు అన్నారు. చౌటుప్పల్ , నేలపట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలును వేగవంతం చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న పలు సమస్యలను జిల్లా కలెక్టర్‌కు చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి తెలియజేశారు.ముఖ్యంగా రవాణా సమస్య ఎక్కువగా ఉందని,రైస్ మిల్లుల దగ్గర దిగుమతి రెండు నుంచి మూడు రోజులు పడుతుందని తెలిపారు. దీనికి ఎంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ డిఎస్ఓకు ఫోన్ ద్వారా రైస్ మిల్లర్ల దగ్గర దిగుమతి గురించి అడిగారు.మిల్లర్ పూసల గోదాం తీసుకున్నారని, 50 మంది హమాలీలు కూడా ఉన్నారని , రేపటి నుండి దిగుమతి త్వరగా జరుగుతుందని డిఎస్ఓ కలెక్టర్‌కు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ.శేఖర్ రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ,ఏఈఓ శంకరయ్య, గిర్కటి నిరంజన్ గౌడ్,ఢిల్లీ మాధవరెడ్డి,చిన్నం బాలరాజు,సంఘ సెక్రటరీ వై.రమేష్ రైతులు పాల్గొన్నారు.

# రాళ్లవాగు ప్రాజెక్టు సందర్శించిన ప్రభుత్వ విప్



**కథలాపూర్, మే 19 (జనం సాక్షి) :** కథలాపూర్ మండల పరిధిలోని రాళ్లవాగు కోనాపూర్ ప్రాజెక్టును సోమవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు ప్రాజెక్టును ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించడం జరిగింది. రాళ్లవాగు ప్రాజెక్ట్ నిజామాబాద్ జిల్లాలో ఉన్నప్పటికీ ఎక్కువగా భాగం కథలపూర్ మండలం పరిదిలో సాగు నీరు అందుతుంది. రాళ్ల వాగు ప్రాజెక్టు వేములవాడ నియోజకవర్గ పరిధిలోని సుమారు 3500 ఎకరాలకు సాగు నీరు అందుతుంది.ఈ ప్రాజెక్టు పై చాలా సార్లు అసెంబ్లీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,నీటి పారుదల మంత్రితో మాట్లాడం జరిగింది.కోనాపూర్ ప్రోజెక్ట్ లోని హేడు రెగ్యులేటర్, కాలువలు, మత్తడి ని పరిశీలించడం జరిగింది. పాడైన హెడ్ రెగ్యులేటర్, మత్తడి పై నూతన నిర్మాణములు,కాలువలను వెంటనే శుభ్రం చేయాలనీ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అవి పూర్తయితే కథలాపూర్ మండల పరిధిలోని భూషణరావుపేట, ఊటుపెల్లి, పెగ్గర్ల,చింతకుంట, గ్రామాల పరిధిలో సాగునీటికి ఇలాంటి ఇబ్బంది ఉండకుండా ఉంటుంది.తద్వారా భూగర్భ జలాలు కూడా పెరగడం జరుగుతుంది.కాలువ మరమ్మతుకు గతంలో 21 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. ప్రాజెక్టు కోనాపూర్ నిజామాబాద్ జిల్లాలో ఉండడం ఆయకట్ట ఎక్కువ వరకు వేములవాడ నియోజకవర్గ భాగంలో ఉండటం వల్ల రైతులకు ఇబ్బంది తలతుంది. నిర్వహణా బాధ్యత ఎవరికో ఒకరి ఇచ్చేలా అధికారులు చూడాలి.రాళ్ల వాగు ప్రాజెక్టు ఉపయోగంలోకి తేవాలి. రాళ్లవాగు ప్రాజెక్టు సామర్థ్యం పెంచే అవకాశలు పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజ ప్రభుత్వంలో రైతులకు పెద్ద పీట వేయడం జరిగింది. రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ ఇవ్వడం జరిగింది. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శ్రీ పాదఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా మన ప్రాంతంలో 1737 కోట్లతో సాగు నీటి కోసం భూమి పూజ నిర్వహించారు. ఆనాడే చందుర్తి, ఫాజ్లునగర్, రుద్రంగి ప్రోజెక్టు పూర్తి చేసుకున్నాం. గత పాలకుల నిర్లక్ష్యం వలన కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ పనులు పూర్తి కాలేదు నేడు ప్రజా ప్రభుత్వంలో కళికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మొదటి ప్రాధన్యత క్రమంలో పూర్తి చేసే ప్రాజెక్టులో కాళికోట సూరమ్మ చెరువు పెట్టడం జరిగింది.రైతులకు సాగు నీరు అందించడం లక్ష్యంగా ముందుకు పోతుంది. చాలా సంవ్సరాలుగా రైతులు ఎదురు చూస్తున్నా రాళ్ళ వాగు ప్రాజెక్టు పనులు చేపట్టడం జరుగుతుంది. వర్షా కాలం నీటిని ఒడిసిపట్టడం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుంది.. పలు హొదాలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఉన్నత అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# భూమిలో కరిగిపోయే సంచులను ప్రోత్సహించాలి

- బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ విన్ ఓవెన్
- రమణి ఇండస్ట్రీస్ ఉత్పత్తులు అద్భుతం




**చౌటుప్పల్, మే 19 (జనంసాక్షి) :** పర్యావరణాన్ని రక్షించేందుకు రమణి ఇండస్ట్రీస్‌లో ఉత్పత్తి చేస్తున్న భూమిలో కరిగిపోయే సంచుల తయారీ ప్రశంసనీయమని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారేత్ విన్ ఓవెన్ అన్నారు. ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా మట్టిలో కరిగిపోయే సంచులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరి పైన ఉందని తెలిపారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం హరిత పారిశ్రామిక పార్కులోని రమణి బయో కాంపోస్టిక్ పరిశ్రమను సోమవారం ఆయన సందర్శించారు. డిఆర్‌డిఓ శాస్త్రవేత్తలు అందించిన సాంకేతిక సహకారంతో రమణి, డాక్టర్ ప్రసాద్‌లు నెలకొల్పిన రమణి ఇండస్ట్రీస్‌లో బయో డి గ్రేడబుల్ సంచులను తయారు చేసే ప్రక్రియను ఆయన పరిశీలించారు. మొక్కజొన్న పొట్టుతో తయారయ్యే గ్రాన్యూల్స్‌ను ఉపయోగించి వివిధ రకాల క్యారీ బ్యాగులను,రైతులు ఉపయోగించే మల్చింగ్ షీట్లను తయారు చేసే యంత్రాలను, వాటి నుంచి తయారుచేసిన సంచులను, ఆ సంచులపై సంస్థల పేర్లను ముద్రించే పద్ధతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యాపారం కోసం కాకుండా సమాజానికి పర్యావరణానికి తమ వంతుగా కృషి చేయాలని సంకల్పంతో ఈ పరిశ్రమను స్థాపించామని రమణి ,డాక్టర్ ప్రసాద్‌లు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్‌కు వివరించారు. ఈ సంచులను ఉపయోగించి భూమిలో ఎక్కడ పడవేసిన 90 రోజులలో అవి మట్టిలో భూమికి ఎరువుగా ఉపయోగపడతాయని వివరించారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో తాము స్వయం ఉపాధి పొందడంతో పాటు ఈ ప్రాంతంలోని కొంతమందికి పని కల్పించగలుగుతున్నామని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ కు వివరించారు. బయో డిగ్రేడబుల్ ఉత్పత్తులను ప్రోత్సహించి తమకు సహకారం అందించాలని కోరారు.




# అమ్మకాల ఒత్తిడి..

## దివీస్ ల్యాబ్స్ షేర్లు 4% జంప్



రక్షణ రంగ ఉత్పత్తుల సంస్థ జెన్ టెక్నాలజీస్ షేర్లు నేడు ట్రేడింగ్ సెషన్‌లో రాణించాయి. ఎన్ఎస్ఈలో ఒక్కో షేరు 5 శాతం పెరిగి రూ.1,884.50 దగ్గర అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో మెరుగైన వృద్ధిని నమోదు చేసినట్లు కంపెనీ తాజా ఫలితాల్లో వెల్ల డించింది. దీంతో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో షేర్లు అప్పర్ సర్క్యూట్ తాకా యి.గత ఆర్థిక సంవత్సరం జనవరి–మార్చి మధ్య కాలంలో రూ.349.74 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో నమోదైన రూ.144.04 కోట్లతో పోలిస్తే ఏకంగా 129.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. నికర లాభం రూ.37.58 కోట్ల నుంచి రూ.113.74 కోట్లకు చేరింది. మొత్తం ఆర్థిక సంవత్సరం లో ఆదాయం రూ.1032.02 కోట్లు, నికర లాభం రూ.299.33 కోట్లుగా ఉన్నాయి. ప్రముఖ ఔషధ కంపెనీ దివీస్ లెబొరేటరీస్ నాలుగో త్రైమాసిక ఫలితాల్లో మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. దీంతో సోమవారం ట్రేడింగ్ సెషన్‌లో షేర్లు రాణిస్తున్నాయి. ఫలితాలకు తోడు బ్రోకరేజీ సంస్థలు మెరుగైన రేటింగ్‌ను అందిస్తుండటంలో షేర్లు కొనుగోలు చేసేందుకు మదుపర్లు ఆసక్తి చూపుతున్నారు.

### • 25 వేల దిగువకు నిఫ్టీ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణతో సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లు ప్రధానంగా నష్టాలు మూటగట్టుకున్నాయి. అమెరికా ప్రభుత్వ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ సంస్థ తగ్గించింది. దీంతో ఐటీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుండడమే ఇందుక్కారణం. ఈ క్రమంలో నిఫ్టీ 25 వేల దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,354.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,330.59) స్వల్ప లాభాల్లో



ప్రారంభమైంది. రోజంతా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడింది. ఇంట్రాడేలో 81,964.57 – 82,424.10 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ.. చివరికి 271.17 పాయింట్ల నష్టంతో 82,059 వద్ద ముగిసింది. నిఫ్టీ 74.35 పాయింట్ల నష్టంతో 24,945.45 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.40గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, రిలయన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సూచీలు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.72 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3239 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## రూ.11,500 కోట్ల వ్యయ నియంత్రణే లక్ష్యం

### టాటా స్టీల్ సీఎఫ్ఓ కౌశిక్ ఛటర్జీ

దిల్లీ: మన దేశంలో కార్యకలాపాల విస్తరణతో పాటు, ఐరోపాలో పరివర్తన దశలో ఉన్న టాటా స్టీల్, రూ.11,500 కోట్ల వ్యయ నియంత్రణ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) కౌశిక్ ఛటర్జీ వెల్లడించారు. నియంత్రించదగిన వ్యయాలపై దృష్టి సారించడం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. కంపెనీలు అనవసరమైన వ్యయాలను తగ్గించుకుని, లాభదాయకత, సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడంపై దృష్టి సారించడాన్ని ఆర్థిక పరిభాషలో 'కాస్ట్ టేకౌట్' అంటారు. టాటా స్టీల్ కూడా కాస్ట్ టేకౌట్స్ ద్వారా వివిధ భౌగోళిక ప్రాంతాల్లో వ్యయ నియంత్రణ చర్యలకు దిగనున్నట్లు అనలిస్ట్ కాల్‌లో కౌశిక్ వివరించారు. వచ్చే 12–18 నెలల్లో దీన్ని సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

## యూకో బ్యాంక్ మాజీ సీఎండీ అరెస్ట్

యూకో బ్యాంక్ మాజీ సీఎండీ సుబోధ్ కుమార్ గోయల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అరెస్టు చేసింది. కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ కు రుణాల మంజూరులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయన్ని అదుపులోకి తీసుకుంది.సుబోధ్ కుమార్ గోయల్ యూకో బ్యాంక్ సీఎండీగా ఉన్న సమయంలో సీఎస్‌పీఎల్‌కు పెద్దఎత్తున నిధుల్ని మంజూరుచేశారు. ఇలా మంజూరైన రూ.6,210.72 కోట్లను ఆ సంస్థ దుర్వినియోగం చేసిందని సీబీఐ దర్యాప్తులో తేలింది. అయితే, రుణ మంజూరు విషయంలో గోయల్‌కు ముడుపులు అందినట్లు సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఆ నిధులు గోయల్, ఆయన కుటుంబానికి చెందిన షెల్ కంపెనీల్లోకి బదిలీ అయినట్లు సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ రంగంలోకి దిగి అరెస్ట్ చేసింది. మే 17న గోయల్‌ను పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపర్చగా.. మే 21 వరకు ఈడీ కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 87,550 (22 క్యారెట్లు) | ₹ 95,510 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,09,000

## గ్లోబల్ మార్కెట్లోకి ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్ మింత్రా




ప్రముఖ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్ మింత్రా గ్లోబల్ మార్కెట్లోకి అడుగుపెట్టనుంది. విస్తరణలో భాగంగా సింగపూర్ నుంచి అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించనున్నట్టు సోమవారం ప్రకటనలో తెలిపింది. సింగపూర్‌లో సుమారు 6.5 లక్షల మంది భారతీయులు నివశిస్తున్నారు. ఈ నేపథ్యంలో సింగపూర్ వేదికంగా గ్లోబల్ మార్కెట్లలోకి అడుగుపెట్టవచ్చని, తద్వారా మరింత వేగవంతమైన వృద్ధికి, కొత్త వినియోగదారులను పొందేందుకు వీలవుతుందని మింత్రా భావిస్తోంది. భవిష్యత్తులో అంతర్జాతీయంగా మింత్రా బ్రాండ్‌ను మరింత సమర్థవంతంగా కొనసాగించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే సింగపూర్ నుంచి దాదాపు 30,000 మంది కస్టమర్లు తమ ప్లాట్‌ఫామ్‌ను సందర్శిస్తున్నారని మింత్రా సీఈఓ నందితా సిన్హా చెప్పారు. ప్రధానంగా భారతీయుల అవసరాలను తీర్చే మేడ్ ఇన్ ఇండియా బ్రాండ్‌లను అంతర్జాతీయంగా అందిస్తామని ఆమె పేర్కొన్నారు. మింత్రా గ్లోబల్ వెబ్‌సైట్‌లో దుస్తులు, పాదరక్షలు, గృహోపకరణాలు, ఇతర ఉత్పత్తులకు సంబంధించి 100కి పైగా భారతీయ బ్రాండ్లను విక్రయించనుంది. మింత్రా గ్లోబల్‌లో ఆర్డర్ చేసిన వస్తువులను భారత్ నుంచే సరఫరా చేస్తారు, సగటున 4–7 రోజుల్లోగా డెలివరీ అందిస్తారు. దీనికోసం థర్డ్–పార్టీ క్రాస్–బార్డర్స్ లాజిస్టిక్స్ సేవలను వినియోగించనున్నట్టు కంపెనీ తెలిపింది. కాగా, 2007లో ఏర్పాటైన మింత్రా ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్ అనుబంధంగా పనిచేస్తోంది. మింత్రా ప్లాట్‌ఫామ్‌లో 7 కోట్లకు పైగా యాక్టివ్ యూజర్లు ఉండగా, 9,700 కంటే ఎక్కువ బ్రాండ్లను విక్రయిస్తోంది.

## టెలికాం కంపెనీలకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

### వొడాఫోన్ ఐడియా షేర్లు డౌన్



దిల్లీ: టెలికాం సంస్థలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి బకాయిల నుంచి ఊరట కల్పించాలంటూ టెలికాం కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కోర్టు తిరస్కరించింది. దీంతో వొడాఫోన్ ఐడియా షేర్లు కుప్పకూలాయి. ఇంట్రాడేలో వీఐ షేర్లు 10 శాతం మేర క్షీణించాయి. ఏజీఆర్ బకాయిలపై వడ్డీ, పెనాల్టీలు, పెనాల్టీలపై వడ్డీ నుంచి తమకు మినహాయింపు కల్పించాలని టెలికాం సంస్థలు వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలీ సర్వీసెస్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాము మనుగడ సాధించాలంటే ఏజీఆర్ బకాయిలకు సంబంధించి రూ.45వేల కోట్లు మాఫీ చేయాలని తొలుత వొడాఫోన్ ఐడియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎయిర్‌టెల్ కూడా ఇదే తరహా పిటిషన్ వేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ నిర్ణయంతో టెలికాం సంస్థలపై భారం పడనుందన్న భయంతో షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఈ వార్తల నేపథ్యంలో మార్కెట్లు ముగిసే సమయానికి వీఐ షేర్లు 8.41 శాతం నష్టంతో, ఎయిర్‌టెల్ 0.14 శాతం లాభంతో ముగిశాయి.సుప్రీం కోర్టుకు వొడాఫోన్ ఐడియా దాఖలు చేసిన పిటిషన్‌లో రూ.83,400 కోట్లను ఏజీఆర్ బకాయిలుగా పేర్కొంది. ఇందులో రూ.12,797 కోట్లు ప్రిన్సిపల్, రూ.28,294 కోట్ల వడ్డీ, రూ.6,012 కోట్ల జరిమానా, రూ.11,151 కోట్ల జరిమానాలపై వడ్డీ ఉన్నాయని పేర్కొంది. ఇటీవల రూ.36,950 కోట్ల స్పెక్ట్రమ్ బకాయిలను, ఈక్విటీగా మార్చుకోవడంతో వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వం వాటా 48.99 శాతానికి చేరింది. అంతకు ముందు కంపెనీలో ప్రభుత్వానికి 22.6 శాతం వాటా ఉండేది. ఇక భారతీ ఎయిర్‌టెల్, దాని అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ ఏజీఆర్ కింద అసలు రూ.9,235 కోట్లు చెల్లించాల్సి ఉంది. వడ్డీ రూ.21,850 కోట్లు, జరిమా నాలు రూ.3,995 కోట్లు, జరిమానాలపై వడ్డీ రూ.8, 900 కోట్లు కలిపితే ఈ మొత్తం రూ.43,980 కోట్లకు చేరుకుందని ఎయిర్‌టెల్ తన పిటిషన్‌లో తెలిపింది.

## ఇష్టారీతిన ఐ డ్రాప్స్, ఇన్హేలర్ల వినియోగం

### • నిపుణుల స్ట్రాంగ్ వార్నింగ్



సాధారణంగా కన్ను ఎర్రబారిన, దురదపుడుతున్నా..డాక్టర్‌ని సంప్రదించకుండానే ఐడ్రాప్స్ తెచ్చుకుని వేసేసుకుంటాం. అలాగే కాస్త ముక్కుదిబ్బడగా ఉన్న వెంటనే నాసల్ ఇన్హేలర్లను వాడేస్తాం. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణ రిలీఫ్ కోసం తరుచుగా వీటిని వాడేస్తుంటాం. ఇలా అస్సలు చేయొద్దని వైద్యులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. అలా చేస్తే ఆ సమస్య తప్పదని చెబుతున్నారు.ఢిల్లీలోని ఎయిమ్స్‌లో పదేళ్ల వయసున్న పిల్లలు గ్లాకోమాతో బాధపడుతున్న కేసులు అధికంగా నమోదయ్యాయి. ఇలా ఎందుకు జరుగుతుందని వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించగా..విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొద్దిపాటి అలెర్జీలకైనా వెంటనే స్టెరాయిడ్ ఆధారిత కంటి చుక్కలను వాడుస్తుండటమే దీనికి కారణమని పరిశోధనలో తేలింది. ఎయిమ్స్‌లో నమోదైన దాదాపు చాలా కేసులు ఇలాంటి కోవకు చెందినవేనని వైద్యులు చెబుతున్నారు.ఇలా వైద్యుడిని సంప్రదించకుండా పదేపదే ఐ డ్రాప్స్ ఉపయోగిస్తే గ్లాకోమా బారినపడి అంధత్వంతో బాధపడతారని చెబుతున్నారు. ఇలా స్టెరాయిడ్ ఆధారిత కంటి చుక్కలు, ఇన్హేలర్లు లేదా స్టెరాయిడ్‌లను మాత్రలు లేదా ఇంజెక్షన్ రూపంలో ఉపయోగిస్తే..అవి కంటిలోపల ఒత్తిడిని పెంచుతాయని చెబుతున్నారు. ఫలితంగా కంటి లోపలి ఆప్టిక్ నరాలు దెబ్బతినడానికి దారితీస్తుందని చెబుతున్నారు.ముఖ్యంగా కండ్లకలక కోసం ఈ ఐడ్రాప్స్ వినియోగించి గ్లాకోమా బారిన పడిన కేసులు రాజస్థాన్, హర్యానా వంటి గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా నమోదయ్యాయని తెలిపారు వైద్యులు. అదీగాక ఈ గ్లాకోమా లక్షణాలను ప్రారంభంలో గుర్తించకుండా చివరిదశలో రావడంతో చాలామంది పిల్లలు అంధత్వం బారినపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే చాలామంది గ్లాకోమా రోగుల్లో ఇన్హేలర్ వాడకం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పిల్లల్లో అంతగా కనబడని ఈవ్యాధి..స్టెరాయిడ్ ఆధారిత ఐడ్రాప్స్, ఇన్హేలర్లు వాడటం వల్లనే అని పరిశోధనలో తేలింది.సాధారణంగా వయోజన గ్లాకోమా 40 సంవత్సరాల తర్వాత అభివృద్ధి చెందుతుందట. ముఖ్యంగా కుటుంబంలో ఎవరైనా ఈ వ్యాధి బారినపడిన చరిత్ర, డయాబెటిస్, రక్తపోటు, గుండె జబ్బులు, కంటి గాయం తదితరాల వల్ల ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే అథ్లెట్లు చర్మ సంబంధమైన స్టెరాయిడ్ క్రీమ్‌లు, కండరాల నిర్మాణానికి స్టెరాయిడ్ ఇంజెక్షన్లను వాడొద్దని హెచ్చరిస్తున్నారు వైద్యులు.ఇవి గ్లాకోమాకు దారితీస్తాయని అంటున్నారు. అంతేగాదు ముఖం మీద, కళ్ల చుట్టూ స్టెరాయిడ్లు ఉన్న క్రీములు వినియోగిస్తే..గ్లాకోమాకు దారితీయవచ్చని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా స్టెరాయిడ్ ఆధారిత కంటి చుక్కలు, క్రీమ్‌లు వినియోగిచొద్దని నొక్కి చెప్పారు. ఇక కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ పెరుగుదల కూడా కంటిలోపలి ఒత్తిడిని పెంచుతుందని, ఇది కంటిలోపలి రక్తపోటుకు దారితీస్తుందని అన్నారు. ఏదైనా కారణం చేత ఆరు వారాలకు పైగా స్టెరాయిడ్లు తీసుకునే రోగులు తప్పనిసరిగా వైద్యులు చేత గ్లాకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.గ్లాకోమా అనేది లక్షణాలు లేకుండా మన కను దృష్టిని అదృశ్యం చేసే వ్యాధి. అందువల్ల క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం అత్యంత కీలకం. ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన వారికి లేదా మధుమేహం, అధిక రక్తపోటు లేదా గ్లాకోమా వ్యాది వచ్చిన చరిత్ర ఉన్న వారికి ఈ సమస్య వచ్చే ప్రమాదం ఎక్కువని వెల్లడించారు. అంతేగాదు చాలామందికి తమకు గ్లాకోమా ఉందని తెలియదట. ప్రాథమిక స్థాయిలోనే దీన్ని గుర్తించేలా.. కంటి స్క్రీనింగ్‌పరీక్షలు అందరికీ అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యమని అన్నారు. దీన్ని ముందుగానే గుర్తిస్తేనే అంధత్వం బారినపడకుండా ఉండగలమని చెబుతున్నారు నిపుణులు.

## సారీ.. మోదీ మా పఠాన్ రాడు..

### • సీఎం మమతా బెనర్జీ షాకింగ్ నిర్ణయం



పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం ఏర్పాటు చేసిన ఆపరేషన్ సిందూర్ ఔట్రిచ్ కార్యక్రమంపై ఆమె సెటైర్లు వేశారు. టీఎంసీ ఎంపీ యూసఫ్ పఠాన్ను తమకు తెలియకుండా ఎలా ఎంపిక చేశారంటూ ప్రశ్నలు సంధించారు. యూసఫ్ ఈ డెలిగేషన్ నుంచి తప్పుకుంటారంటూ సీఎం మమత ప్రకటించారు. తమ పార్టీని సంప్రదించకుండానే కేంద్రం నిర్ణయం తీసుకుందని మమత చెప్పుకొచ్చారు. తృణమూల్ ఏ ప్రతినిధి పంపాలో కేంద్రం ఎలా నిర్ణయం తీసుకుంటుందని సీఎం ప్రశ్నించారు. కాగా కేంద్ర ప్రభుత్వం 7 అఖిలపక్ష బృందాలను వివిధ దేశాలకు పర్యటనకు పంపనున్నట్లు ప్రకటించింది. 2024 లోక్సభ ఎన్నికల్లో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన పఠాన్, లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అధిర్ రంజన్ చౌదరిని ఓడించారు. విదేశాలకు వెళ్లే మోదీ ప్రభుత్వ అఖిలపక్ష బృందంలో బీజేపీకి చెందిన రవిశంకర్ ప్రసాద్, బైజయంత్ పాండా, కాంగ్రెస్కు చెందిన శశి థరూర్, జెడియుకు చెందిన సంజయ్ కుమార్, డిఎంకెకు చెందిన కనిమొళి, ఎన్సిపి–ఎస్పికి చెందిన సుప్రియా సులే, శివసేనకు చెందిన శ్రీకాంత్ షిండే ఉన్నారు. వారందరూ వేర్వేరు ప్రతినిధి బృందాలకు నాయకత్వం వహిస్తారు. మొత్తం 51 మంది రాజకీయ నాయకులను విదేశాలకు పంపుతున్నారు.

## నటనకు ప్రశంసలు.. హత్యాయత్నం కేసులో అరెస్టు



ఆమె ఒక అందాల నటి. తన నటనా చాతుర్యంతో అనేకమంది అభిమానులను సంపాదించుకుంది. తాజాగా ఒక హత్యాయత్నం కేసులో అరెస్ట్ అయింది. ఢాకాలోని షాజహాన్ లాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హత్యాయత్నం కేసులో ఆదివారం ఆమెను అరెస్టు చేశారు. ఇంతకీ ఎవరా నటి? ఆమె చేసిన తప్పేంటి? పోలీసలు ఆమెపై ఎందుకు కన్నేశారు? తెలుసుకుందాం.హత్యాయత్నం కేసులో బంగ్లాదేశ్ నటి నుస్రత్ ఫరియాను అరెస్ట్ చేసిన పోలీసులు గట్టి భద్రత మధ్య కోర్టులో హాజరుపరిచారు. ఢాకాలోని స్థానిక కోర్టు జ్యుడీషియల్ కస్టడీకి తరలించడంతో ఆమెను జైలులోనే ఉండనుంది. దీనిపై నుస్రత్ ఫరియా న్యాయవాది బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. దీన్ని ఈ నెల(మే) 22న విచారి స్తుంది. గత సంవత్సరం షేక్ హసీనా ప్రభుత్వం కూల్చివేత, బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి దారితీసిన నిరసనలతో ఈ అరెస్ట్ ముడిపడి ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే నుస్రత్ ఫరియాపై అవామీ లీగ్‌కు నిధులు సమకూర్చారనే ఆరోపణలు ఉన్నాయి.నివేదికల ప్రకారం ఫరియా థాయిలాండ్‌కు వెళ్లాల్సి ఉండగా విమానాశ్రయంలో పోలీసులు అడ్డకున్నారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి హసీనా పాత్రను ఫరియా పోషించి పాపులర్ అయింది ఫరియా. బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు బంగ బంధు షేక్ ముజిబుర్ రెహమాన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'ముజిబ్ ది మేకింగ్ ఆఫ్ ఎ నేషన్' చిత్రంలో హసీనా పాత్ర ఫరియాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. 2023నాటి ఈ మూవీకి శ్యామ్ బెనెగల్ దర్శకత్వం వహిం చారు. ఈ చిత్రాన్ని బంగ్లాదేశ్ , భారతదేశం కలిసి నిర్మించగా అరిఫిన్ షువూ టైటిల్ పాత్రలో నటించారు.గత నెల వరకు,హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గత సంవత్సరం జరిగిన నిరసనలకు సంబంధించి కనీసం 137 మంది జర్నలిస్టులు 32 కేసుల్లో చిక్కుకున్నారు. కేసులోని వివరాల ప్రకారం నుస్రత్ ఫరియా, నటుడు అపు బిశ్వాస్, నిపున్ అక్తర్, అష్నా హబీబ్ భబ్నా, జాయెద్ ఖాన్ మరో 12 మందితో కలిసి భటారా ప్రాంతంలో జరిగిన వివక్ష వ్యతిరేక ఉద్యమం సందర్భంగా నమోదైన హత్యాయత్నం కేసులో నిందితులుగా ఉన్నారు. షేక్ హసీనా, 283 మందిపై కూడా ఇదే కేసులో ఆరోపణలు ఉన్నాయి.ప్రజాస్వామ్యయు తంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఎన్నికల ద్వారా ఎన్నుకునే వరకు పాలనను నిర్ధారించేలా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, కొంతమందివ్యక్తులను, పత్రికలను లక్ష్యంగా చేసుకున్నట్లు పౌర హక్కుల సంస్థలు, నేతలు మండి పడుతున్నారు. హసీనా నేతృత్వంలోని ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయి, తాత్కాలిక ప్రభుత్వం వచ్చినప్పటి నుండీ ఉగ్రవాదులు జైలు నుండి విడుదలవుతున్నారు. ప్రస్తుత పాలనలో ఉగ్రవాదులకు మద్దతుగా, భారత వ్యతిరేక స్వరాలకు ఊతమిచ్చినట్టవుతోందనే విమర్శలు బాగా విని పిస్తున్నాయి.నుస్రత్ ఫరియా 2013లో టెలివిజన్ యాంకర్‌గా పనిచేసింది. అందుకు ముందు రేడియో జాకీగా తన కెరీర్ ను ప్రారంభించింది. ఆమె కొన్ని నాటకాల్లో కూడా నటించింది. 2015లో బంగ్లాదేశ్–భారత్ సంయుక్తంగా నిర్మితమైన 'ఆషికి' ద్వారా వెండితెరకు పరిచయం మంది. అరంగేట్రంలోనే అందరి దృష్టినీ తమనవైపు తిప్పుకుంది. అనేక సినిమాల్లో నటించింది.

## అమెరికా మాజీ అధ్యక్షుడు బైడెన్‌కు క్యాన్సర్

### ఈ విషయం తెలిసి చాలా బాధపడ్డాం: ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రొస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు ఆయన కార్యాలయం తెలిపింది. ఇటీవల బైడెన్‌కు ఆ వ్యాధి సంబంధించిన లక్షణాలు కనిపించడంతో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఆయన ప్రొస్టేట్‌లో చిన్న కణతి ఏర్పడినట్లు గుర్తించారు. పరీక్షల్లో క్యాన్సర్ నిర్ధరణ అయినట్లు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ క్యాన్సర్ తీవ్రత ఎక్కువగా ఉందని అందులో వెల్లడించింది. దీనికి సంబంధించి చికిత్స అందించే అంశంపై బైడెన్ కుటుంబసభ్యులు వైద్యులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది .బైడెన్‌కు క్యాన్సర్ నిర్ధరణ కావడంపై ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా స్పందించారు. 'జో బైడెన్‌కు క్యాన్సర్ నిర్ధరణ విషయం తెలిసి నేను, మెలానియా చాలా బాధపడ్డాం. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ సైతం స్పందిస్తూ బైడెన్‌కు క్యాన్సర్ అనే విషయం తనను కలచి వేసిందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బైడెన్ కుటుంబానికి తాము అండగా ఉంటామని, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



## అగ్నిపర్వతం బద్దలు.. కి.మీ.ల ఎత్తుకు బూడిద

పడాంగ్: ఇండోనేషియాలో అగ్నిపర్వతం బద్దలైంది. అగ్నిపర్వతం ధాటికి దాదాపు ఆరు కిలోమీటర్ల ఎత్తుకు మందంపాటి బూడిద ఎగసి పడింది. దీంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని.. మాస్కులు ధరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతో?ంది.వివరాల ప్రకారం.. తూర్పు ఇండోనేషియాలోని లెవోటోబి లకి–లకిలో ఉన్న అగ్నిపర్వతం సోమవారం ఉదయం బద్దలైంది. ఈ సందర్భంగా అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫ్లోర్స్ దీవిలోని మౌంట్ లెవొటోబి లకిలకిలో విస్ఫోటనాలు ఏర్పడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ అధిపతి ముహమ్మద్ వాఫిద్ పేర్కొన్నారు. ఈ సమయంలో వర్షాలు పడితే అగ్నిపర్వతం చుట్టూ ఉన్న ప్రాంతాలకు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అన్నారు. ఇదే సమయంలో అగ్నిపర్వతం నుంచి దాదాపు 6 కి.మీ ఎత్తుకు మందంపాటి బూడిద ఎగసిపడుతున్నట్లు తెలిపారు. అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. త్వరగా గ్రామాలను ఖాళీ చేయించి, అక్కడి నివాసితులను ఇతర ప్రాంతాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని.. మాస్కులు ధరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# భారత సైన్యం సరైన రీతిలో సమాధానం చెప్పింది

- ఐక్యరాజ్యసమితిలో వారి విధానాలను ఎండగడతాం
- ప్రపంచ దేశాల ఆర్థిక సహాయాన్ని తీవ్రవాదులకు అందిస్తున్న పాకిస్తాన్ వైఖరిని ఖండిస్తున్నాం
- నీళ్లు కావాలంటే తీవ్రవాదాన్ని తుది ముట్టించాలి
- బిజెపి జిల్లా అధ్యక్షులు రాజభూపాల్ గౌడ్



**శంషాబాద్, మే 19, (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. తిరంగా యాత్ర పై ఎవరిపై ముఖ్య నాయకులతో కలిసి సమావేశం పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు రాజు భూపాల్ గౌడ్ మాట్లాడుతూ సరిహద్దులు దాట కుండా, పాకిస్తాన్ తీవ్రవాదుల, స్థావరాలను అంతమొందించే శక్తి భారత సాధించింది, పెల్గాం దాడులను ఖండిస్తూ ప్రతి కార్యచర్యగా పాకిస్తాన్ లో ఆపరేషన్ సిందూర్ ద్వారా తీవ్రవాదులకు గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి సంఘీభావంగా హైదరాబాద్‌లో తిరంగా యాత్ర నిర్వహించాలని జిల్లా కమిటీ నిర్ణయించారు. భారత సైన్యం పాకిస్తాన్ పై దాడి చేసివిజయ పతాకం ఎగరేసిందన్నారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞతగా భారతదేశ ఐక్యతను చాటారు. పాకిస్తాన్ తీవ్రవాదులకు సహకారం ఆపేంతవరకు నీటి సమస్య పరిష్కరించబడదు. నీరు కావాలంటే తీవ్రవాదులను అంతమొందించాల్సిందే. భారత ప్రభుత్వం రక్షణ విభాగాన్ని మరింత బలోపేతం చేసింది. సైన్యానికి కావలసిన ఆయుధాలను అందిస్తుంది. ఆపరేషన్ సింధూర్ లో వాడిన యుద్ధ పరికరాలు స్వదేశీ పరిజ్ఞానంతో కలిగినవని మరోసారి పాకిస్తాన్ ను హెచ్చరించారు.

రంగారెడ్డి జిల్లా బిజెపి ఆధ్వర్యంలో మే 20వ తేదీన శంషాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం నుండి తిరంగా యాత్ర లో బిజెపి నాయకులు ప్రతి ఒక్క భారతీయ పౌరులు బిజెపి కార్యకర్తలు పాల్గొనాలన్నారు. మన దేశ సైనికుల పోరాట పటిమను కీర్తిస్తూ, భారతదేశంపై ప్రేమను చాటుతూ ప్రతి ఒక్కరూ ఈ తిరంగా యాత్రలో పాల్గొనాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్ రాజ్, జిల్లా మాజీ అధ్యక్షులు అంజన్ కుమార్ గౌడ్, వై శ్రీధర్, మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, కుమురయ్య, తోకల శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ గుప్తా బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల్లో నిరంతరంగా మందులు సరఫరా చేయండి

**సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు**



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి ఆసుపత్రుల్లో ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు నిరంతరం మందులు సరఫరా చేసే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దండంరాజు రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి భూపెల్లి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో దాదాపు నలభై వేల మంది ఉద్యోగులు,ఎనభై మూడు వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారని,వీరిలో చాలా మంది సింగరేణి ప్రాంతాల్లో నివసిస్తున్నారని వారు పేర్కొన్నారు. వీరిలో కొందరు కంపెనీ ఆసుపత్రుల్లో ఔట్ పేషంట్ ట్రీట్మెంట్‌తో పాటు నెల వారిగా వాడే బి.పి.,షుగర్, గుండె, మోకాళ్ల నొప్పులకు సంబంధించిన మందులు వాడుతున్నారని, మరికొంతమంది తమ స్వగ్రామాల్లో నివసించడం, కొంతమంది తమ పిల్లలు పనిచేసే నగరాలైన హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం లాంటి పట్టణాల్లో వారిపై ఆధారపడి నివసిస్తున్నారని వారు తెలిపారు.వీరు ప్రతి నెల కంపెనీ దవాఖానకు వచ్చి మందులు తీసుకోవడం జరుగుతుందని, ఈ మధ్యన సింగరేణి హాస్పిటల్లో మందులు తగినంత సరఫరా లేనందువల్ల కొరత ఏర్పడిందని, మందుల కొరత వలన ఆసుపత్రి సిబ్బంది నెలకు సరిపడ మందులు ఇవ్వకపోవడంతో వారానికి ఒకసారి ఆసుపత్రులకు రావలసి వస్తుందని,తమ అవసరాలు తీర్చని పెన్షన్, వయోభారంతో బ్రతుకుతున్న విశ్రాంత ఉద్యోగులు ప్రతి వారం కంపెనీ ఆసుపత్రికి రావడం కష్టంతో కూడుకున్న వ్యవహారమని, కనుక సింగరేణి యాజమాన్యం మానవతా దృష్ట్యా ఆలోచించి, ఉద్యోగులకు,రిటైర్డ్ ఉద్యోగులకు నిరంతరం మందులు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టి వారిని ఆదుకోవాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరుతుందని వారు ఒక ప్రకటన కోరారు.

# లారీ దొంగిలించిన వ్యక్తి అరెస్ట్..

**పాలకుర్తి, మే 19 (జనంసాక్షి) :**



లారీ దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు, సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహేందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు,జనగామ జిల్లా, పాలకుర్తి మండల కేంద్రంలో రమావత్ హరికి చెందిన లారీని నెల రోజుల క్రితం అతని దగ్గర పని చేసే విశాల్ కుమార్ అనే బీహార్‌కు చెందిన వ్యక్తి దొంగలి ంచుకొని వెళ్లాడు, అందుకుగాను ఎఫ్ఐఆర్ నమోదు చేసి అతని కోసం గాలించగా సోమవారం మధ్యాహ్నం అతన్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు, దొంగలించబడిన లారీని గుర్తించి సీజ్ చేయడం జరిగిందన్నారు, అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ జనగామ 14 రోజుల రిమాండ్ విధించడం జరిగిందన్నారు, ఈ కేసు చేదించడంలో చాకచక్యంగా పనిచేసిన ఎస్సై పవన్ కుమార్, పిఎస్ఐ రాజేష్, లతోపాటు అసిస్టెంట్ అనాలసిస్ ఆఫీసర్ సల్మాన్ పాషా, కానిస్టేబుల్ రమేష్, సురేష్మ నోజ్, రమేష్,రాజకు మార్,రవి, ఈ కేసుని చేదించినందుకుగాను సిఐ మహేందర్ రెడ్డి అభినందించారు,

# అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు

**ప్రతి ఒక్క కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

పెద్దవంగర మే 19(జనం సాక్షి ) ప్రతి ఒక్క కార్యకర్త కలిసికట్టుగా ఉండాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు స్థానిక జిల్లా పరిశీలకులు రవళి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నిస్వార్థంగా ప్రజల కోసం పని చేస్తోంది. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి శక్తిమేరకు కృషి చేయాలి. కొత్త ప్రాతినిధ్యానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సంస్థాగతంగా పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయాలి. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా ముందుకు వెళ్లాలి అని అన్నారు..

ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ.మండలంలో పార్టీని శక్తివంతంగా నిలబెట్టేందుకు గ్రామాల వారీగా కార్యవర్గాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రతి కార్యకర్త లో సాన్నిహిత్యం పెంపొందించి, బూత్ స్థాయిలో పార్టీ మద్దతుదారులను సమీకరించడం మా లక్ష్యం. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలన్నదే ప్రధాన ధ్యేయం అని అన్నారు.. రవళి రెడ్డి మాట్లాడుతూ.మండలంలో తగిన సమన్వయంతో సమీకృతంగా పని చేయడం ద్వారా పార్టీని తిరిగి బలోపేతం చేయవచ్చు. యువతకు ప్రాధాన్యం ఇస్తూనే అనుభవజ్ఞుల సహకారం తీసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి సమర్థవంతమైన నాయకత్వం ఉన్నందున వచ్చే ఎన్నికల్లో విజయం సాధించగలగాలని విశ్వాసం ఉంది అని చెప్పారు.. ఈ కార్యక్రమంలో బానోత్ హమ్మే నాయక్ , విజేందర్ రెడ్డి, నెమరుగోముల ప్రవీణ్ రావు, నెహ్రు నాయక్, ముద్దసాని సురేష్, రంగు మురళి,పొడిశెట్టి సైదులు, ముత్యాల పూర్ణచందర్, ఎండి జానీ పాషా, దాసరి శ్రీనివాస్, చిలుక దేవేంద్ర, శైలజ, ఓరుగంటి సతీష్, తన్నీరు వేణు,బిసు హరి కృష్ణ, ఎరుకల సమ్మయ్య, చెరుకు సత్యం, దంతాలపల్లి రవి, ఉపేందర్, మోహన్, యాకయ్య, మహేష్, సంపత్, కార్యకర్తలు గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు

**మెహదీపట్నం :**
హైదరాబాద్ నగర పోలీసు ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. చారిత్రాత్మక గోల్కొండ కోట ప్రాంతంలో ఉన్న ఏసీపీ డివిజన్ పేరును మార్చారు. గోల్కొండ ఏసీపీ డివిజన్‌ను టోలిచౌకి డివిజన్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# జిహెచ్ఎంసి వ్యాప్తంగా 179 ఫిర్యాదులు

- ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలి
- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్

**హైదరాబాద్ సిటీ, మే 19(జనంసాక్షి):**
ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగర నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల పై విన్నపాలను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్‌వి కర్ణన్ మాట్లాడుతూ... ప్రజలు వ్యక్తిగత, సామాజిక సమస్యలను వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు వాటిని బాధ్యత తో పరిష్కరించాలని తెలిపారు. ఆర్థిక పరమైన ఫిర్యాదుల పై క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకున్నది, లేనిది సంబంధిత అర్జీదారునికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 66 ఫిర్యాదులు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ 33, ఇంజనీరింగ్ 6, ట్యాక్స్ సెక్షన్ 5, ఎలక్ట్రిక్, ల్యాండ్ అక్విజిషన్, ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్, హౌసింగ్, విజిలెన్స్ విభాగాలకు రెండు చొప్పున, హెల్త్, ఎస్టేట్, లేక్స్, యుబిడి విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు వచ్చాయి. జిహెచ్ఎంసి



పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 113 ఫిర్యాదులు వచ్చాయి. అందులో కూకట్ పల్లి 40, శేరిలింగంపల్లి 14, ఎల్బీనగర్ 09, సికింద్రాబాద్ 17, చార్మినార్ 03, ఖైరతాబాద్ 30 ఫిర్యాదులు అందాయి. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ లు వేణు గోపాల్, పంకజ, గీతా రాధిక, నళిని పద్మావతి, రఘు ప్రసాద్, యాదగిరి రావు, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి లు గంగాధర్, వెంకన్న, ఎల్ఏఓ రాము నాయక్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, హార్టికల్చర్ అధికారి సునంద, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్, జలమండలి డీజీఎం సాయి రమణ, డిప్యూటీ సిఈ పనస రెడ్డి, పి వి రావు, హౌసింగ్ ఈ ఈ రాజేశ్వర రావు, జాయింట్ కమీషనర్ రెవెన్యూ మహేష్ కులకర్ణి, అడ్వర్టైజ్మెంట్ ఆఫీసర్ వెటర్నరీ పర్యవేక్షకులు శైలజ, మెయింటెనెన్స్ ఏ ఈ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.




# పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 19 (జనంసాక్షి) :**
కమ్యూనిస్టు గొప్ప నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి వేడుకలను వేములవాడ నియోజక వర్గం సిఐటియు ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం అశోక్, జిల్లా అధ్యక్షులు ఎగుమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరరెడ్డి అనే పేరును సుందరయ్యగా మార్చుకో వడం జరిగిందన్నారు. పేద ప్రజల కోసం భూమి కోసం, భుక్తి కోసం నిరంతరం పోరాటం చేశారన్నారు. అసెంబ్లీకి సైతం సైకిల్ పై వెళ్లి నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. కమ్యూనిస్టు నేతగా అనేక పోరాటాలు చేసి పేద ప్రజల కోసం కష్టజీవుల కోసం ప్రభుత్వాలపై పోరాడి ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ముక్తి కాంతం అశోక్,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, సిఐటియు నాయకులు సిహెచ్ శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

# మే 24లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపికకు దరఖాస్తు చేసుకోవాలి

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్**

**పెద్దపల్లి, మే 19 (జనం సాక్షి) :**
మే 24 లోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపిక కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లాల్లోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కి రెసిడెన్షియల్ అండ్ నాన్ రెసిడెన్షియల్ పథకంలో భాగంగా ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేయడానికి పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కి రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజనంతో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలకు గాను విద్యార్థికి 42 వేల చొప్పున, నాన్ - రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్ తో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలకు గాను ప్రతీ విద్యార్థికి 28 వేల చొప్పున చెల్లించబడుతుందనీ తెలిపారు. దరఖాస్తు ఫారములు కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయము పెద్దపల్లి యందు సంప్రదించా లని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను మే 24 లోగా కార్యాలయములో అందించాలని, ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.వినోద్ కుమార్ ఆ ప్రకటనలో కోరారు.

# ప్రభుత్వ ఉద్యోగం పేర 9 లక్షలకు టోకరా

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, మే 19 (జనం సాక్షి) :**




ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి తన వద్ద నుంచి మలావత్ మోహన్ అనే వ్యక్తి రూ.9 లక్షలు వసూలు చేశాడని తేజావత్ పీరు అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ రూరల్ మండలం లింగితండాకు చెందిన తేజావత్ పీరు అనే మహిళను తన బంధువైన సిరికొండ మండలం చీమన్ పల్లికి చెందిన మలావత్ మోహన్ ఇప్పటి వరకు తాను చాలా ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించానని, నీకు కూడా ప్రభుత్వ ఉద్యోగం (పోస్ట్ ఆఫీస్ లో) ఇప్పిస్తానని చెప్పాడని, మోహన్ మాటలను నమ్మిన పీరు విడతల వారీగా రూ.4లక్షలు అతడికి ఇచ్చింది. వీటిలో రూ.3 లక్షలు తన భర్త ఫోన్ పే నుంచి చెల్లించగా, మిగతా లక్ష రూపాయలు నగదు ఇచ్చానని, డబ్బులు తీసుకున్న మోహన్ రేపు మాపు అంటూ దాటవేస్తూ వచ్చాడని, తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని లేదా తన డబ్బులు తనకు వాపసు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో పోస్టాఫీస్ లో వచ్చిందని ఒక నకిలీ అపాయింట్ మెంట్ ఆర్డర్ ఇచ్చాడని ఆమె తెలిపారు. అది ఫేక్ అని తేలడంతో మోహన్ ను నిలదీయగా, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని, కోర్టులో జాబ్ ఇప్పిస్తానని మళ్లీ నమ్మించి రూ.5లక్షలు వసూలు చేశాడని, కోర్టులో జాబ్ వచ్చిందని చెప్పి, జిల్లా జడ్జి సంతకం ఫోర్జరీ తో అపాయింట్ మెంట్ ఆర్డర్ కాపీని ఇచ్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. మలావత్ మోహన్ ఉద్యోగం పేరుతో తనను నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసం చేశాడని, వెంటనే అతడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితురాలు పీరు కోరారు.

# యుద్ధానికి విరామమే తప్ప ముగియలేదు

- దేశానికి ఆపదొస్తే అంతు చూసేందుకు మన సైన్యం సిద్ధం
- ఆపరేషన్ సింధూర్ తో మన సైనిక సత్తా యావత్ ప్రపంచానికి తెలిసింది.
- మోదీ నాయకత్వానికి, భారత సైన్యానికి సంఘీభావంగా 'తిరంగా ర్యాలీ.
- తిరంగా ర్యాలీ'లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్.
- కరీంనగర్ తెలంగాణ చౌక్ నుండి రాంనగర్ వరకు 'తిరంగా ర్యాలీ' నిర్వహించిన బీజేపీ.



**కరీంనగర్ బ్యూరో, మే 19 (జనంసాక్షి) :**
యుద్ధానికి విరామమే తప్ప ముగియలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. దేశానికి ఆపదొస్తే టెర్రరిస్టుల అంతూ చూసేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. ఆపరేషన్ సింధూర్ తో మన సైనిక సత్తా యావత్ ప్రపంచానికి తెలిసిందన్నారు. పాకిస్తాన్ ప్రజల ప్రాణాలకు నష్టం లేకుండా ఉగ్రవాద శిబిరాలను ముట్టుపెట్టిన ఘనత మన సైనికులదేనని కొనియాడారు. నరేంద్ర మోదీ నాయకత్వానికి, భారత సైన్యానికి సంఘీభావంగా దేశవ్యాప్తంగా 'తిరంగా ర్యాలీ' నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజు సాయంత్రం కరీంనగర్ లోని గీతాభవన్ చౌరస్తా నుండి రాంనగర్ చౌరస్తా వరకు 'తిరంగా ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు జాతీయ జెండాను చేతబట్టి ఈ ర్యాలీకి తరలివచ్చి ప్రధాని మోదీ నాయకత్వానికి, భారత సైన్యానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.... పహల్గాంలో అమాయక హిందువులపైన, ప్రజలపైన ఉగ్రవాదులు జరిపిన దాడి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాలతో భారత సైనికులు పాకిస్తాన్ లోని టెర్రరిస్టుల శిబిరాలను ధ్వంసం చేశారు. మోదీకి, సైన్యానికి సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా 'తిరంగా ర్యాలీ' నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే కరీంనగర్ లో నిర్వహించిన ర్యాలీకి భారీ ఎత్తున హాజరై సంఘీభావం తెలిపారు. వారందరికీ క్రుతజతలు తెలిపారు.

పాకిస్తాన్ సామాన్య ప్రజల ప్రాణాలకు నష్టం లేకుండా ఆ దేశంలోకి వెళ్లి ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన తీరు అమోఘం. దాదాపు 100 మంది టెర్రరిస్టులను మట్టుబెట్టిన ఘనత సైనికులదే. మోదీ నాయకత్వ పటిమను చూసి యావత్ ప్రపంచమంతా శెభాష్ అంటోంది. కరోనా, ఆపరేషన్ సింధూర్ వంటి క్లిష్ట సమయాల్లో మన దేశానికి ఏది మంచిదో, ఎప్పుడు ఏం చేయాలో ఆచరిస్తూ టాప్ 5 దేశాల సరసన భారత్ ను నిలిపిన నేత మోదీ...అంతటి గొప్ప నాయకుడు మా ఇంట్లో, మా ఊర్లో పుడితే బాగుండేదని భావిస్తున్నారంటే ఆయనపట్ల ఎంత అభిమానముందో అర్థం చేసుకోవచ్చు.మతం పేరు అడిగి ప్రజలను చంపడం దుర్మార్గం. పెహల్గామ్ ఉగ్రదాడి మానవత్వానికే మాయని మచ్చగా నిలిచింది. పిల్లల ముందు తండ్రిని, భార్యల ముందు భర్తను, ప్యాంటు విప్పి కాల్చి చంపాలని ఏ మతం చెప్పింది? ఉగ్రవాదుల అరాచకాలకు అంతులేకుండా పోతోంది. 2005, 2006లో ముంబై లోకల్ ట్రైన్లలో బాంబుపేలుళ్లు, ముంబయి పేలుళ్లు, కోయంబత్తూరు, జామా మసీదు పేలుళ్లు... హైదరాబాద్ లో గోకుల్ చాట్, లుంబనీపార్కు, దిల్ సుఖ్ నగర్, మక్కా మసీదు పేలుళ్లు ఇంకా గుర్తుకొస్తున్నయ్. "ఆపరేషన్ సింధూర్" పేరుతో అద్భుతమైన సేవలందించిన మన భారత సైనికుల ధైర్యసాహసాలను గుర్తు చేస్తూ నిర్వహిస్తున్న ఈ "తిరంగా యాత్ర... మద్దతిస్తున్న సమస్త ప్రజానీకానికి శతకోటి వందనాలు. నరేంద్రమోదీ మంత్రివర్గంలో సభ్యుడిగా ఉంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగడం నా అదృష్టం. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా కంట్రోల్ రూం బాధ్యతలు నిర్వర్తిస్తూ భారత సైనికుల ధైర్యసాహసాలను కళ్లారా చూసే అదృష్టం నాకు కలిగింది. మన భారత సైనికులను చూసి గర్విస్తున్నానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయండి





- రేకంపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి, మే 19 (జనంసాక్షి ):**అ గృహ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదఅన్నారు. సోమవారం దుగ్గొండి మండలం లోని రేకంపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఇండ్లు నిర్మించుకుంటున్న రంపిసా అశ్వినీ, రంపిసా కళావతి లతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని అన్నారు. లబ్ధిదారుల ఖాతాలో బేస్మెంట్కు లక్ష, రూఫ్ లెవల్ బిల్లు మొత్తం 2 లక్షలు రూపాయలు జమచేయడం జరిగిందని, నిర్మాణం పూర్తి కాగానే మిగతా రూ 3 లక్షలు జమ చేస్తామని కలెక్టర్ సత్య శారద అన్నారు. ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నుండి నేరుగా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ అయినందుకు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డీవో ఉమారాణి, గృహ నిర్మాణ శాఖ పిడి గణపతి డి ఈ విష్ణువర్ధన్ రెడ్డి దుగ్గొండి మండల అభివృద్ధి అధికారి లెక్కల అరుంధతి తాహసిల్దార్ రవి చంద్రారెడ్డి, ఎంపీఓ మోడెం శ్రీధర్ గౌడ్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# టిటిఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్**

**సుల్తానాబాద్,మే 19(జనం సాక్షి) :**
టిటిఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ అన్నరు. సోమవారం సుల్తానాబాద్ గ్రంథాలయం లో జరిగిన పుస్తకాల వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ విద్యే వికాసానికి పునాది అని , మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ గ్రంథాలయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, గ్రంథాలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుంది అని, తాను చైర్మన్ అయ్యాక జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని , 5 కోట్ల తో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయాన్ని అభివృద్ధికి ప్రణాళికలు ఉన్నాయని అదేవిదంగా జిల్లాలో మిగతా గ్రంథాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, విద్యావంతుడు అయిన టిటిఆర్ మంచి ఆలోచనతో తమ సంస్థ ద్వారా సుమారు యాభై వేల విలువైన పుస్తకాలను తమకు అందజేయడం అభినందనీయమని అన్నారు.అంతకు ముందు టిటిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు తానిపర్తి తిరుపతి రావు మాట్లాడుతూ సుల్తానాబాద్ లైబ్రరీ ఎంతో చరిత్ర కలిగి ఉన్నదని, దేశం లో స్వాతంత్ర్యానికి పూర్వం 1913 లో ఏర్పడ్డ అతి పురాతన లైబ్రరీలో ఒకటని తాను చదువుకునే రోజుల్లో లైబ్రరీకి వెళ్ళేవాడిని అని, ఈ రోజుల్లో లుక్ కల్చర్ పెరిగి బుక్ కల్చర్ తగ్గింది అని



ఈ దశలో పఠనాసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉన్నది అని, తమ సంస్థ ఇదివరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించింది అని ఓ మంచి కార్యక్రమం తో మా కార్యక్రమాలను సుల్తానాబాద్ కేంద్రం గా మొదలు పెట్టాము అని త్వరలోనే తమ కార్యాలయాన్ని సుల్తానాబాద్ లో ఏర్పాటు చేస్తామనీ,అన్నారు ఈ కార్యక్రమం లో టిటిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కాసర్ల మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకారి రాజేశం, సంయుక్త కార్యదర్శి ముంజాల హరికృష్ణ గౌడ్, వేముల కిరణ్ గౌడ్, పురం రమణ , లైబ్రరీ ఇన్చార్చ్ దీప, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## తప్పుకున్న టీమ్ ఇండియా

**ఆసియా కప్‌పై వచ్చిన వార్తలను ఖండించిన బీసీసీఐ**

భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో 2025లో జరగనున్న ఆసియా కప్ టోర్నమెంట్ నుంచి టీమ్ ఇండియా తప్పుకోనున్నట్లు, అలాగే జూన్‌లో జరిగే మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లోనూ పాల్గొనబోదని కొన్ని ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగా పాకిస్థాన్ మంత్రి, పీసీబీ చైర్మన్ మోహిన్ నఖ్వీ ఉన్న నేపథ్యంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తలను బీసీసీఐ స్పష్టంగా ఖండించింది.
ఈ విషయంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ, "ఆసియా కప్ లేదా మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో భారత జట్టు పాల్గొనదన్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. ఏసీసీ ఈవెంట్లలో ఇప్పటివరకు ఎలాంటి చర్చ జరగలేదు. ప్రస్తుతం మా దృష్టి ఐపీఎల్‌ను సజావుగా నిర్వహించడంతో పాటు, పురుషుల, మహిళల భారత జట్ల ఇంగ్లాండ్ పర్యటనపైనే ఉంది. ఆసియా కప్ లేదా ఇతర ఏసీసీ ఈవెంట్‌ల గురించి ఎటువంటి చర్చ జరగలేదు. ఈ వార్తలు పూర్తిగా ఊహాజనితమైనవి. ఏసీసీ ఈవెంట్‌లకు సంబంధించి ఏదైనా నిర్ణయం తీసుకుంటే, అది మీడియాకు సమాచారం ఇవ్వబడుతుంది" అని తెలిపారు.

## పీఓకేలో మా పేరెంట్స్ : మొయిన్ అలీ

ఐపీఎల్‌లో 18 సీజన్ తదుపరి మ్యాచ్‌లకు దూరమయ్యాడు కోల్‌కతా స్పిన్ ఆల్‌రౌండర్ మోయిన్ అలీ. కుటుంబసభ్యులకు అనారోగ్యం కారణంగా తిరిగి భారత్‌కు రావడం లేదని చెప్పిన అలీ.. సోమవారం షాకింగ్ విషయాలు పంచుకున్నాడు. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో తన తల్లిదండ్రులు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్నారని తెలిపాడు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ వాళ్లకు ఏమైనా అవుతుందేమోనని చాలా భయపడ్డానని అలీ వెల్లడించాడు. ఐపీఎల్ మధ్యలోనే స్వదేశం వెళ్లిన మోయిన్ అలీ సోమవారం బియర్ బిఫోర్ వికెట్ పాడ్‌కాస్ట్ షోలో మాట్లాడాడు. 'భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతల సమయంలో మా తల్లిదండ్రులు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్నారు. వాళ్లు ఒక గంటలో తిరిగి వస్తారు అనుకుండగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది.

# శ్రేయాస్



## ఐపీఎల్ చరిత్రలో అయ్యర్ రికార్డు

### మూడు జట్లను ప్లే-ఆఫ్స్‌కు చేర్చిన తొలి కెప్టెన్

ఐపీఎల్‌లో శ్రేయాస్ అయ్యర్ తన అద్భుత ఆటతీరు, కెప్టెన్సీతో రికార్డులను బద్దలు కొడుతున్నాడు. గత సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపిన అయ్యర్, ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను టైటిల్‌కు దగ్గర చేశాడు. అతడి నాయకత్వంలో పంజాబ్ ప్లే-ఆఫ్స్‌కు దూసుకెళ్లింది. దీంతో, ఐపీఎల్ చరిత్రలో మూడు భిన్న జట్లను ప్లే-ఆఫ్స్‌కు తీసుకెళ్లిన తొలి కెప్టెన్‌గా అయ్యర్ చరిత్ర సృష్టించాడు. నాలుగు సీజన్లలో ప్లే-ఆఫ్స్‌కు జట్లను నడిపించిన కెప్టెన్‌గా కూడా అతడు విశేష గుర్తింపు పొందాడు.
టీ20 ఫార్మాట్‌లో పరుగుల వరద పారిస్తూ, కెప్టెన్‌గా విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నాడు అయ్యర్. 2019లో ఢిల్లీ క్యాపిటల్స్ సారథిగా జట్టును ప్లే-ఆఫ్స్‌కు చేర్చిన అతడు, మరుసటి సీజన్‌లోనూ ఢిల్లీని ప్లే-ఆఫ్స్ నడిపించాడు. 2024 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ పగ్గాలు చేపట్టిన అయ్యర్, తనదైన కెప్టెన్సీతో జట్టును గెలుపు బాటలో నడిపాడు. లీగ్ దశలో అన్ని జట్లను ఆశ్చర్యపరుస్తూ కోల్‌కతా ప్లే-ఆఫ్స్‌కు చేరగా, నాకౌట్‌లోనూ అద్భుత ప్రదర్శనతో మూడోసారి ఐపీఎల్ ట్రోఫీ సొంతం చేసుకుంది. అయితే, కోల్‌కతా విజయానికి మెంటార్ గౌతం గంభీర్‌కు క్రెడిట్ ఎక్కువగా దక్కడంతో అసంతృప్తి చెందిన అయ్యర్, జట్టుతో కొనసాగడానికి ఇష్టపడకుండా మెగా వేలంలోకి వచ్చాడు. యూఏఈలో జరిగిన వేలంలో అతడిని పంజాబ్ కింగ్స్ రూ.26.75 కోట్ల రికార్డు ధరకు దక్కించుకుంది.
కెప్టెన్ ఇన్నింగ్స్‌లతో పంజాబ్ రేసులో నిలవడం
ఐపీఎల్ ఆరంభం నుంచి టైటిల్ కోసం ఎదురుచూస్తున్న పంజాబ్ కింగ్స్ 2014లో ఫైనల్ ఆడినప్పటికీ, కోల్‌కతాతో 3 వికెట్ల తేడాతో ఓడిపోయింది. అప్పటి నుంచి లీగ్ దశలోనే వెనుదిరుగుతున్న పంజాబ్ ఈసారి అయ్యర్, కోచ్ రికీ పాంటింగ్ ఆధ్వర్యంలో బలంగా తిరిగి వచ్చింది. అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌లతో జట్టులో ఆత్మవిశ్వాసం నింపాడు. 12 మ్యాచ్‌లలో 174.69 స్ట్రైక్ రేట్‌తో 435 పరుగులు సాధించాడు. మే 18న రాజస్థాన్ రాయల్స్‌పై 10 పరుగుల విజయంతో పంజాబ్ ప్లే-ఆఫ్స్‌కు చేరువైంది. అదే సమయంలో ఆదివారం డబుల్ హెడర్‌లో గుజరాత్ టైటాన్స్ ఢిల్లీ క్యాపిటల్స్‌పై 10 వికెట్ల విజయంతో ప్లే-ఆఫ్స్‌లో అడుగుపెట్టగా, అయ్యర్ సేన, గిల్ బృందంతో పాటు ఆర్‌సీబీ కూడా ప్లే-ఆఫ్స్‌కు చేరింది. లీగ్ దశ చివరి మ్యాచ్‌లలో పంజాబ్ మే 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో, మే 26న ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.
శ్రేయాస్ అయ్యర్ ఐపీఎల్ రికార్డు

**కెప్టెన్సీ విజయాలు**

**2019:** ఢిల్లీ క్యాపిటల్స్‌ను ప్లే-ఆఫ్స్‌కు నడిపించాడు.
**2020:** ఢిల్లీ క్యాపిటల్స్‌ను మళ్లీ ప్లే-ఆఫ్స్‌కు చేర్చాడు.
**2024:** కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపి మూడో ఐపీఎల్ టైటిల్ సాధించాడు.
**2025:** పంజాబ్ కింగ్స్‌ను ప్లే-ఆఫ్స్‌కు తీసుకెళ్లాడు, మూడు భిన్న జట్లను ప్లే-ఆఫ్స్‌కు చేర్చిన తొలి కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు.

**బ్యాటింగ్ ప్రదర్శన (2025 సీజన్)**
మ్యాచ్‌లు : 12
పరుగులు : 435
స్ట్రైక్ రేట్ : 174.69

**ప్రముఖ విజయం:**
రాజస్థాన్ రాయల్స్‌పై 10 పరుగుల విజయం (మే 18, 2025)


**వేలం వివరాలు**
జట్టు: పంజాబ్ కింగ్స్
ధర: రూ.26.75 కోట్లు

**వేలం స్థలం:**
యూఏఈ

**లీగ్ దశ చివరి మ్యాచ్‌లు**
మే 24, 2025: ఢిల్లీ క్యాపిటల్స్‌తో
మే 26, 2025: ముంబై ఇండియన్స్‌తో

## కేఎల్ రాహుల్‌పై విమర్శలు సరికాదు

**ఐపీఎల్ మాజీ కోచ్ టామ్ మూడీ**



గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ సెంచరీతో అదరగొట్టినప్పటికీ, ఢిల్లీ క్యాపిటల్స్ ఓటమిపాలైంది. ఢిల్లీ నిర్దేశించిన 200 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ ఓపెనర్లు ఒక్క వికెట్ కోల్పోకుండా ఛేదించారు. అయితే, కేఎల్ రాహుల్ అద్భుతంగా ఆడినప్పటికీ అతడికి తగిన గుర్తింపు లభించలేదని ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు, ఐపీఎల్ మాజీ కోచ్ టామ్ మూడీ అభిప్రాయపడ్డాడు. రాహుల్ ఇన్నింగ్స్ వల్లే ఢిల్లీ స్కోరు 200 పరుగుల వరకు చేరిందని, అతడిపై విమర్శలు సరికాదని పేర్కొన్నాడు.
"కేఎల్ రాహుల్ చుట్టూ విమర్శలు ఎప్పుడూ అసాధారణంగా కనిపిస్తాయి. అతడు అందరూ ఊహించిన దానికంటే గొప్ప ఆటగాడని నేను భావిస్తాను. అతడు ఆడిన ఇన్నింగ్స్ గొప్పగా ఉంది. అయితే, జట్టు 220 పరుగులు చేసే అవకాశం ఉన్నప్పటికీ అది సాధ్యం కాలేదు. క్రికెట్ వ్యక్తిగత ఆట కాదు, అందరూ కలిసి రాణించాలి. మిడిల్ ఓవర్లలో రాహుల్ కొన్ని బంతులు మాత్రమే ఆడాడు, దీంతో కాస్త లయ కోల్పోయాడు" అని మూడీ వివరించాడు. ఈ మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ 65 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో 112 పరుగులు చేశాడు. అయితే, గుజరాత్ ఓపెనర్లు సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ అద్వితీయ బ్యాటింగ్‌తో చెలరేగడంతో ఢిల్లీ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది.

## నెట్ బౌలర్ నుంచి ఆర్సీబీ ప్రధాన పేసర్

**బ్లెస్సింగ్ ముజరబని ప్రస్థానం**



ఐపీఎల్ 18వ సీజన్‌లో ప్లే-ఆఫ్స్‌కు చేరిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ తొలి టైటిల్‌పై కన్నేసింది. గతంలో మూడుసార్లు ఫైనల్‌లో ఓడిన ఆర్సీబీ, ఈసారి ఛాంపియన్‌షిప్ కలను సాకారం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ లక్ష్యంతో, కీలకమైన ప్లే-ఆఫ్స్ మ్యాచ్‌ల కోసం పేస్ బౌలింగ్ దళాన్ని బలోపేతం చేసే పనిలో పడింది. లీగ్ దశ తర్వాత ప్రధాన పేసర్ లుంగి ఎంగిడి జట్టును వీడనున్న నేపథ్యంలో, ఆ స్థానంలో జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబనిని ఆర్సీబీ తాత్కాలిక ఆటగాడిగా జట్టులోకి తీసుకుంది. ఈ విషయాన్ని ఆర్సీబీ యాజమాన్యం సోమవారం ఎక్స్ వేదికపై వెల్లడించింది."6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న బ్లెస్సింగ్ ముజరబని ప్లే-ఆఫ్స్ కోసం ఆర్సీబీ స్క్వాడ్‌లో తాత్కాలిక ఆటగాడిగా చేరనున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ కోసం ఎంపికైన లుంగి ఎంగిడి మే 26న స్వదేశానికి వెళ్తాడు. అతడి స్థానంలో 28 ఏళ్ల ఈ జింబాబ్వే పేసర్ ప్లే-ఆఫ్స్ మ్యాచ్‌లలో ఆడనున్నాడు" అని ఆర్సీబీ పేర్కొంది. ఇటీవల బంగ్లాదేశ్‌పై 10 వికెట్లతో మెరిసిన ముజరబని, తొలిసారి ఐపీఎల్‌లో తన పేస్ పవర్‌ను చూపించేందుకు సిద్ధమవుతున్నాడు.
లక్నో నెట్ బౌలర్ నుంచి ఆర్సీబీ స్క్వాడ్‌కు
గతంలో ఈ జింబాబ్వే పేసర్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు నెట్ బౌలర్‌గా పనిచేశాడు. అప్పటి లక్నో హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్, ప్రస్తుతం ఆర్సీబీకి కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆ సమయంలో ముజరబనితో ఏర్పడిన పరిచయం, అతడి ఇటీవలి ఫామ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఆర్సీబీ యాజమాన్యం అతడిని స్క్వాడ్‌లోకి తీసుకుంది. టీ20 ఫార్మాట్‌లో ముజరబని గొప్ప రికార్డు కలిగి ఉన్నాడు. ఇప్పటివరకు 7.28 ఎకానమీ రేట్‌తో 127 వికెట్లు సాధించాడు. అతడి అత్యుత్తమ గణాంకాలు 3/8. జింబాబ్వే జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న ముజరబని, ఇంగ్లండ్‌తో మే 22 నుంచి మే 25 వరకు జరిగే నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ఆడనున్నాడు. ఈ సిరీస్ తర్వాత అతడు ఆర్సీబీ స్క్వాడ్‌లో చేరనున్నట్లు సమాచారం. జోష్ హేజిల్‌వుడ్ ఇప్పటికే జట్టుకు దూరమవ్వడంతో, భువనేశ్వర్ కుమార్‌తో కలిసి ముజరబని పేస్ దళంలో నిప్పులు చెరగనున్నాడు. ప్లే-ఆఫ్స్‌లో తన సత్తా చాటేందుకు ఈ యువ జింబాబ్వే పేసర్ సిద్ధంగా ఉన్నాడు.

## శుభ్మన్ గిల్‌కు టెస్టు కెప్టెన్సీ అప్పగిస్తే : గుజరాత్ కోచ్

టీమ్ ఇండియా టెస్టు కెప్టెన్సీపై చర్చ ఊపందుకుంది. రోహిత్ శర్మ టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో, ఇంగ్లండ్‌తో జరగనున్న ఐదు టెస్టుల సిరీస్‌కు నాయకత్వం వహించే విషయం ఆసక్తికరంగా మారింది. కెప్టెన్సీ రేసులో శుభ్మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే, బుమ్రా తరచూ గాయాలతో సతమతమవు తుండటంతో గిల్ ఈ రేసులో ముందంజలో ఉన్నాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌ను గిల్ అద్భుతంగా నడిపిస్తున్నాడు.
ఈ నేపథ్యంలో గిల్‌కు టెస్టు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తే ఎలా ఉంటుందనే ప్రశ్నకు గుజరాత్ టైటాన్స్ అసిస్టెంట్ కోచ్ ఆశిష్ కపూర్ స్పందించాడు. "గిల్‌ను నేను అండర్-16 స్థాయి నుంచి గమనిస్తున్నాను. అతడు అందరికంటే లోతుగా ఆలోచిస్తాడు. తన గురించి మాత్రమే కాక, జట్టులోని మిగతా ఆటగాళ్ల గురించి కూడా ఆలోచిస్తూ మ్యాచ్‌లను గెలవడానికి ప్రణాళికలు రూపొందిస్తాడు" అని వివరించాడు. అయితే, పరిమిత అనుభవంతో కెప్టెన్సీ సామర్థ్యాన్ని అంచనా వేయడం కష్టమని కపూర్ అభిప్రాయపడ్డాడు. "2007లో ధోనీకి టీ20 ప్రపంచకప్ కెప్టెన్సీ అప్పగించినప్పుడు అతడికి గతంలో నాయకత్వ అనుభవం లేదు. అయినా, అతడు ప్రపంచంలోనే అత్యుత్తమ కెప్టెన్‌గా ఎదిగాడని ఎవరూ ఊహించలేదు. అందుకే, ఏ ఆటగాడిపైనా తొందరపాటు తీర్పు ఇవ్వకముందు కొంతకాలం గమనించాలి. గిల్ విషయంలో ఇప్పుడే ఏదీ చెప్పడం కష్టం" అని కపూర్ పేర్కొన్నాడు.

## చాహల్ చాలా కేరింగ్ పర్సన్ : మహ్‌వశ్



టీమ్ ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్ మరియు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, రేడియో జాకీ మహ్‌వశ్ డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు కొంతకాలంగా జోరుగా సాగుతున్నాయి. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను వీరిద్దరూ కలిసి చూడటం, మ్యాచ్‌కు ముందు మహ్‌వశ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ వీడియో, ఫొటోలు పోస్ట్ చేయడంతో ఈ వార్తలు మరింత బలపడ్డాయి. ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు పలు ఈవెంట్‌లలోనూ వీరు జంటగా కనిపించారు. దీంతో చాహల్, మహ్‌వశ్ ప్రేమలో ఉన్నారనే చర్చలు ఊపందుకున్నాయి. అయితే, వీరిద్దరూ తమ సంబంధంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.
ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మహ్‌వశ్, చాహల్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. ఇంటర్వ్యూలో 'చాహల్‌లో ఏ లక్షణం మీకు ఎక్కువగా నచ్చింది?' అని విలేకరి అడిగిన ప్రశ్నకు, ఆమె సమాధానిస్తూ, 'చాహల్ చాలా మంచివాడు, వినయంతో ఉంటాడు. అతను చాలా శ్రద్ధగల వ్యక్తి. ఎంత బిజీగా ఉన్నప్పటికీ, తనకు ప్రియమైనవారి కోసం ఎప్పుడూ సమయం కేటాయిస్తాడు. ఆ గుణాన్ని నేనూ స్వీకరించాలను కుంటున్నాను' అని చెప్పింది. మహ్‌వశ్ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె కామెంట్స్‌తో వీరి సంబంధంపై మరోసారి చర్చలు ఊపందుకున్నాయి.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఎడపల్లి, మే 19 ( జనంసాక్షి ) :**
ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, అంబం, నెహ్రూ నగర్ గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించడంతోపాటు ఇండ్ల నిర్మాణ పనులకు సైతం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. అయితే ఇందిరమ్మ పథకం లబ్ధిదారులకు ప్రభుత్వమే అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ఈ విషయంలో రాజకీయ నాయకులు గాని, అధికారులకు గాని ఒక్క పైసా కూడా ఇవ్వద్దని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నుండి ఎవరైనా పైసలు వసూలు చేసినట్లు తెలిస్తే మాత్రం వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బిల్ల రామ్మోహన్, నెహ్రూ నగర్ మాజీ సర్పంచ్ అమానుల్ల షరీఫ్, ఖాజా, ఒడ్డెన్న, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరటూరి సత్యనారాయణ, బొబ్బిలి శ్రీనివాస్, ఎడపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంజ కామప్ప, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రజిత, మాజీ సర్పంచులు శంకర్ నాయుడు, ఎల్లయ్య యాదవ్, పాల్ద భాస్కర్ రెడ్డి, ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మచ్కూర్ గంగాధర్, జెసిబి ప్రతాప్ రెడ్డి, ప్రసాద్, యాసాడ రాజకుమార్, కంచరి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, బర్దిపూర్ అశోక్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో గ్రామ దేవతలకు పెద్దపీట





- వల్మిడి పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి
- బోనమెత్తిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, మే 19 (జనంసాక్షి)**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో గ్రామ దేవతలకు పెద్దపీట వేసి, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు, సోమవారం మండలంలోని వల్మీడీలో జరిగిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరై, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పెద్దమ్మ తల్లికి బోనం సమర్పించారు, అనంతరం పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ముదిరాజుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ముదిరాజుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. వల్మీడీ గ్రామాన్ని పర్యాటక రంగంలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. తెలంగాణలోని సంస్కృతి సాంప్రదాయాలకు గొప్ప ప్రాధాన్యత ఉందని అన్నారు. గ్రామదేవతలను ఆరాధించడంలో తెలంగాణ ప్రజలకే సాధ్యమన్నారు. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, సొసైటీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరమనేని యాకాంతారావు, రాజేష్ నాయక్, ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ నాయకులు చిక్కుడు రాములు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నీరటి చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ నీరటి సోమయ్య, వంగ సైదులు, పోగు శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం నాయకులు కాంగ్రెస్ మండల గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు,

## దళితులపై వివక్ష చూపిన బీఆర్ఎస్ పార్టీ

- మంత్రి శ్రీదర్ బాబుని ఎదుర్కోలేక మహిళా అధికారినిపై అక్కసు..
- కాంగ్రెస్ వ్యవహారాల్లో మధు జోక్యమెందుకు..
- ఐఏఎస్ అధికారినికి పుట్ట మధు క్షమాపణ చెప్పాలి
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి మే 19 (జనం సాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్.కే గార్డెన్స్‌లో సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు మీడియా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు, కౌన్సిల్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద సరస్వతి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తుంటే ఓర్వలేక మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సంబంధం లేని విషయాల్లో తలదూర్చడం ఎందుకని ప్రశ్నించారు. పుష్కరాల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వం ఆద్వర్యంలో జరుగుతోందని, ప్రోటోకాల్ వ్యవహారం సీఎం, ప్రభుత్వ పెద్దలు చూసుకుంటారని, కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాల్లో నీ జోక్యమేందుకను మధును నిలదీశారు. పుష్కరాల ప్రారంభం సమాచారం పెద్దపల్లి ఎంపీకి కూడా అందించారని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా మంత్రి శ్రీధర్ బాబు సతీమణి ఐఏఎస్ అధికారిని శైలజా రామయ్యర్ నిబంధనల మేరకు సమాచార సమాచారం ఇచ్చారనీ అన్నారు. మంత్రి శ్రీధర్ బాబును ఎదుర్కొనే దమ్ములేక మహిళా అధికారిని పట్ల పుట్ట మధు చేసిన వ్యాఖ్యలు సరికాదని, వెంటనే ఆమెకు మధు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో దళితులను ఎలా ఇబ్బంది పెట్టారో రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. మా పార్టీ ఎంపీ ప్రోటోకాల్ విషయంలో బీఆర్ఎస్ నాయకుడు ఎందుకు జోక్యం చేసుకున్నారని, దీనివెనుక ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మంథని నియోజకవర్గంలో దళితులపై దాడులు, హత్యలు ఇంకా ప్రజలు మర్చిపోలేదని అన్నారు. రాజకీయాలకు సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకుని రాద్ధాంతం చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో ఎంపీ ఎన్నికల్లో గడ్డం వంశీ కృష్ణ భారీ మెజారిటీతో గెలుపొందారని గుర్తు చేశారు. స్థానికంగా జరిగే కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ఎలా ఉంటుందో కూడా రాజకీయ అవగాహన లేకుండా మధు మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఇంకో సారి తమ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో తలదూరిస్తే చూస్తూ ఊరుకోమని, తక్షణమే దేవాదాయ ప్రిన్సిపాల్ సెక్రటరి కి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, మాజీ జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, సింగల్ విండో చైర్మన్లు, డైరక్టర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి**




**వరంగల్ ప్రతినిధి, మే 19(జనంసాక్షి):**
జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షల సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఇంటర్మీడియట్ హైయర్ ఎడ్యుకేషన్ అధికారి జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ శ్రీధర్ సుమన్ పాల్గొని పరీక్ష ఏర్పాట్లను సమీక్షించారు.మే 22 నుండి 28 వరకు నిర్వహించబోయే ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు, జూన్ 3 నుండి 13 వరకు నిర్వహించే పదవతరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబందింత అధికారులతో పరీక్షల సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సప్లమెంటరీ పరీక్షలకు గాను అన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో డ్యుయల్ డెస్కులు, గాలి, నీరు, విద్యుత్, ఫ్యాన్లు, నీటి వసతి, సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షాల సమయానికి ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్ మ్యాప్ ద్వారా నడిపించే చర్యలు తీసుకోవాలని, ఉదయం, మధ్యాహ్నం రెండు సమయాల్లో పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులు వడదెబ్బకు గురి కాకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్ గాని ఇతర సాంకేతిక గాడ్జెట్ లను ఎవరు తీసుకురాకుండా చూసే బాధ్యత సిఎస్, డి ఓ.లదే బాధ్యతని అన్నారు. జిల్లాలోని పోలీస్, రెవెన్యూ, విద్య, వైద్యం, విద్యుత్, ఆర్టీసీ, పోస్టల్ శాఖ అధికారుల సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షల పర్యవేక్షణకు జిల్లా పరీక్షల కమిటీ, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్, 16 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 16 మంది డిపార్ట్ మెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు.సీసీ కెమెరాల పర్యవేక్షణలో బోర్డు నుండి కమాండ్ కంట్రోల్ రూం ఆధ్వర్యంలో గట్టి నిఘా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ శ్రీధర్ సుమన్ తో పాటు డీఈసీ సభ్యులు మాధవరావు,విజయ నిర్మల, స్కూల్ ఎడ్యుకేషన్ డీఈఓ జ్ఞానేశ్వర్ వివిధ డిపార్ట్ మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
20 మే 2025

# ఆపద సమయంలో ఆపోహలు సృష్టించకండి

- అంబులెన్స్‌లో సిలిండర్లు ఉన్నాయి
- పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్



**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) :** గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాద బాధితులను హాస్పిటల్స్‌కు తరలించిన అంబులెన్స్‌లలో ఆక్సిజన్ సిలిండర్లు లేవంటూ జరుగుతున్న ప్రచారాన్ని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవిందర్ నాయక్ ఖండించారు. ఘటన స్థలం నుంచి ఉదయం 6 గంటల 25 నిమిషాలకు అంబులెన్స్‌లో తొలి పేషెంట్‌ను ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించామని ఆయన తెలిపారు. మొత్తం 8 అంబులెన్స్‌లు ఘటన స్థలానికి పంపించామన్నారు.ఘటనా స్థలం నుంచి 15 మంది పేషెంట్లను 108 అంబులెన్స్‌లలో ఉస్మానియా, కేర్, అపోలో, యశోద హాస్పిటల్స్‌కు తరలించామని చెప్పారు. ప్రతి అంబులెన్స్‌లోనూ ఆక్సిజన్ సౌకర్యం ఉందని ఆయన వివరించారు. ఇలాంటి ఆపద సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం అనవసరమైన అపోహలు సృష్టించి, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది మనోధైర్యాన్ని దెబ్బతీయొద్దని రవిందర్ నాయక్ విజ్ఞప్తి చేశారు. అగ్నిప్రమాద ఘటన గురించి తెలిసిన మరుక్షణమే అప్రమత్తమయ్యామని, ఘటనా స్థలానికి డాక్టర్ల బృందాన్ని పంపించామని డీహెచ్ వెల్లడించారు. క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు, స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసి ఉస్మానియా హాస్పిటల్‌లో సిద్ధంగా ఉంచామని తెలిపారు. దురదృష్టవశాత్తు ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. బాధిత కుటుంబ సభ్యుల పరిస్థితిని అర్థం చేసుకుని, వారికి మరింత అసౌకర్యం కలగకుండా వీలైనంత త్వరగా పోస్ట్‌మార్టమ్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. గౌరవ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా గారి ఆదేశాల మేరకు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సహా ఉన్నతాధికారులంతా ఉదయమే ఉస్మానియా హాస్పిటల్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించామని రవిందర్ నాయక్ తెలిపారు. అన్ని అంబులెన్స్‌లలో ఆక్సిజన్ ఉందని, తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విమర్శలు మాని పని చేయండి

- కిషన్ రెడ్డిపై జగ్గారెడ్డి ఘాటు వ్యాఖ్యలు



**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) :** కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శలు మాని పని చేయండని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి అల్లం భాస్కర్‌తో కలిసి మాట్లాడారు. హైదరాబాద్ పాతబస్తీలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించింది. సీఎం రేవంత్ రెడ్డి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు ఘటనా స్థలానికి వెళ్లి స్వయంగా పరిశీలించారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. బాధితులను కాపాడేం దుకు చేయాల్సిన ప్రయత్నాలు అన్నీ ప్రభుత్వం చేసింది. అయినా కిషన్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడం కరెక్ట్ కాదని జగ్గారెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానేసి.. ఘటనా స్థలంలో కిషన్ రెడ్డి సహాయక చర్యల్లో పాల్గొనాల్సింది అని సెటైర్ వేశారు. కేసీఆర్, కేటీఆర్ డైరెక్షన్‌లో కిషన్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. బాధితులను కాపాడే టెన్షన్‌లో ప్రభుత్వం ఉంటే.. కిషన్ రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి రాజకీయం చేశారని మండిపడ్డారు. ఎక్కడ రాజకీయాలు చేయాలో కూడా కేంద్రమంత్రికి తెలియదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అప్పుల బాధతో కుటుంబం అదృశ్యం

**సిద్దిపేట, మే 19 (జనంసాక్షి) :** పట్టణంలో ఓ అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. ఖాదర్‌పుర వీధిలో నివసించే ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అదృశ్యమయ్యారు. ఫోన్లు కూడా ఇంట్లోనే వదిలేశారు. శనివారం ఉదయం నుంచి ఎవరు కనిపించకపోవడంతో ఏదైనా ఊరికి వెళ్లి ఉంటారని బంధువులు, స్థానికులు భావించారు. కానీ, రెండు రోజులైనా ఆచూకీ తెలియకపోవడంతో వారు కంగారు పడ్డారు. దీంతో బంధువులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. తమకు అప్పులు ఉన్నాయని.. డబ్బు ఇచ్చేవారు తిరిగి ఇవ్వకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నామని ఆ లేఖ రాశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యమైన వారి వివరాలు వీరబత్తిని బాలకిషన్, తండ్రి జనార్ధన్, భార్య వరలక్ష్మి, కుమారుడు శ్రావణ్, కుమార్తెలు కావ్య, శిరీషగా తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# ఆపరేషన్ సిందూర్‌పై ముందే సమాచారం

- కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ, మే 19 (జనంసాక్షి) :** ఆపరేషన్ సిందూర్ గురించి ముందుగానే సమాచారం ఇవ్వడం వల్ల పాక్ అప్రమత్తం అయ్యిందని కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ కొట్టిపడేసింది. ఇది దుష్ప్రచారమని పేర్కొంది. ఇలాంటి వాటితో భారత్ పరువును ప్రతిష్టకు భంగం వాటిల్లగలదని తెలిపింది.

ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన తొలి దశలో పాక్ సహా ఇతర దేశాలకు సమాచారం ఇచ్చామని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపినట్లు పేర్కొంది. కానీ దాడికి ముందే ఈ సమాచారం బయటకు వెళ్లినట్లు- కాంగ్రెస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తుందని తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం జైశంకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పింది. భాజపా రాహుల్ వ్యాఖ్యలను తప్పుబట్టింది. రాహుల్ తమ ప్రభుత్వంపై నిందలు మోపాలనే దురుద్దేశంతోనే ఇటు-వంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించింది. ఆపరేషన్ సిందూర్‌పై బ్రీఫింగ్ ఇస్తూ.. మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ చేసిన ప్రకటనను ఆ పార్టీ ఉటంకించింది. ఆపరేషన్ ప్రారంభించిన వెంటనే తాము ఉగ్రస్థావరాలపై దాడులు చేస్తున్నట్లు పాక్‌కు చెప్పడానికి ప్రయత్నించగా.. భవిష్యత్తులో ఆ దాడులకు తాము తీవ్ర సమాధానం ఇస్తామని దాయాది దేశం చెప్పినట్లు- లెఫ్టినెంట్ జనరల్ పేర్కొన్నట్లు- భాజపా తెలిపింది. జైశంకర్ విదేశాల్లో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఆయనపై ఇటు-వంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడింది. పీఐబీ సైతం కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చింది. కేంద్రమంత్రి ఈ ప్రకటన చేయలేదని తన ఫ్యాక్ట్‌చెక్‌లో పేర్కొంది. రాహుల్ గాంధీ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ ప్రారంభానికి ముందే ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లపై దాడి చేస్తున్నామని.. పాక్ సైన్యం వాటికి దూరంగా ఉండాలని భారత్ చెప్పినట్లు- జైశంకర్ పేర్కొన్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అలా చేయడం వల్ల దాయాది దేశం ముందుగానే అప్రమత్తమయ్యిందని ఆరోపించారు.

# కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ పాక్ పర్యటన

- ఐఎస్ఐ ఆహ్వానం ఉందన్న సిఎం బిశ్వ శర్మ

**గౌహతి, మే19 (జనంసాక్షి) :** పాకిస్తాన్ ఇంటె-లిజెన్స్ ఏజెన్సీ ఐఎస్ఐ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ పాకిస్తాన్‌లో పర్యటించారని, ఐఎస్ఐతో సన్నిహితంగా వ్యవహరించారని అసోం ముఖ్యమంత్రి హిమంత్ బిస్వ శర్మ చేసిన సంచలన ఆరోపణలు వ్యవహారం మరింత ముదురుతోంది. తాజాగా తన వాదనను హిమంత్ బిస్వ శర్మ మరింత బలంగా వినిపించారు. తాను చెప్పింది తప్పని తేలితే సీఎం పదవికి రాజీనామా చేస్తానని అన్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో భూ పోరాటాలకు సిద్ధమవుదాం

- వర్ధంతి సభలో టి సాగర్, ఆర్ వెంకట్ రాములు పిలుపు



**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) :** సుందరయ్య స్ఫూర్తితో భూ పోరాటాలకు సిద్ధమవుదామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ... భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి దిశానిర్దేశం చేశారని అన్నారు. 1913 మే 1న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆలగనిపాడులో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సుందరయ్య 1930లో, 17 ఏళ్ల వయసులో, గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారని తెలిపారు. విడుదలైన తర్వాత, స్వగ్రామంలో వ్యవసాయ కార్మికులను సంఘటితం చేసి, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారని, నేటికీ భూ పంపిణీ సమస్యే కీలకమైనదిగా ఉంది. భూస్వాముల భూముల స్వాధీనం చేసుకొని, పేద రైతులకు, వ్యవసాయ కార్మికులకు పంపిణి చేయాలని, వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించడానికి, ఆత్మహత్యలను నివారించడానికి ఏకైక మార్గమని తెలిపారు. దేశ వ్యవసాయ రంగంలోని సంక్షోభం, ఆత్మహత్యలు, భూ అసమానతలు నివారించడానికి సమాయత్తం కావడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాద్ రావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, నాయకులు శివ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల భర్తీలో స్పీడ్ పెంచిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు

- వరసగా విడుదల అవుతున్న ఫలితాలు

**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) :** పది రోజుల వ్యవధిలోనే 732 ఫార్మసిస్ట్(గ్రేడ్ 2), 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. ఈరోజు ఎంపీహెచ్‌ఏ(ఫీమేల్) పోస్టుల రాత పరీక్ష ఫలితాలను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. 1931 పోస్టులకు గానూ, 20,600 మంది అభ్యర్థులు పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) రాసారు. బోర్డు వెబ్‌సైట్‌లో మార్కుల జాబితా అందుబాటులో ఉందని, హాల్‌టికెట్, ఇతర వివరాలు ఎంటర్ చేసి మార్కులు చెక్ చేసుకోవాలని బోర్డు సూచించింది. త్వరలోనే ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తామని ప్రకటించింది.

# వారంపాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

- విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడి



**విశాఖపట్టణం, మే19 (జనంసాక్షి) :** రానున్న వారం రోజుల పాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని చెప్పింది. రాగల 24 గంటల్లో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. బాపట్ల, నంద్యాల, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, వైయస్ఆర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షాలు కురవనున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. నేడు, రేపు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈరోజు కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్ పేట్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ములుగు, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది.

# పథకాల అమలులో పారదర్శకత ముఖ్యం

- క్షేత్రస్థాయిలో ప్రజలకు పథకాలు చేరాలి
- కార్యక్రమాల అమలుకు మళ్లీ ఆకస్మిక తనిఖీలు
- సమీక్షలో అధికారులతో సిఎం చంద్రబాబు



**అమరావతి, మే19 (జనంసాక్షి) :** పథకాల అమలుతీరును, అధికారుల పనితీరును బేరీజు వేస్తానని, ఇందుకోసం మళ్లీ ఆకస్మిక తనిఖీలు తప్పవని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వచ్చే నెల 12 నుంచే ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై సీఎం సమీక్షించారు. ప్రజా సేవ పథకాల అమలు, సంక్షేమ పథకాల పూర్తిస్థాయి సంతృప్తి ఇంకా కనిపించాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రేషన్, దీపం-2, ఆర్టీసీ, పంచాయతీ సేవలపై అభిప్రాయాలను పరిశీలించారు. పథకాలు, పౌరసేవలపై జూన్ 12 తర్వాత ఆకస్మిక తనిఖీ ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే సేవల్లో ప్రజలకు పూర్తిస్థాయి సంతృప్తి ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపరచాలని ఆదేశాలు జారీ చేశారు. దీపం లబ్ధిదారులకు ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము ఇచ్చే అంశంపై పరిశీలించాలన్నారు. డేటా అనలటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సీఎం మార్గనిర్దేశర చేశారు. ఆర్టీసీ సేవల్లో ఇంకా మార్పులు రావాలని, నాణ్యత పెరగాలన్నారు సీఎం చంద్రబాబు సూచించారు. దీపం పథకంలో ఇచ్చే మూడు సిలండర్ల సబ్సిడీ ఒకేసారి జమ చేస్తామన్నారు. ప్రభుత్వ సేవల్లో డేటా కీలకం అని సీఎం అధికారులతో అన్నారు. 'జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు జరగొచ్చు. ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందే. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలి. దీపం లబ్దిదారుల ఖాతాలో ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము జత అవుతుందని తెలిపారు.

# కల్తీ మద్యం కేసులో ప్రత్యేక టాస్‌ఫోర్స్

- ముగ్గురు సభ్యులుతో బృందం ఏర్పాటు

**అమరావతి, మే19 (జనంసాక్షి) :** జంగారెడ్డి గూడెం కల్తీ మద్యం కేసులో ఏపీ ప్రభుత్వం ప్రత్యేక టాస్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో 2022 మార్చిలో కల్తీ మద్యం కారణంగా చోటు- చేసుకున్న మరణాలపై లోతుగా దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం ముగ్గురు అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు- చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బృందానికి ఏలూరు ఎస్పీ కిశోర్ నేతృత్వం వహించగా.. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ వేణు ప్రభుకుమార్, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు సభ్యులుగా ఉంటారు. కల్తీ మద్యం కారణంగా చోటు- చేసుకున్న మరణాలకు సంబంధించి జంగారెడ్డి గూడెం పోలీస్‌స్టేషన్‌లో నాలుగు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల పరిస్థితిపైనా అధ్యయనం చేయాలని టాస్క్‌ఫోర్స్‌కు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరణాలపై లోతుగా అధ్యయనం చేసి, బాధ్యులెవరో గుర్తించాలని, సాంకేతికపరమైన సిఫార్సులు కూడా చేయాలని ఆదేశించింది. కల్తీ మద్యం కారణంగా దాదాపు 22 మంది అప్పట్లో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# కాళేశ్వరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/మహాదేవపూర్, (జనంసాక్షి):** కాళేశ్వరాన్ని అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం కాళేశ్వరంలో పుష్కర స్నానమాచరించి బండి సంజయ్ కుమార్ దంపతులు ముక్తేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సంజయ్ కుమార్ మాట్లాడుతూ కుంభమేళాలో 50 కోట్ల మంది భక్తులకు అద్భుతమైన ఆతిథ్యమిచ్చామని తెలిపారు. కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు రూ.35 కోట్లు మాత్రమే కేటాయించారని ఆ నిధులు ఎటు సరిపోవని, మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. కుంభమేళా సందర్భంగా 50 కోట్ల మంది భక్తులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన ఆతిథ్యమిచ్చిందని, కాళేశ్వరం పుష్కరాలకు విచ్చేసే 50 లక్షల మందికి ఆతిథ్యం ఇవ్వాలని కోరారు. సోమవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి బండి సంజయ్ సతీమణి బండి అపర్ణతో కలిసి కాళేశ్వరం విచ్చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పోలీస్ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య బండి సంజయ్ దంపతులు సరస్వతి నదీమ తల్లి పుష్కర స్నానాన్ని ఆచరించారు. అక్కడి నుండి నేరుగా సరస్వతి మాతను, శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులకు పూజారులు ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా ఈరోజు కాళేశ్వరం విచ్చేసి పుష్కర స్నానం ఆచరించడం చాలా సంతోషంగా ఉందని, గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమని, 12 ఏండ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు హాజరై స్నానమాచరించడం ఆనందంగా ఉందని అన్నారు. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, వారి కష్టాలన్నీ తొలగిపోవాలని, నరేంద్రమోదీ నాయకత్వంలో దేశానికి మరింతగా సేవలందించేలా దీవించాలని ఆ స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. బండి సంజయ్ వెంట మంథని నియోజకవర్గ ఇంచార్జి చంద్రుపట్ల సునీల్ రెడ్డి, బిజెపి నాయకులు చల్ల నారాయణరెడ్డి, బిజెపి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి, కన్నం యుగంధర్, దొంగల రాజేందర్, స్థానిక నాయకులు ఉన్నారు.

# కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ

- హైడ్రా ప్రజావాణికి 59 ఫిర్యాదులు



**హైదరాబాద్, మే 19 (జనంసాక్షి) :** ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసేయడం పరిపాటిగా మారిపోయిందని అనుకుని గమ్మున ఉండడంలేదు నగర ప్రజలు ఇప్పుడు. ఒకదాని తర్వాత ఒకటిగా పరిష్కారమౌతున్న తీరును చూసి హైడ్రాను ఆశ్రయిస్తున్నారు. హైడ్రాకు ఫిర్యాదు చేస్తే దశాబ్దాల సమస్యకు పరిష్కారం ఇట్టే దొరుకుతోందని గ్రహించిన నగరవాసులు పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాపై ఫిర్యాదులు చేస్తున్నారు. హైడ్రా ప్రజావాణికి సోమవారం వచ్చిన 59 ఫిర్యాదుల్లో 70 శాతం సామాజిక ఫిర్యాదులే ఉన్నాయి. టోలిచౌకి హకీంపేటలో బాబా హెూటల్ వద్ద రోడ్డును ఆక్రమించి షాపు పెట్టేశారంటూ నివాసితులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం సుభాష్‌నగర్‌లో కొంపల్లికి వెళ్లే 50 అడుగుల రహదారి 100 అడుగుల మేర 10 ఫీట్లకే పరిమితమైందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎదెరెదురుగా ఉన్న వారి ప్లాట్లవల్ల ఇరువైపులా 20 అడుగుల చొప్పున కబ్జా చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో సర్వేనంబరు 155లో ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించిన 3500ల గజాల స్థలాన్ని కబ్జా చేస్తున్నారని భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ ప్రజావాణికి ఫిర్యాదు చేసింది. గతంలో మున్సిపాలిటీ అధికారులు కూల్చేసినా దానిని మళ్లీ కబ్జా చేస్తున్నారని పేర్కొంది. ఓయూ కాలనీలో తమ ప్లాట్ ను నలువైపుల మూసివేయడంతోపాటు రహదారి పక్కనే ఉన్న శ్మశానాన్ని కూడా విక్రయించారని ఓ మహిళ ఫిర్యాదు చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం చెంగిచెర్ల గ్రామంలో సర్వే నంబరు 3310లో మొత్తం13 ఎకరాల భూమి ఉండగా.. అందులో 6 ఎకరాల్లో మాతా అరవింద్ కాలనీ ఉంది. మిగతా 7 ఎకరాలను సొంతం చేసుకున్న వ్యక్తి తమది దేవాదాయ శాఖ పరిధిలో ఉందంటూ అధికారులకు ఫిర్యాదు చేసి రిజిస్ట్రేషన్లు అవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఎవరిది దేవాదాయ శాఖ పరిధిలో ఉందో తేల్చాలని.. హైడ్రాను కోరారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370